thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 317 | కరీంనగర్ గురువారం, 23 జనవరి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## మళ్లీ ఒక ఏడాది బీఈడీ

### నాలుగేళ్ల డిగ్రీ లేదా పీజీ చేసినవారే అర్హులు

న్యూఢిల్లీ : మళ్లీ ఒక ఏడాది బీఈడీ కోర్సును ప్రవేశపెట్టే అవకా శాలు ఉన్నాయని జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి(ఎన్‌సీటీఈ) ప్రకటించింది. కేంద్ర విద్యా శాఖకు ఇందుకు సంబంధించిన నిబంధనల డ్రాఫ్ట్‌ను సమర్పించనున్నట్లు ఎన్‌సీటీఈ చైర్మన్ పంకజ్ అరోరా వెల్లడించారు. 2014లో ఈ బీఈడీ కోర్సును రద్దు చేయగా జాతీయ విద్యా విధానంలో చేసిన సిఫార్సుల మేరకు మళ్లీ ప్రవేశపె ట్టాలని నిర్ణయించారు. నాలుగేళ్ల బ్యాచిలర్స్ డిగ్రీ పూర్తిచేసిన లేదా రెండేళ్ల మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులే ఈ కోర్సు చేయవచ్చని అరోరా వెల్లడించారు. మూడేళ్ల డిగ్రీ చేసినవారు ఈ కోర్సు చేసేందుకు వీల్లేదు. ఆ అభ్యర్థులు రెండేళ్ల బీఈడీ కోర్సులో చేరాల్సి ఉంటుం ది. ఒక ఏడాది బీఈడీ కోర్సు సహా పలు ఇతర కోర్సులకు సంబంధించిన నిబంధనలను ఖరారు చేసేందుకు 8 మంది సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు.




# తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా ఈటెల ఫిక్స్..?

## బీసీ మంత్రాన్నే నమ్ముకున్న బిజెపి!

హైదరాబాద్ : తెలంగాణలలో బీజేపీ బీసీ మంత్రాన్నే నమ్ముకుంది. గత ఎన్నికల్లో బీసీ ముఖ్యమంత్రి నినాదం కలిసి రాకపోయినా.. ఆ వర్గాన్ని ఓన్ చేసుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు కనిపిస్తుంది. అందులో భాగంగా ఈటెల రాజేందర్‌కు రాష్ట్ర బీజేపీ పగ్గాలు అప్పజెప్పాలని ఢిల్లీ పెద్దలు ఫిక్స్ అయ్యారంట. ప్రస్తుతం ప్రెసిడెంట్ పదవి కోసం పోటీ పడుతున్న వారితో పోలిస్తే ఈటల బెటర్ అని కాషాయ పెద్దలు భావిస్తున్నారంట. అధ్యక్షుడు కావడానికి ఆర్‌ఎస్‌ఎస్ బ్యాక్‌గ్రౌండ్ అవసరం లేదంటూ తాజాగా కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో ఈటల నియామకం దాదాపు కన్‌ఫర్మ్ అయినట్లే అంటున్నారు. తెలంగాణ కాషాయ రథసారథిగా మల్కాజ్‌గిరి ఎంపీ, మాజీ మంత్రి ఈటెల రాజేందర్ ఎంపిక దాదాపు ఖరారైదంట. ఈ నెలాఖరు లోపే దానిపై అధికారిక ప్రకటన, ఈటెల పగ్గాలు చేపట్టడం ఖాయమంటున్నారు. పార్టీ సంస్థాగత ఎన్నికలు దాదాపు పూర్తవుతున్న క్రమంలో కీలకమైన రాష్ట్ర అధ్యక్ష పదవి ఖరారుపై జాతీయపార్టీ దృష్టి సారించింది. ఈటల సారథ్యంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రత్యేక శ్రద్ధతో ఉన్నారంట. గతంలోనే ఈటెలకు కీలక బాధ్యతలు అప్పగిస్తామని షా మాట కూడా ఇచ్చారు. అయితే బండి సంజయ్, ఈటెల మధ్య గ్యాప్‌తో లోక్‌సభఎన్నికలకు ముందు ఈటెలకు పగ్గాలు ఇవ్వడానికి అధిష్టానం సాహసించలేదంట. అందుకే మధ్యే మార్గంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి మళ్లీ రాష్ట్ర పగ్గాలను అప్పజెప్పిందంటారు. వాస్తవానికి, రాష్ట్రంలో బీసీలలోనే కాకుండా జనాభాపరంగా అత్యధిక సంఖ్యాకులున్న ముదిరాజ్ కులానికి చెందిన ఈటల రాజేందర్‌కు రెడ్డి సామాజిక వర్గంతో కూడా సంబంధాలున్నాయి. ఈటెల సతీమణి రెడ్డి సామాజికవర్గానికి చెందినవారే. బీసీ కార్డు ఓ వైపు.. రాజకీయంగా బలమైన రెడ్డి సామాజికవర్గం మరోవైపు .. ఈటెలకు నాయకత్వ బాధ్యతలు ఇవ్వడం వల్ల రెండు బలాలు కలిసి వస్తాయని బీజేపీ భావిస్తోందంట. బీఆరెస్‌తో మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు, బండి, ఈటెల మధ్య విభేదాలు పార్టీలో అయోమయ వాతావరణం కారణంగా శాసన సభ ఎన్నికల్లో బీజేపీకి గట్టి దెబ్బ పడింది. ఎంపీ ఎన్నికల్లో అనూహ్యంగా పుంజుకున్న బీజేపీ.. బండి సంజయ్‌కు కేంద్ర మంత్రి పదవి ఇవ్వడంతో ఈటెలకు లైన్ క్లియర్ అయ్యిందంటున్నారు. వాస్తవానికి ప్రస్తుతం అధ్యక్ష పదవి రేసులో ఈటెలతో పాటు ఎంపీలు ధర్మపురి అరవింద్, రఘునందన్, మరో నేత రామచంద్రరావు వంటి వారు పోటీ పడుతున్నారు. వారితో పోలిస్తే నాన్ కాంట్రవర్షియల్ నేతగా, రాష్ట్ర వ్యాప్తంగా పరిచయాలు ఉన్న ఈటెల రాజేందరే బెటర్ అన్న ఆలోచనలో అధిష్టానం ఉందంట. రాజా సింగ్ పేరు కూడా వినిపిస్తున్నా.. సామాజిక, ఆర్థిక, రాజకీయ నేపథ్యంతో పాటు వ్యక్తిగతంగా చూసుకున్నా ఈటల రాజేందర్ వైపే ఢిల్లీ పెద్దలు మొగ్గు చూపుతున్నారంట. 2021లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈటలపై కత్తి కట్టి అవమానకరమైన పరిస్థితుల్లో పార్టీ నుంచి బయటకు వెళ్లేలా చేశారు. అప్పుడున్న పరిస్థితుల్లో ఈటల కేంద్రంలో బలంగా ఉన్న బీజేపీ వైపు మొగ్గు చూపాల్సి వచ్చింది ఈటల. తెలంగాణ ఉద్యమకారుడిగా , రాడికల్ భావజాలంతో రాజకీయాల్లో ఎదిగిన ఈటెల మాస్ లీడర్‌గా మంచి పేరు తెచ్చుకున్నారు. ఉద్యమ సమయం నుంచి కేసీఆర్ నమ్మిన బంటుగా ఉంటూ హుజురాబాద్ ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం పదిలం చేసుకున్నారు. వరుసగా ఎమ్మెల్యేగా ఎన్నికవుతూ వచ్చారు. కేసీఆర్‌ను ఎదిరించి బీజేపీ అభ్యర్థిగా బైపోల్స్‌లో కూడా విజయం సాధించి సంచలనం సృష్టించారు. ఆ తరువాత కేసీఆర్ మీద పోటీ చేసే క్రమంలో రెండు పడవల మీద కాళ్లు పెట్టడం, అనూహ్యంగా రెండు చోట్ల ఓడిపోవడం వెంట వెంటనే జరిగిపోయింది. తర్వాత మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలిచి బీజేపీ జెండా ఎగురవేశారు. ఈటెలకు బీజేపీ రాష్ట్ర బాధ్యతలు ఇస్తే ఉద్యమ సంబంధాలు, సామాజిక బలం తోడై పార్టీ మరింత బలోపేత అవుతుందని అధిష్టానం భవిస్తోందంట. ఈటెలకు పగ్గాలు అప్పగించి రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ను కోలుకోకుండా చేయాలని స్కెచ్ గీస్తున్నారంట. బీఆరెస్ నేతలతో సత్సంబంధాలున్న ఈటెల వారిని బీజేపీలోకి లాగుతారనే అంచనాలు వేసుకుంటున్నారంట. దాంతో ప్రధాన ప్రతిపక్షంగా బీజేపీ ఎదగవచ్చని లెక్కలు వేసుకుంటున్నారంట. ప్రధాన ప్రతిపక్షంగా బీఆరెస్ కనుమరుగైతే రాష్ట్రంలో బీజేపీనే ప్రత్యామ్నాయంగా మారుతుంది. ఆ అంచనాలతోనే మాస్ ఇమేజ్ పుష్కలంగా ఉన్న ఈటెలకు పగ్గాలు అప్పజెప్పాలని ఢిల్లీ పెద్దలు ఫిక్స్ అయ్యారంట. వచ్చే వారంలోగా సంస్థాగత ఎన్నికలన్నీ పూర్తవుతున్న తరుణంలో వచ్చే వారంలో ఈటెలను అధ్యక్ష పీఠంపై కూర్చోబెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. నిజామాబాద్ ఎంపీ అరవింద్ కూడా అధిష్టానం దృష్టిలో ఉన్నప్పటికీ ఆయన ఆవేశం మైనస్ పాయింట్ అయిందంటున్నారు. రాజాసింగ్‌కు విస్తృతమైన ప్రజాసబంధాలు లేవు. ఆయన ఇమేజ్ సొంత సెగ్మెంట్ అయిన గోషామహల్‌కే పరిమితం. రామచంద్రరావు వంటి లీడర్లు ప్రజల్న ప్రభావితం చేయగలిగే లీడర్లు కాదని అధిష్టానం అభిప్రాయపడుతుందంట. కానీ ఈటలకు అలా కాదు. రాష్ట వ్యాప్తంగా ప్రభావం చూపించగలరు అందుకే ఆయనే బెస్ట్ ఆప్షన్ అని బీజేపీ పెద్దలు ఫిక్స్ అయ్యారంట. ఇంత కాలం అధ్య పదవికి సంబంధించి పార్టీలో పాత, కొత్త నేతల పంచాయతీ నడిచింది. అయితే అధ్యక్షుడు కావడానికి ఆర్‌ఎస్‌ఎస్ బ్యాక్‌గ్రౌండ్ అవసరం లేదంటూ ఇటీవల కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. హైకమాండ్ నుంచి సంకేతాలు ఉండబట్టే ఆయన అలా మాట్లాడారని, ఈటలే ప్రెసిడెంట్ అనడానికి అవే సంకేతాలని అంటున్నారు.

## దావోస్‌లో ఆసక్తికర పరిణామం.. ముగ్గురు సీఎంల రౌండ్ టేబుల్ భేటీ..




దావోస్‌లో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య రౌడ్ టేబుల్ మీటింగ్ జరిగింది. ఈ చర్చల్లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఆంధ్ర ప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ పాల్గొన్నారు. రాష్టాల అభివృద్ధి, టెక్నాలజీ ప్రగతి, దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లపై వారు ప్రధానంగా చర్చించారు. అలాగే దేశం, రాష్ట్రాల అభివృద్ధి దృష్టికోణం, సంక్షేమం, ఆర్థిక వ్యవస్థ, ఇన్నోవేషన్, టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిస్రప్షన్, స్థిరత్వం, ఉద్యోగ కల్పన, భవిష్యత్తు దిశలపై మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రౌండ్ టేబుల్ మీటింగ్‌లో చర్చించినట్లు అధికారులు తెలిపారు. అత్యధిక పెట్టుబడులను రాబట్టడమే లక్ష్యంతో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు దావోస్‌లో పర్యటిస్తున్నారు. ఇప్పటికే పలు కంపెనీలు ఏపీ, తెలంగాణలో భారీ పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించాయి.

ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వాలతో ఆ కంపెనీలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. అటు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సైతం తమ రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు దావోస్‌లో శాయశక్తులా కృషిచేస్తున్నారు.




## మహారాష్ట్రలో ఘోర రైలు ప్రమాదం.. 12 మంది దుర్మరణం

జల్‌గావ్: మహారాష్ట్రలోని జల్‌గావ్ జిల్లాలో ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణికుల మీద నుంచి మరో రైలు దూసుకెళ్లింది. ఈ ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 40మంది గాయపడ్డారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలోని పలు ఆస్పత్రులకు తరలిస్తున్నారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ సాయంత్రం 5గంటల సమయంలో పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలులో మంటలు వ్యాపించినట్టు వదంతులు వ్యాపించగా.. భయంతో ప్రయాణికులు ఆ రైలు చైన్‌లాగి పట్టాలపై దిగారు. ఈ క్రమంలో పట్టాలు దాటుతుండగా పచోరా రైల్వే స్టేషన్ సమీపంలో కర్ణాటక ఎక్స్‌ప్రెస్ రైలు వచ్చి వారిని ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన జరిగింది. ఈ ఘటనపై తమకు అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం పుష్పక్ ఎక్స్‌ప్రెస్ రైలులోని ఒక కోచ్‌లో హాట్ యాక్సిల్ లేదా బ్రేక్ బైండింగ్ కారణంగా నిప్పురవ్వలు చెలరేగాయని అధికారి ఒకరు చెప్పారు.

దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురై చైన్ లాగారని తెలిపారు. కొందరు ట్రాక్‌లపై దూకేసిన సమయంలో కర్ణాటక ఎక్స్‌ప్రెస్ రావడంతో ఈ దుర్ఘటన జరిగినట్లు పేర్కొన్నారు. మరోవైపు, ఈ ఘటనలో ఇప్పటివరకు 10 నుంచి 12 మంది వరకు మృతిచెంది ఉంటారని మహారాష్ట్ర మంత్రి గిరీశ్ మహాజన్ తెలిపారు.






# దావోస్‌లో తెలంగాణకు జాక్‌పాట్!

## కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ లిమిటెడ్ సంస్థ

## రూ.10 వేల కోట్ల భారీ పెట్టుబడి

దావోస్ వేదికగా జరుగుతున్న ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సులో తెలంగాణకు పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయి. దావోస్ సదస్సులో మూడో రోజు తెలంగాణకు భారీ పెట్టుబడి లభించింది. ఈ ఏడాదిలోనే అత్యంత భారీ పెట్టుబడి తెలంగాణకు దక్కింది. ఈ మేరకు ప్రభుత్వంతో ప్రఖ్యాత సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. కొన్ని రోజుల్లో ఆ పెట్టుబడిని తెలంగాణలో పెడతామని కంపెనీ ప్రకటించింది. ఈ మేరకు అధికారుల మధ్య ఒప్పందం కుదిరింది.

దావోస్ వేదికగా జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో బుధవారం తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం మరో భారీ పెట్టుబడి ఒప్పందాన్ని కుదుర్చుకుంది. తెలంగాణలో రూ. 10 వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ లిమిటెడ్ సంస్థ ముందుకు వచ్చింది. పెట్టుబడితో తెలంగాణలో అత్యాధునిక ఏఐ డేటాసెంటర్ క్లస్టర్‌ను నెలకొల్పేందుకు ముందుకు వచ్చింది.

దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో ఉన్నతాధికారులు, కంట్రోల్‌ఎస్ సీఈఓ శ్రీధర్ పిన్నపురెడ్డి రెడ్డి ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఈ పెట్టుబడితో కంట్రోల్‌ఎస్ ఆర్టిఫిషియల్ డేటా సెంటర్ క్లస్టర్ సామర్థ్యం 400 మెగా వాట్లు కాగా.. ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 3,600 మందికి ప్రత్యక్షంగా.. పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఒప్పందం అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. తెలంగాణలో డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఈ డేటా సెంటర్ ఏర్పాటు మరో మైలురాయిగా నిలుస్తుందని చెప్పారు. ఐటీ సేవల సామర్థ్యం పెరుగుతోందని.. ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని పేర్కొన్నారు.

తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోవడంపై కంట్రోల్ ఎస్ యాజమాన్యం గర్వంగా ఉందని ప్రకటించింది. డేటా సెంటర్ల ఏర్పాటుతో తెలంగాణలో ఐటీ సేవల ప్రమాణాలు మరింత వృద్ధి సాధిస్తాయని అభిప్రాయం వ్యక్తం చేసింది.

**పెట్టుబడులపై తీవ్ర విమర్శలు...** ఈ పెట్టుబడులు ఎప్పుడు పెడతారు? ఎన్ని విడతల్లో పెడతారనే వివరాలు వెల్లడి కాలేదు. దావోస్ వేదికగా జరుగుతున్న పెట్టుబడుల ఒప్పందాలపై విమర్శలు.. తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అంతర్జాతీయ కంపెనీల పెట్టుబడులు రావాల్సి ఉండగా.. దావోస్‌లో ప్రభుత్వం చేసుకుంటున్న కంపెనీల పెట్టుబడులన్నీ రాష్ట్రానికి సంబంధించినవే కావడం గమనార్హం. మేఘా కంపెనీ, స్కైరూట్ కంపెనీలు తెలంగాణకు చెందినవే. ఈ సంస్థల పెట్టుబడుల కోసం దావోస్ దాకా వెళ్లడం ఎందుకు అనే విమర్శలు వస్తున్నాయి. ఈ పెట్టుబడులపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ తప్పుబట్టారు.

చురకలు






# సీఎం రేవంత్ రెడ్డి దావోస్ పర్యటనలో కీలక ప్రగతి!

తెలంగాణ రైజింగ్ నినాదంతో రాష్ట్రానికి విదేశీ పెట్టుబడుల సాధన లక్ష్యంగా దావోస్ వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సుకు హాజరైన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి డి.శ్రీధర్ బాబుల బృందం కీలక పురోగతి సాధించింది. హైదరాబాద్ లో హెచ్ సీఎల్ సంస్థ కొత్త టెక్ సెంటర్ ఏర్పాటుకు సన్నద్ధత వ్యక్తం చేసింది. సదస్సులో తెలంగాణ పెవిలియన్ లో హెచ్ సీఎల్ టెక్ గ్లోబల్ సీఈఓ, ఎండీ విజయ కుమార్ తో సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి డి.శ్రీధర్ బాబు చర్చలు జరిపారు.

హైటెక్ సిటీలో 3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హెచ్ సీఎల్ కొత్త క్యాంపస్ ఏర్పాటుకు వారు అంగీకారం తెలిపారు. హెచ్ సీఎల్ కొత్త క్యాంపస్ ఏర్పాటు ద్వారా దాదాపు 5 వేల మంది ఐటీ నిపుణులకు కొత్తగా ఉద్యోగ అవకాశాలు దక్కే అవకాశముంది. అంతకుముందు రేవంత్ రెడ్డి బృందం హైదరాబాద్ లో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు కంట్రోల్ ఎస్ తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. తెలంగాణలో అత్యాధునిక ఏఐ డేటాసెంటర్ క్లస్టర్‌ను నెలకొల్పేందుకు కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ లిమిటెడ్ కంపెనీ అవగాహన ఒప్పందం (ఎంవోయూ)పై సంతకం చేసింది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు సందర్భంగా ఈ ఒప్పందం కుదిరింది. అర్టిఫిషియల్ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ఈ కంపెనీ రూ. 10,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. 400 మెగా వాట్ల సామర్థ్యంతో ఈ డేటా సెంటర్ నెలకొల్పుతుంది. ఈ ప్రాజెక్ట్ దాదాపు 3,600 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు లభించనున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుతో పాటు అధికారులు విప్రో, సన్ పెట్రో కెమికల్స్, జేఎస్? డబ్ల్యు గ్రూప్, లోంజా గ్రూప్, మిత్రా ఎనర్జీ, టిల్ మన్ గ్లోబల్ హెూల్డింగ్స్, బ్లాక్ స్టోన్ కంపెనీలతో ఈ రోజు చర్చలు జరుపుతారు.

చర్చల అనంతరం రాష్ట్రంలో పెట్టుబడులకు సంబంధించి మరిన్ని కీలకమైన ఎంవోయూలు చేసుకోనున్నారు. 'బిల్డింగ్ రీజనరేటివ్ అండ్ సర్క్యులర్ ప్లేసేస్' థీమ్ తో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ ఏర్పాటు చేసిన సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొంటున్నారు.

# కొత్త రేషన్ కార్డుల కోసం మారిన రూల్స్.. ఇలా చేస్తే ఎన్నో ఏళ్ల మీ కల నెరవేరినట్లే

హైదరాబాద్, జనవరి 22: రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజలు గ్రామ, వార్డు సభల్లో దరఖాస్తులు చేసుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిన్నటి (జనవరి 21) నుంచి గ్రామసభలు ప్రారంభమయ్యాయి. గ్రామసభల్లో కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజలు భారీగా దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈనెల 24 వరకు రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది సర్కార్. ఈనెల 26న రేషన్ కార్డుకు అర్హులైన వారికి రేషన్ కార్డులను జారీ చేయనున్నారు. అయితే గత ఏడాది డిసెంబర్‌లో ప్రభుత్వం సమగ్ర కులగణన సర్వే నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ సర్వేలో చాలా మంది రేషన్ కార్డులు లేవని ఎన్యూమరేటర్లకు చెప్పారు. అదే విషయాన్ని పై అధికారులకు తెలిపారు సిబ్బంది. కులగణన సర్వే వివరాలను కూడా కంప్యూటరీకరణ చేశారు. అయితే కులగణన సర్వేలో రేషన్ కార్డు లేని కుటుంబాలను గుర్తించి వారికి రేషన్ కార్డులు జారీ చేస్తారనే ప్రచారం జరిగింది. కానీ.. రేషన్ కార్డు దరఖాస్తుల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. కులగణన సర్వే ఆధారంగా కాకుండా గ్రామ సభల్లో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. గ్రామ సభల్లో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులకు కార్డులను జారీ చేయనున్నట్లు తెలుస్తోంది.

**గ్రామ సభల్లోనే...** సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా రూపొందించిన జాబితాలో పేర్లు లేని కుటుంబాలు ఈ నెల 24 వరకు జరిగే స్థానిక వార్డు సభల్లో దరఖాస్తులు సమర్పించవచ్చని ఇప్పటికే మంత్రులు ప్రకటించారు. గ్రామసభల్లో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే రేషన్ కార్డులు జారీ చేసే అవకాశం ఉంది. సమగ్ర కుటుంబ సర్వేలో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసినప్పటికీ గ్రామసభల్లోనూ మరోసారి దరఖాస్తు చేసుకోవాల్సిందే. అయితే సమగ్ర ఇంటింటి సర్వేలో రేషన్ కార్డు లేని కుటుంబాల గుర్తింపు అంతంత మాత్రంగానే కొనసాగిందనే వార్తలు వచ్చాయి. ప్రజాపాలనలో కొత్త రేషన్ కార్డుల కోసం దాదాపు 5,73,069 కుటుంబాలు దరఖాస్తు చేసుకోగా.. సమగ్ర కుటుంబ సర్వేలో మాత్రం 83,285 కుటుంబాలను గుర్తించడం ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ క్రమంలో కులగణన ప్రాతిపదకన కాకుండా ప్రస్తుతం కొత్త రేషన్ కార్డు కోసం గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోవాలని మంత్రులు, అధికారులు చెబుతున్నారు.

**నిరంతర ప్రక్రియ...** నూతన రేషన్‌కార్డు కోసం, కుటుంబ సభ్యుల పేర్లు చేర్చేందుకు వార్డు సభల్లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రేషన్ కార్డు కోసం చేసుకున్న దరఖాస్తులను అధికారులు పరిశీలించి వాటిలో అర్హులైన వారిని గుర్తిస్తారు. అర్హులైన ప్రతీఒక్కరికీ రేషన్ కార్డులను జారీ చేస్తామని మంత్రులు ఇప్పటికే స్పష్టం చేశారు. మరోవైపు కొత్త రేషన్ కార్డుల కోసం రాష్ట్రవ్యాప్తంగా 11,65,052 మందికి సంబంధించిన 6,68,309 కార్డుల సమాచారం ఇప్పటికే సిద్ధమైనట్లు సీఎస్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పదేళ్ల తరువాత రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోంది సర్కార్. ప్రజాపాలనలో దరఖాస్తున్న చేసుకున్న వారిలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని మంత్రులు ఇప్పటికే స్పష్టం చేశారు.




వాషింగ్టన్: అగ్రరాజ్యానికి రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ పాలనలో దూకుడు పెంచారు. ఇప్పటికే గత అధ్యక్షుడు జో బైడెన్ ఇచ్చిన 78 ఆదేశాలను రద్దు చేస్తూ డజన్ల కొద్దీ కార్యనిర్వాహక ఆదేశాలను (ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు) జారీ చేశారు. తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఫెడరల్ డైవర్సిటీ, ఈక్విటీ, ఇన్‌క్లూజన్ సిబ్బంది అందరికీ లేఆఫ్‌లు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు వారందరినీ సెలవులో ఉంచాలని ఆదేశిస్తూ ట్రంప్ కార్యవర్గం ఓ మెమో జారీ చేసింది.

అమెరికా ఫెడరల్ ప్రభుత్వానికి చెందిన డైవర్సిటీ, ఇన్‌క్లూజన్ ప్రోగ్రామ్‌లను నిర్వీర్యం చేస్తూ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. ఈ నేపథ్యంలోనే సిబ్బంది నిర్వహణ కార్యాలయం మెమో విడుదల చేసింది. దాని ప్రకారం.. డైవర్సిటీ, ఈక్విటీ, ఇన్‌క్లూజన్ (డీఈఐ) సిబ్బంది అందరినీ బుధవారం సాయంత్రం 5 గంటల్లోగా (అమెరికా కాలమానం ప్రకారం) వేతనంతో కూడిన సెలవుపై పంపించాలని సంబంధిత ఏజెన్సీలకు ఆదేశాలు అందాయి. ఈ విభాగాలకు చెందిన అన్ని వెబ్ పేజీలను కూడా ఈ గడువులోగా తొలగించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

**జన్మతః వచ్చే పౌరసత్వం రద్దు :** దీంతో పాటు డీఈఐ సంబంధిత శిక్షణ కార్యక్రమాలను తక్షణమే ముగించాలని ఏజెన్సీలకు సూచించారు. ఈ విభాగాలు చేసుకున్న ఒప్పందాలను కూడా రద్దు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే కొన్ని వెబ్ సైట్లను తొలగించారు. వచ్చే శుక్రవారం నాటికి వీరికి లేఆఫ్‌లు ఇచ్చి ఫెడరల్ సిబ్బంది సంఖ్యలో కోత విధించాలని ట్రంప్ సర్కారు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఉద్యోగాల కోతపై నూతన అధ్యక్షుడి యంత్రాంగం నుంచి ఇంకా ప్రకటన వెలువడలేదు. అయితే, తాజా నిర్ణయం ఎంతమందిపై ప్రభావం చూపనుందనేదానిపై ఇంకా స్పష్టత లేదు.

# రేషన్ కార్డులపై మంత్రి సీతక్క కీలక కామెంట్స్



హైదరాబాద్, జనవరి 22: కొత్త రేషన్ కార్డులు దరఖాస్తు చేసుకునేందుకు నిన్నటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలు ప్రారంభమైన విషయం తెలిసిందే. అయితే గ్రామసభల్లో లబ్దిదారులు ఆందోళనకు దిగారంటూ వస్తున్న వార్తలపై మంత్రి సీతక్క స్పందించారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మంత్రి మాట్లాడుతూ.. నిన్న మొత్తం 3410 గ్రామాల్లో గ్రామసభలు జరిగాయని.. కేవలం 142 గ్రామాల్లోని ఆందోళనలు జరిగాయని స్వయంగా బీఆర్ఎస్ పత్రికలోనే చెప్పారన్నారు. అంటే కేవలం నాలుగు శాతం గ్రామాల్లోనే కొంత గొడవ జరిగింది.. అది కూడా టీఆర్ఎస్ వాళ్ళు ఉద్దేశపూర్వకంగా చేశారని ఆరోపించారు. అంటే 96 శాతం గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో గ్రామసభలు జరిగినట్టు స్పష్టమవుతుందన్నారు.

**ఉద్దేశపూర్వకంగానే గొడవలు...** పదేళ్ల తర్వాత గ్రామ సభలు కాబట్టి ప్రజలు సంతోషంగా ఉన్నారని.. గ్రామ సభల్లోనే అర్హులని గుర్తిస్తున్నామని తెలిపారు. గతంలో ఎమ్మెల్యేలు చెప్పిన వాళ్ళకే పథకాలు వచ్చేవని విమర్శించారు. ఫామ్ హౌస్‌లో, ఎమ్మెల్యేలు ఇండ్లలో కూర్చొని లబ్ధిదారులను ఎంపిక చేశారని.. కానీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో గ్రామ సభల్లోనే ప్రజల సమక్షంలో లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా లబ్ధిదారులను గుర్తిస్తుంటే కావాలని టీఆర్ఎస్ రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో ఓట్లప్పుడే పథకాలు అరకొరగా ఇచ్చేవారన్నారు. కానీ ప్రజా అవసరాలు, ఆర్థిక వనరులను బట్టి పథకాలను అమలు చేస్తున్నామని వెల్లడించారు. పదేళ్లుగా రేషన్ కార్డులు ఇవ్వలేదని.. అందుకే ఉద్దేశపూర్వకంగా బీఆర్ఎస్ గొడవలు చేస్తోందని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్ మాటలు నమ్మి కొందరు ఆర్థిక సామాజిక రాజకీయ కుల సమగ్ర ఇంటిటి సర్వేలో పాల్గొనలేదని.. ఇప్పుడు వాళ్ళకి పథకాలు రావనే ఆందోళన ఉందన్నారు. ఏ ఒక్క అర్హుడు నష్టపోకుండా ప్రజాపాలన దరఖాస్తులు తీసుకున్నామని స్పష్టం చేశారు.

**ఆందోళన వద్దు..** గ్రామ సభల్లో కూడా దరఖాస్తులు తీసుకుంటున్నామన్నారు. బీఆర్ఎస్ చేత కానితనం వల్లే సమస్యలు వస్తున్నాయన్నారు. పది సంవత్సరాల్లో అన్నీ సాఫీగా చేస్తే ఇన్ని సమస్యలు ఎందుకు అని ప్రశ్నించారు. వందల ఎకరాలు ఉన్న భూస్వాములకు రైతుబంధు ఇచ్చారని.. కానీ రెక్కల కష్టాన్ని నమ్ముకున్న కూలీలకు ఎలాంటి సహాయం చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇతర పథకాలు ఇస్తామని స్పష్టం చేశారు. టీఆర్ఎస్ హయాంలో అద్భుతాలు ఏమి జరగలేదన్నారు. బెలూన్ లాగా తెలంగాణ ఆర్థిక వ్యవస్థ ఒకే సారి అమాంతంపైకి రాలేదన్నారు. టీఆర్ఎస్ పాలనకు ముందు కాంగ్రెస్ హయాంలో తెలంగాణ ప్రాంతం అభివృద్ధి చెందలేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పాటు చేసి , ప్రైవేట్ కంపెనీలను ప్రోత్సహించి.. తెలంగాణ ప్రాంత అభివృద్ధికి కాంగ్రెస్ బాటలు వేసిందని చెప్పుకొచ్చారు. మంచిని తమ ఖాతాల్లో, చెడును మంది ఖాతాల్లో వేయడం టీఆర్ఎస్‌కు అలవాటు అంటూ మంత్రి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

**ఇది నిరంతర ప్రక్రియ...** సీఎం వచ్చాక బీసీ కమిషన్ రిపోర్ట్ ఆమోదం అవుతుందని.. రిపోర్ట్ దాదాపుగా పూర్తి అయిందని తెలిపారు. సర్పంచ్ ఎన్నికలు త్వరగా నిర్వహిస్తామన్నారు. కేంద్రం నుంచి నిధులు ఆగిపోయాయని తెలిపారు. స్కీమ్‌లకు అప్లికేషన్లు నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు. పాలన చేత గాదు అని తమ మీద విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పాలించ లేదా అని ప్రశ్నించారు. పదవులు మీద ఉన్న ఆకాంక్ష.. ప్రజల మీద బీఆర్ఎస్‌కు లేదన్నారు. కేటీఆర్ అందరికి రైతు బంధు ఇవ్వాలని అంటున్నారని.. 500 ఎకరాలు ఉన్నోళ్లకు రైతుబంధు ఇవొద్దని తమ ప్రభుత్వం అనుకుంటుందన్నారు. గ్రామ సభలో ప్రదర్శించే జాబితా మీద ప్రజల అభిప్రాయాలు తీసుకుని లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని తెలిపారు.

నిజమైన పేద వారికి పథకాలు అందాలని.. అర్హులలో పార్టీలు చూడటం లేదన్నారు. చాలా కాలం నుంచి రేషన్ కార్డులు లేవని.. అందుకే ప్రజల్లో కొంత ఆందోళన కనిపిస్తోందని అన్నారు. అర్హులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. సంక్షేమ పథకాలు నిరంతర ప్రక్రియ అని.. అర్హులందరికీ అందే వరకు కొనసాగుతూనే ఉంటాయని మంత్రి సీతక్క మరోసారి స్పష్టం చేశారు.





నారాయణపూర్: గత ప్రభుత్వం రేషన్ కార్డులపై దృష్టి పెట్టలేదని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. 40 లక్షల మందికి లబ్ధి చేకూర్చేలా కొత్త రేషన్ కార్డులు తీసుకొస్తున్నామని చెప్పారు. కరీంనగర్ జిల్లాలోని నారాయణపూర్‌లో నిర్వహించిన గ్రామసభకు ఆయన హాజరై మాట్లాడారు. రేషన్ దుకాణాల్లో ఇక నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తామన్నారు. వ్యవసాయయోగ్యమైన భూములకు ఏటా ఎకరాకు రూ.12 వేలు ఇస్తామని ఉత్తమ్ తెలిపారు. భూమి లేని వ్యవసాయ కూలీలకు డబ్బులు ఇస్తామన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు తీసుకొచ్చేలా చేయడమే తమ విధానమని ఉత్తమ్ చెప్పారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తిచేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ముంపు గ్రామాల ప్రజలకు సరైన న్యాయం చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని చెప్పారు.

# పేరుకే ప్రజా పాలన.. మాజీ ఎమ్మెల్యేకే రక్షణ లేదు: కేటీఆర్



హైదరాబాద్: పేరుకే ప్రజా పాలన.. దివ్యాంగుడైన మాజీ ఎమ్మెల్యేకే రక్షణ లేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. భారాసకు భయపడి రైతు మహాధర్నాకు పోలీసులు అనుమతి ఇవ్వలేదని ఆరోపించారు. పోలీసుల ముందే మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిపై మంత్రి అనుచరులు దాడి చేశారని కేటీఆర్ ఆరోపించారు. వారు దాడి చేస్తే భూపాల్‌రెడ్డిని అరెస్టు చేశారని మండిపడ్డారు. దాడి చేసిన వారిపై మాత్రం చర్యలు లేవని.. ఇదీ కాంగ్రెస్ పాలన అని ఎద్దేవా చేశారు. కంచర్ల భూపాల్‌రెడ్డిపై దాడిని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. బాధ్యులపై కేసు నమోదు చేయాలని డీజీపీని కేటీఆర్ కోరారు.

# నల్గొండలో భారాస రైతు మహాధర్నాకు హైకోర్టు అనుమతి



హైదరాబాద్: భారాస రైతు మహాధర్నాకు తెలంగాణ హైకోర్టు అనుమతిచ్చింది. ఈ నెల 28న నల్గొండ క్లాక్‌టవర్ సెంటర్‌లో రైతు మహాధర్నా నిర్వహించాలని భారాస నిర్ణయించింది. పోలీసు అధికారులు అనుమతి మంజూరు చేయకపోవడంతో భారాస నేతలు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం 28న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మహాధర్నా కార్యక్రమానికి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మహా ధర్నాలో భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌తో పాటు పలువురు ముఖ్యనేతలు, రైతులు పాల్గొననున్నారు.

# దిల్ రాజు, మైత్రీ మూవీస్ కార్యాలయాల్లో కొనసాగుతున్న ఐటీ సోదాలు

హైదరాబాద్: నగరంలో రెండోరోజూ సినీ ప్రముఖుల ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ శాఖ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు నివాసాలు, కార్యాలయంలో అధికారులు తనిఖీలు చేస్తున్నారు. నిర్మాణ సంస్థ మైత్రీ మూవీస్, మ్యాంగో మీడియా కార్యాలయాల్లోనూ సోదాలు జరుగుతున్నాయి. నిర్మాణ సంస్థల ఆదాయం, పన్ను చెల్లింపు మధ్య తేడా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పలు సంస్థలకు చెందిన వ్యాపార లావాదేవీల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకు లాకర్లను కూడా ఐటీ అధికారులు తనిఖీ చేస్తున్నారు. ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన పలు పత్రాలను ఐటీ అధికారులు పరిశీలిస్తున్నారు. ప్రాథమిక ఆధారాలతో కేసు నమోదు చేశాకే సోదాలు నిర్వహిస్తున్నారు. మొత్తం 55 బృందాలు ఈ సోదాల్లో పాల్గొన్నాయి.

# అఫ్జల్‌గంజ్ కాల్పుల కేసు.. దర్యాప్తులో పోలీసుల పురోగతి

హైదరాబాద్: అఫ్జల్‌గంజ్ కాల్పుల కేసులో పోలీసులు పురోగతి సాధించారు. కాల్పులకు పాల్పడిన దుండగులు తిరుమలగిరి నుంచి ఆటోలో షామీర్‌పేట్ వరకు వెళ్లినట్లు గుర్తించారు. అక్కడి నుంచి గజ్వేల్ వరకు షేరింగ్ ఆటోలో వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. గజ్వేల్ నుంచి ఆదిలాబాద్ వరకు లారీలో ప్రయాణించినట్లు గుర్తించారు. అక్కడి నుంచి మధ్యప్రదేశ్ మీదుగా బిహార్‌కు వెళ్లినట్లు అనుమానిస్తున్నారు. దోపిడీ, కాల్పులకు పాల్పడింది అమిత్, మనీశ్‌లుగా పోలీసులు ఇదివరకే గుర్తించారు. నిందితులను పట్టుకునేందుకు బీదర్, హైదరాబాద్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ చేపట్టారు. ఇప్పటికే పోలీసులు బిహార్‌తో పాటు ఝార?ండ్‌కు చేరుకున్నారు.


**అసలేం జరిగింది..** కర్ణాటకలోని బీదర్‌లో ఇటీవల పట్టపగలే దోపిడీ దొంగలు రెచ్చిపోయారు. నగరం నడిబొడ్డున శివాజీ చౌక్‌లోని ఓ ఏటీఎం కేంద్రంలో డబ్బులు పెట్టేందుకు వచ్చిన సిబ్బందిపై కాల్పులకు పాల్పడ్డారు. ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో భద్రతా సిబ్బంది ఒకరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. మరో వ్యక్తి ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. దుండగులు ఏటీఎం సొమ్మును చేజిక్కించుకుని ద్విచక్ర వాహనంపై అక్కడి నుంచి పారిపోయారు. దొంగలు అఫ్జల్‌గంజ్‌లో ఉన్నట్టు తెలుసుకున్న బీదర్ పోలీసులు వారిని పట్టుకునేందుకు హైదరాబాద్ వచ్చారు. అఫ్జల్‌గంజ్‌లో పోలీసులను చూసిన దొంగల ముఠా సభ్యులు తప్పించుకునే ప్రయత్నంలో కాల్పులు జరిపారు. అనంతరం ట్రావెల్స్ కార్యాలయంలోకి వెళ్లిన దుండగులు.. ట్రావెల్స్ మేనేజర్‌పైనా కాల్పులు జరిపారు.

# ఐటీ సోదాలు.. కీలక అంశాలు వెలుగులోకి

హైదరాబాద్: టాలీవుడ్‌లోని పలువురు ప్రముఖుల ఇళ్లలో ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తోన్న విషయం తెలిసిందే. ఐటీ సోదాల్లో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. మైత్రి మూవీ మేకర్స్ నిర్వాహకులు రవిశంకర్, నవీన్‌లను ఐటీ అధికారులు విచారించారు. పుష్ప 2 మూవీ బాక్స్ ఆఫీస్ వద్ద భారీ లాభాలు రాబట్టినట్లు ఐటీ గుర్తించింది. వసూళ్ల తగ్గట్టుగా ఐటీ చెల్లింపులు జరగలేదని ఐటీ నిర్ధారణకు వచ్చింది. మైత్రి మూవీ మేకర్స్ బ్యాంక్ లావాదేవీలను ఇన్‌కంటాక్స్ అధికారులు పరిశీలిస్తున్నారు. దిల్ రాజ్ ఇల్లు, కూతురు హన్సితా రెడ్డి, సోదరుడు నర్సింహ రెడ్డి, నిర్మాత శిరీష్ ఇంట్లో సోదాలు కొనసాగుతున్నాయి. భారీ బడ్జెట్ మూవీ గేమ్ ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం రెండు మూవీల ఆదాయ వ్యయాలపైనా ఐటీ విచారణ చేస్తోంది. సంక్రాంతికి వస్తున్నాం మూవీ వారం రోజుల్లో రూ.203 కోట్లు వసూళ్లు చేసినట్లు గుర్తించారు. వచ్చిన లాభాలకు చెల్లించిన పన్నులకు భారీ వ్యత్యాసం ఉన్నట్లు ఐటీ శాఖ గుర్తించింది. మరోవైపు పుష్ప 2 చిత్ర దర్శకుడు సుకుమార్ ఇంట్లోనూ ఐటీ అధికారులు సోదాలు చేస్తున్నారు. పుష్ప 2 నిర్మాణంలో సుకుమార్‌కు షేర్లు ఉన్నట్లు ఐటీ అధికారులు గుర్తించారు.

**హైదరాబాద్‌కు హన్సితా రెడ్డి...** దిల్‌రాజు కుమార్తె హన్సితా రెడ్డి హైదరాబాద్‌కు చేరుకున్నారు. రెండు రోజులుగా జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ఐటీ అధికారులు సోదాలు చేస్తున్నారు. ఈ క్రమంలో వెంటనే హైదరాబాద్ రావాలని దిల్ రాజ్ కూతురుకు ఐటీ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో హైదరాబాద్‌కు వచ్చిన ఆమె.. ఎయిర్ పోర్ట్ నుంచి నేరుగా జూబ్లీహిల్స్‌లోని నివాసానికి చేరుకున్నారు. హన్సితా రెడ్డిని ఐటీ అధికారులు విచారిస్తున్నారు. విచారణ ఇప్పటికే ఇంట్లో డాక్యుమెంట్లను ఐటీ స్వాధీనం చేసుకుంది. హన్సిత రెడ్డి నిర్మించిన చిత్రాలకు సంబంధించి ఆదాయ వ్యయాలపై ప్రశ్నిస్తున్నారు. ఈరోజు రాత్రి వరకు ఐటీ సోదాలు కొనసాగునున్నాయి.

# జనవరి 23...జనతా పార్టీ ఆవిర్భావ దినం



47 ఏళ్ళ క్రితం ఇదే రోజున అంటే 1977 జనవరి 23న 'జనసంఘ్', 'భారతీయ లోక్‌దళ్', కాంగ్రెస్ (ఓ), 'స్వతంత్ర పార్టీ', 'సోషలిస్టు పార్టీ'లు కలిసి నేటి భారతీయ జనతా పార్టీ పూర్వపు భాగస్వామి యైన 'జనతాపార్టీ'గా ఏర్పడ్డాయి. ఈ నేపథ్యాన్ని పరిశీలిస్తే... 1951 అక్టోబర్ 21న ఢిల్లీలో శ్యాంప్రసాద్ ముఖర్జీ భారతీయ జనసంఘ్ పార్టీని ఏర్పాటు చేశాడు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ భావనలపై ఏర్పాటు చేసిన ఈ పార్టీకి ఎన్నికల చిహ్నంగా దీపం గుర్తు లభించింది. 1952లో జరిగిన పార్లమెంటు ఎన్నికలలో ఈ పార్టీకి 3 లోక్‌సభ స్థానాలు లభించాయి. అందులో ఒక స్థానం పార్టీ స్థాపకుడైన శ్యాంప్రసాద్ ముఖర్జీ విజయం సాధించింది. 1967 తరువాత ఈ పార్టీ బలపడింది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ భావనలపై ఆధారపడిన పార్టీ కావడంతో ఈ పార్టీ హిందూ జాతీయవాద లక్షణాలను కలిగిఉంది. ఈ పార్టీలో ప్రముఖ స్థానాలను కలిగిన నాయకులు కూడా ఆర్.ఎస్.ఎస్ కార్యకర్తలే. 1964లో ఏర్పడిన విశ్వ హిందూ పరిషత్తు ఈ పార్టీకి సన్నిహితంగా ఉంది. జవహర్ లాల్ నెహ్రూ కాలంలో ఆయన సోషలిస్టు భావనలకు విసుగు చెందిన పలు భారతీయ జాతీయ కాంగ్రెస్ నేతలు ఈ పార్టీ పట్ల ఆకర్షితులయ్యారు. రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలలో ఈ పార్టీ ఉనికి నిలుపుకుంది. 1975లో దేశంలో ఇందిరా గాంధీ ప్రభుత్వం అత్యవసర పరిస్థితి విధించడంతో విపక్షాలకు చెందిన పలు నేతలను ఎలాంటి కారణం లేకుండానే జైళ్ళకు తరలించారు. అదే కాలంలో భారతీయ జనసంఘ్ ప్రముఖ నేతలు కూడా జైలుజీవితం గడిపారు. 1977లో అత్యవసర పరిస్థితిని తొలిగించి ఎన్నికలు జరుపడంతో దేశంలో మారిన రాజకీయ సమీకరణాల వలన భారతీయ జనసంఘ్‌తో పాటు భారతీయ లోక్‌దళ్, కాంగ్రెస్ (ఓ), సోషలిస్ట్ పార్టీలు కలిసి ఉమ్మడిగా జనతా పార్టీని ఏర్పాటు చేసుకున్నాయి. 1951లో శ్యాంప్రసాద్ ముఖర్జీ చే స్థాపించబడిన జనసంఘ్ 1977లో జనతా పార్టీలో విలీనం చేయబడింది. ఎన్నికలలో ఈ పార్టీ విజయం సాధించడంతో భారతదేశంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తొలి కాంగ్రెసేతర ప్రభుత్వంగా జనతా ప్రభుత్వం పేరు సంపాదించింది. మురార్జీ దేశాయ్ నేతృత్వం వహించిన జనతా ప్రభుత్వంలో పూర్వపు జనసంఘ్ నేతలైన అటల్ బిహారీ వాజపేయికి విదేశాంగ మంత్రిత్వ శాఖ లభించగా, లాల్ కృష్ణ అద్వానీకి సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ లభించింది. జనతా ప్రభుత్వం విచ్ఛిన్నం కావడంతో 1980 లోక్‌సభ ఎన్నికల ముందు జనసంఘ నేతలు జనతా పార్టీ నుండి బయటకు వచ్చి భారతీయ జనతా పార్టీ పేరుతో ఎప్రిల్ 6న కొత్త రాజకీయ పార్టీని స్థాపించారు. ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ భారతదేశంలో ప్రముఖ జాతీయ రాజకీయ పార్టీలలో ఒకటి. రాజకీయ కురు పితామహుడు అటల్ బిహారీ వాజపేయి భారతీయ జనతా పార్టీకి తొలి అధ్యక్షుడిగా పనిచేశారు. 1980లో ప్రారంభించిన ఈ పార్టీ దేశములోని హిందూ అధికసంఖ్యాక వర్గం యొక్క మత సాంఘిక, సాంస్కృతిక విలువల పరిరక్షణను ధ్యేయంగా చెప్పుకుంటుంది. సాంప్రదాయ సాంఘిక నియమాలు, దృఢమైన జాతీయ రక్షణ దీని భావ జాలాలు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రధానపాత్ర పోషిస్తున్న సంఘ్ పరివార్ కుటుంబానికి చెందిన వివిధ రకాల హిందూ జాతీయవాద సంస్థలు భారతీయ జనతా పార్టీకి కార్యకర్తల స్థాయిలో గట్టి మద్దతు ఇస్తున్నాయి. 1989 తరువాత ఈ పార్టీ బలపడింది. అటల్ బిహారీ వాజపేయి 3 సార్లు ప్రధానమంత్రి పదవిని కూడా చేపట్టినారు. భాజపా, అనేక ఇతర పార్టీల మద్దతుతో 1999 నుండి 2004 వరకు భారతదేశ ప్రభుత్వము భారత కేంద్ర ప్రభుత్వాన్ని పాలించింది. దాని సీనియర్ నాయకులైన అటల్ బిహారీ వాజపేయి ప్రధాని గాను, లాల్ కృష్ణ అద్వానీ ఉప ప్రధాన మంత్రి గానూ పనిచేశారు. జాతీయ ప్రజాస్వామ్య కూటమిలో ప్రధాన పార్టీ అయిన భాజపా, భారత పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్షముగా 2014 మే వరకు కొనసాగింది. సార్వత్రిక ఎన్నికలలో లోక్ సభ లోని 543 స్థానాలకు మునుపెన్నడూ లేనన్ని 281 స్థానాలు గెలుచుకున్న భాజపా (మిత్ర పక్షాలతో కలిసి జాతీయ ప్రజాస్వామ్య కూటమికి 337 స్థానాలు) నరేంద్ర మోడీ నాయకత్వంలో అధికారం చేబట్టింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో లోక్ సభ ఎన్నికల్లో 303 స్థానాల్లో విజయం సాధించింది. నరేంద్ర మోడీ నాయకత్వంలో మళ్లీ అధికారం చేపట్టింది. ప్రస్తుతం రెండవసారి నరేంద్ర మోడీ ప్రధానిగా బీజేపీ రెండవ ప్రభుత్వంగా కొనసాగుతున్నది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# తాగుబోతు నటనకు భాష్యం చెప్పిన ఎం.ఎస్

## - పేరడీకి పెట్టింది పేరు ఎం. ఎస్ - జనవరి 23... ఎమ్. ఎస్. నారాయణ వర్ధంతి

ఎమ్. ఎస్. నారాయణ (ఏప్రిల్ 16, 1951 – జనవరి 23, 2015) గా పిలువ బడే మైలవరపు సూర్యనారాయణ తెలుగు సినిమా హాస్యనటుడు, దర్శకుడు. దాదాపు 700 చిత్రాలలో నటించారు. కొడుకు, భజంత్రీలు చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఆయన తాగుబోతు పాత్రలను పోషించడంలో పేరొందారు. గతంలో ఆయన భీమవరంలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేశారు. శ్రీకాంత్, కృష్ణంరాజు నటించిన "మా నాన్నకు పెళ్ళి" చిత్రం ద్వారా తెలుగు చలనచిత్ర రంగానికి పరిచయమయ్యారు. అంతకు ముందు సినీ కథా రచయితగా పనిచేశారు. కథా రచయితగా పేరుపడ్డ తొలిచిత్రం వేగుచుక్క పగటిచుక్క. స్వగ్రామం పశ్చిమ గోదావరి జిల్లా లోని నిడమర్రు. వీరిది మధ్యతరగతి రైతు కుటుంబము. వీరి తండ్రి మైలవరపు బాపిరాజు రైతు, తల్లి వెంకట సుబ్బమ్మ. పదవ తరగతి పూర్తి అయిన తరువాత నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న పత్తేపురంలోని ప్రాచ్య కళాశాలలో ఐదు సంవత్సరాల భాషా ప్రవీణ కోర్సు చేశారు. పత్తేపురంలోని మూర్తిరాజు కళాశాలలో సినీ రచయిత పరుచూరి గోపాలకృష్ణ లెక్చరర్‌గా పని చేసేవారు. ఆయన వద్ద ఎంఎస్ శిష్యరికం చేశారు. అది ఆయన జీవితంలో రచయితగా స్థిర పడడానికి పునాది వేసిందంటారు. తన క్లాస్‌మెట్ అయిన కళాప్రపూర్ణను ప్రేమించగా పరుచూరి వారే దగ్గరుండి పెళ్ళి చేయించడం విశేషం. వీరిది కులాంతర ప్రేమ వివాహము. పశ్చిమ గోదావరి జిల్లా కె.జి.ఆర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేశారు. కళారంగంపై ఉన్న ఆస్తకితో అధ్యాపకుడి పదవికి రాజీనామా చేసి నటనా రంగంలోకి అడుగులు వేశారు. మొదటగా రచయితగా చిత్ర పరిశ్రమలోకి ప్రవేశించారు. ఎనిమిది చిత్రాలకు రచయితగా పనిచేశారు. ఎమ్మెస్ నటించిన తొలి సినిమా యమ్.ధర్మరాజు ఎం.ఎ. అయన కుమారుడు విక్రం కొడుకు చిత్రం ద్వారా తన చిత్ర ప్రస్థానాన్ని ప్రారంభించారు. తల్లి సుబ్బమ్మ ప్రోత్సాహంతో ఉన్నత విద్యాభ్యాసం చేసిన ఎంఎస్ ఖాళీ రోజుల్లో మాత్రం నాటకాలు వేస్తు గడిపే వారు. తన స్నేహితులతో కలిసి "బాలనాగమ్మ, భట్టి విక్రమార్క" వంటి పౌరణిక నాటకాలు వేశారు. సాంఘిక నాటకాలకు తానే పాత్రలను ఎంపిక చేసుకుని దర్శకుడిగా నాటకాలు వేసి అందర్నీ మెప్పించే వారు. భీమవరం కేజీఆర్ఎల్ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తున్న సమయంలో దివిసీమ ఉప్పెన సంభవించగా తోటి కళాకారులతో కలిసి వివిధ ప్రాంతాల్లో నాటకాలు వేసి విరాళాలు సేకరించి దివి సీమ ప్రజలకు అందించారు. 1996లో "పెదరాయుడు" చిత్రంలో తొలిసారిగా వెండి తెరపై కనిపించారు. అయితే అంతుకు ముందే వెగుచుక్క-పగటి చుక్క, ప్రయత్నం, ముగ్గురు మొనగాళు ,, పేకాట పాపారావు చిత్రాలకు అద్భుతమైన కథలు అందించి సినీ రంగంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. దర్శకుడు రవిరాజా పినిశెట్టితో రుక్మిణీ సినిమా కథ చర్చల్లో ఆయన హావ భావ ప్రదర్శనకు ముగ్ధుడై హాస్య నటుడిగా ఎమ్ ధర్మరాజు ఎం.ఏ. అవకాశం కల్పించారు. పుణ్యభూమి నాదేశం, రుక్మిణి



(సినిమా) చిత్రాల్లో చిన్న పాత్రలు వేసినప్పటికి 1997లో ఈవీవీ దర్శకత్వంలో మా నాన్నకు పెళ్ళి సినిమాలో తాగుబోతు తండ్రి పాత్ర ఆయనకు ఎంతో పేరు తెచ్చి పెట్టింది. దర్శకులు తనకు ఇచ్చిన పాత్రకు తానే సంభాషణ రాసుకుని సినిమాల్లో పలికే వారు. "ఏం చేస్తున్నావ్ ... ఏం చేస్తున్నావ్ ... అని మాటిమాటికీ అడగొద్దు. ఏదో ఒకటి చేసేయ గలను" (నువ్వు నాకు నచ్చావ్)బీ "సోడా కొట్టడం అంటే పీజీ పాసైనంత వీజీ కాదు" (బన్ని)బీ "ఇక్కడ ఏం జరుగుతుందో నాకు తెలియాలి" (అతడు) లాంటి డైలాగులు తెలుగు వారి హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోయాయి. ఎమ్మెస్ తన నట జీవితంలో 5 నంది అవార్డులు (రామసక్కనోడు, మానాన్నకు పెళ్ళి, సర్దుకుపోదాం రండీ, శివమణి, దూకుడు), 2 సినీ గోయెర్స్ అవార్డులు పొందారు. దూకుడు చిత్రానికిగాను ఉత్తమ సహాయనటుడిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డును అందుకున్నారు. 200 చిత్రాల్లో తాగుబోతు పాత్రల్లో ఒదిగి పోయారు. గ్లాస్ చేతిలో పట్టుకున్న ప్రతిపాత్రను ప్రేక్షకులు ఎంతో ఎంజాయ్ చేశారు. అదే విధంగా పేరడీ పాత్రలకు ఎమ్మెస్ పెట్టింది పేరు. దూకుడు, డిస్కో, దూబాయ్ శీను తదితర చిత్రాల్లో పేరడీ, నటనా వైవిధ్యం ప్రదర్శించడం ద్వారా ప్రేక్షకుల మదిలో నిలిచిపోయారు. ఉత్తమ హాస్యనటుడు – శివమణి, 2003, ఉత్తమ హాస్యనటుడు – దూకుడు, 2001 నంది పురస్కారాలు ఆయనకు లభించాయి. అనారోగ్య కారణాలతో ఆయన చికిత్స పొందుతూ 2015, జనవరి 23 న మృతిచెందారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ఉరి కాదు యావజ్జీవమే.. కోర్టు తీర్పుపై మంటలు.. ఎందుకలా?



కోల్ కతాలోని ఆర్జీకర్ ఆసుపత్రిలో ఒక జూనియర్ డాక్టర్ పై జరిగిన హత్యాచారంపై దేశ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం కావటం.. ఆందోళనలు చోటు చేసుకోవటం తెలిసిందే. నిందితుడికి మరో మాటకు అవకాశం లేకుండా ఉరిశిక్ష విధించాలన్న డిమాండ్ వ్యక్తమైంది. అందుకు భిన్నంగా నిందితుడ్ని దోషిగా తేల్చేసిన న్యాయస్థానం ఉరిశిక్ష వేయకుండా యావజ్జీవంతో సరి పెట్టిన వైనంపై పెదవి విరుస్తున్నారు. ఆగస్టు తొమ్మిదిన కోల్ కతాలోని ఆర్జీకర్ ఆసుపత్రి సెమినార్ హాల్లో విశ్రాంతి తీసుకుంటున్న జూనియర వైద్యురాలిపై అత్యంత పాశివికంగా హత్యాచారం జరిగింది. ఆసుపత్రిలో వాలంటీర్ అయిన సంజయ్ రాయ్ కు భారతీయ సంహిత లోని వివిధ సెక్షన్ల కింద నేరస్తుడంటూ కోర్టు ప్రకటించింది. అందరూ అంచనా వేసుకున్నట్లుగా ఉరి కాకుండా యావజ్జీవన కారాగారం విధించటంపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసులో ఉరి కాకుండా యావజ్జీవ కారాగార శిక్ష మాత్రమే విధిస్తున్నటల్నగా సియాల్దాలోని అడిషనల్ జిల్లా సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పును పలువురు తప్పు పడుతున్నారు. బెంగాల్ లోని అధికార మమతా సర్కారుతో పాటు సీబీఐ కూడా ఉరిశిక్ష విధించాలని వాదించినా.. అంతిమంగా యావజ్జీవమే పడటంపై కొత్త రచ్చ మొదలైంది. కోర్టు తీర్పుపై పలు వర్గాల్లో అసహనం వ్యక్తమవుతోంది. దీనికి తగ్గట్లే సోషల్ మీడియాలో నిర్మోహమాటంగా పోస్టులు పెడుతున్నారు. తీర్పు వెలువరించే వేళలో కోర్టు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పెద్ద చర్చకు తెర తీశాయి. ఉరి విధించేంత హేతుబద్ధత ఈ కేసులో లేదని కోర్టు వ్యాఖ్యానించింది. హత్యాచారానికి గురైన ఆడకూతురు.. ఆమె కుటుంబం బాధను ముగ్గురు ఆడపిల్లలకు తల్లినైన తనకు బాగా అర్థమవుతుందని దోషిగా నిరూపితుడైన సంజయ్ తల్లి వ్యాఖ్యానించారు. కన్నకొడుకే అయినప్పటికి నేరం రుజువైతే త శిక్ష పడాల్సిందేనంటూ చేసిన వ్యాఖ్యలు భావోద్వేగాలపై ఎంతటి ప్రభావాన్ని చూపిందో అర్థం చేసుకోవచ్చు. ఆగస్టు తొమ్మిది తర్వాత బెంగాల్ లో ఐదు హత్యాచార ఘటనల్లో మైనర్లపై దారుణానికి పాల్పడ్డ నేరస్థులకు పోక్సో కోర్టులు ఏకంగా ఉరి విధించాయి. అలాంటిది ఈ కేసులో మాత్రం యావజ్జీవ శిక్ష మాత్రమే పడటం గమనార్హం. అయితే.. ఈ కేసు విచారణ పూర్తి చేసుకొని.. తీర్పు ఇచ్చే వేళలో న్యాయమూర్తి ఒక కీలక వ్యాఖ్య చేశారు. ఈ ఘటన ఉరిశిక్ష విధించేంత అరుదైన కేసు ఏమీ కాదని పేర్కొంది. అయితే..ఈ తీర్పుపై వెలువడుతున్న ఆందోళనల నేపథ్యంలో సీఎం మమతా బెనర్జీ స్పందించారు. ఈ తీర్పుపై తాము సంతృప్తికరంగా లేమన్న ఆమె.. అప్పీలుకు వెళతామన్నారు. అయితే.. తీర్పు పాఠం పూర్తిగా అందుబాటులోకి వచ్చిన తర్వాత కోర్టు ఈ తరహా శిక్ష విధించటానికి దారి తీసిన కారణాలపై క్లారిటీ వస్తుందని భావిస్తున్నారు. అయితే.. జరిగిన దారుణాన్ని బలంగా చెప్పే ప్రయత్నంలో ఫెయిల్ కావటం.. సదరు నేరస్థుడు జీవితంలో మారే అవకాశం లేదన్న అంశాల్ని ప్రాసిక్యూషన్ బలంగా వాదించలేకపోయినట్లుగా అభిప్రాయం వ్యక్తమవుతోంది. అది కూడా శిక్ష విషయంలో దోషికి కలిసి వచ్చిన అంశంగా చెబుతున్నారు. ఈ ఘటన బయటకు వచ్చినప్పటి నుంచి పోలీసుల తీరుపై విమర్శలు రావటం తెలిసిందే. అనంతరం విచారణ సీబీఐ చేతుల్లోకి వెళ్లినా.. తాజాగా కోర్టు ఇచ్చిన తీర్పును చూసినప్పుడు కొత్త సందేహాలకు కారణమవుతోంది. సాక్ష్యాధారాలను తారుమారు చేసిన ప్రిన్సిపల్ ను సీబీఐ అరెస్టు చేసినా.. నిర్ణీత 90 రోజుల వ్యవధిలో ఛార్జ్‌షీట్ దాఖలు చేయకపోవటం లాంటివి విచారణ నికార్సుగా జరిగిందా? అన్నది ప్రశ్నగా మారింది. దీనికి తోడు కోర్టు ఇచ్చిన తీర్పు అందరికి ఆమోదయోగ్యంగా లేదన్నది నిర్వివాదాంశం. మరి..ఈ తీర్పును సవాలు చేస్తూ అప్పీలుకు వెళుతున్న వేళ.. ఉన్నత న్యాయస్థానం ఎలా రియాక్టు అవుతుందో చూడాలి.

# ఇక్కడ ఒక్కో స్త్రీకి సగటున 7.6 మంది పిల్లలు... వివరాలివే!


వాస్తవానికి అత్యధిక జనాభా ఉన్న పలు దేశాల్లో, ఆర్థికంగా బలంగా ఉన్న దేశాల్లో నిన్న మొన్నటి వరకూ అధిక జనాభా అనేది ఓ సమస్యగా ఉండేదనే సంగతి తెలిసిందే. అయితే.. ఇప్పుడు సమస్య రివర్స్ అయ్యిందని అంటున్నారు. భారత్, చైనా, జర్మనీ, రష్యా సహా పలు దేశాలు ఇప్పుడు పిల్లలను ఎక్కువగా కనమని కోరుతున్న పరిస్థితి. ప్రస్తుతం భారత్ లో ఈ తీవ్రత అంతగా లేకపోయినా.. చైనా, జర్మనీ, రష్యా వంటి దేశాల్లో ప్రమాద స్థాయికి చేరువలో ఉందని అంటున్నారు. ఈ సమయంలో పిల్లలను కనాలంటూ ప్రభుత్వాలు యువతకు ఆఫర్లు ప్రకటిస్తున్నాయి. జననాల రేటు పెరగడం అవసరాన్ని తెలియపరుస్తున్నాయి. ఈ సమయంలో జనాభాలో యువత అత్యధికంగా ఉన్న దేశం తెరపైకి వచ్చింది. అవును... ఇటీవల తమ జనాభాలో యువత సంఖ్య తగ్గిపోతోందని.. వృద్ధుల సంఖ్య పెరిగిపోతుందని పలు దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సమయంలో.. ప్రపంచంలోనే అతి చిన్న వయస్కుల జనాభా ఎక్కువగా ఉన్న దేశం విషయం తెరపైకి వచ్చింది. ఈ



దేశంలోని జనాభాలో సగం మంది 15 ఏళ్ల కంటే తక్కువవారేనట. ఈ దేశం పేరు ఆఫ్రికన్ దేశమైన 'నైజర్'. ప్రపంచ వ్యాప్తంగా పిన్న వయస్కుల జనాభా ఎక్కువగా కలిగిన దేశాల జాబితాలో ఈ దేశం ముందు వరుసలో ఉంటుందని చెబుతారు. ఐక్యరాజ్యసమితి అందించిన డేటా ప్రకారం ఈ దేశంలోని ప్రజల సగటు వయసు 15 ఏళ్ల కంటే తక్కువ (14.8 ఏళ్లు) కావడం గమనార్హం. అయితే.. ఇక్కడ జననాల రేటు ఎక్కువగా ఉండటమే దీనికి కారణం కాగా.. ఈ జననాల రేటు ఎక్కువగా ఉండటానికి పేదరికం, వనరుల కొరతే కారణంగా చెబుతున్నారు. ఇక్కడ సగటు జననాల రేటు ప్రతీ స్త్రీకి 7.6 మంది పిల్లలు కాగా... ప్రపంచ సగటు 2.5 మంది మాత్రమే! ఇక.. నైజర్ లో ఆయుర్దాయం సగటున సుమారు 58 ఏళ్లుగా చెబుతున్నారు. వాస్తవానికి దేశంలో యువ జనాభా పెరగాలని చాలా దేశాలు కోరుకుంటున్న వేళ.. ఇక్కడ పెరుగుతున్న యువ జనాభా సమస్యగా మారిందని అంటున్నారు. ఆర్థికంగా బలహీనంగా ఉన్న ఈ దేశంలో విద్యా సౌకర్యాలు, ప్రాథమిక అవసరాలు కూడా యువతకు అందడం లేదు. ఫలితంగా... ఇక్కడ నిరుద్యోగం, పేదరికం, బాల్య వివహాలు అనే పలు సమస్యలు తలెత్తుతున్నాయి.

# సుదీర్ఘ పని గంటలు.. సిం'ఫుల్'గా తేల్చేసిన నారాయణమూర్తి

దేశం డెవలప్ మెంట్ లో దూసుకెళ్లాలంటే సుదీర్ఘ గంటలు పని చేయాలంటూ ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి చేసిన వ్యాఖ్యలు ఎంత పెద్ద దుమారానికి తెర తీశాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ విషయంలో పలువురు కార్పొరేట్ దిగ్గజాలు సైతం ఉద్యోగుల పని గంటలపై స్పందించటమే కాదు.. సుదీర్ఘ గంటలు పని చేయాలన్న అంశాన్ని విభేధించారు. దీనిపై మొదలైన లొల్లి నెలల తరబడి సాగుతున్నా.. దానికి ఫుల్ స్టాప్ పడటం లేదు. ఇలాంటి వేళ.. ఏ రచ్చకు కారణం అయ్యారో.. అదే రచ్చకు ఫుల్ స్టాప్ పెట్టేసే ప్రయత్నం చేశారు. సుదీర్ఘ గంటలపై తాను చేసిన వ్యాఖ్యలపై నడుస్తున్న లొల్లిపై తనదైన శైలిలో సిం'ఫుల్' గా తేల్చేశారు. కిలాచంద్ స్మారకోపన్యాస కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా నారాయణమూర్తి



కీలక వ్యాఖ్యలు చేశారు. నిరుపేద బాలలకు మెరుగైన భవిష్యత్తును అందించే దిశగా కష్టపడి పని చేయాలా? వద్దా? అన్నది ఎవరికి వారు ఆలోచించుకొని.. నిర్ణయం తీసుకోవాల్సిన విషయంగా పేర్కొన్నారు. ఇంతకూ తాజా ప్రసంగంలో నారాయణమూర్తి సుదీర్ఘ పని గంటలపై ఏమన్నారన్నది ఆయన మాటల్లోనే చూస్తే.. "ఎవరూ ఎవరినీ గంటల తరబడి పని చేయాలని చెప్పరు. ఎవరికి వారే నిర్ణయించుకొని ఆలోచించుకొని తగు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. నేను పొద్దున్నే ఆరున్నర గంటలకు ఆఫీసుకు చేరుకునే వాడ్ని. రాత్రి ఎనిమిదిన్నరకు బయటకు వచ్చేవాడ్ని. ఇలా నేను దాదాపు నలభై ఏళ్లు పని చేశా. ఇది వాస్తవం. నేను స్వయంగా చేశాను. ఇది తప్పు.. నువ్వు ఇలా చేయాలి. ఇలా చేయకూడదు.

అని ఎవరూ అనటానికి లేదు. ఇలాంటి వాటిపై చర్చలు.. వాదోపవాదాలు అనవసరం. మీకు మీరుగా ఆలోచించుకొని.. మీరు కోరుకున్నదే చేయటమే' అంటూ తన వ్యాఖ్యలపై జరుగుతున్న లొల్లికి ఫుల్ స్టాప్ పెట్టే ప్రయత్నం చేశారు. తాజా వ్యాఖ్యలపై ఎవరు ఎలా రియాక్టు అవుతారో చూడాలి.

చురకలు

## సంపాదకీయం

# జల సంఘం వెనకడుగు!..

# పోలవరం పనులపై అయోమయం?

ఏపీ జీవనాడి పోలవరం పనులు మూడు అడుగులు ముందుకు.. ఆరు అడుగులు వెనక్కు అన్న చందంగా మారుతున్నాయి. ప్రాజెక్టులో కీలకమైన డయాఫ్రంవాల్ నిర్మాణానికి ఇటీవల ఓకే చెప్పిన కేంద్ర జల సంఘం రెండు రోజుల్లోనే తన మనసు మార్చుకుంది. నిర్మాణ సంస్థ బావర్ ప్రతిపాదించిన టీ-5 ప్లాస్టిక్ మిశ్రమాన్ని వాడొద్దని ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. అంతర్జాతీయ నిపుణులు ప్రతిపాదించిన టీ-16 మిశ్రమంపైనా కేంద్ర జల సంఘం సందిగ్ధావస్థనే ఎదుర్కొంటోంది. దీంతో డయాఫ్రంవాల్ నిర్మాణానికి ఏ కాంక్రీటు వాడాలనే విషయమై అయోమయ పరిస్థితి నెలకొంది. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని నిర్ణయించారు. పోలవరం ప్రాజెక్టు డయాఫ్రంవాల్ నిర్మాణంపై కేంద్ర జల సంఘానికి స్పష్టత కొరవడింది. ఈ పనుల కోసం టీ-5 ప్లాస్టిక్ కాంక్రీట్ మిశ్రమాన్ని వినియోగించవచ్చని గత శుక్రవారం పోలవరం ప్రాజెక్టు అథారిటీకి లేఖ రాసిన జలసంఘం ఆదివారం నాటికి మనసు మార్చుకుంది. టీ-5 మిశ్రమం వాడాక భవిష్యత్తులో ప్రాజెక్టు భద్రతకు ఏదైనా ముప్పు వాటిల్లితే ఎవరు బాధ్యత వహిస్తారనే అనుమానంతో టీ-5 మిశ్రమం వాడొద్దంటూ లేఖ రాసింది. వాస్తవానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలవరం పనులపై అంతర్జాతీయ నిపుణుల సలహాలు తీసుకోవాలని నిర్ణయించారు. విదేశీ ఇంజనీర్లను రప్పించి పోలవరం ప్రాజెక్టుపై సలహాలివ్వాలని కోరారు. ఈ మేరకు అమెరికా, కెనడా నుంచి వచ్చిన ఇంజనీరింగ్ నిపుణులు టీ-16 ప్లాస్టిక్ కాంక్రీటుతో డయాఫ్రంవాల్ నిర్మించాలని సూచించారు. అయితే డయాఫ్రంవాల్ నిర్మాణంలో వారికి అనుభవం లేదని భావించిన కేంద్ర జల సంఘం ప్రాజెక్టు కాంట్రాక్టు సంస్థ నియమించిన బావర్ ప్రతిపాదించిన టీ-5 ప్లాస్టిక్ మిశ్రమం వాడాలని ముందు సలహా ఇచ్చింది. దీంతో శనివారం పోలవరం పనులు ప్రారంభమయ్యాయి. అయితే 24 గంటల్లోనే మనసు మార్చుకున్న కేంద్ర జల సంఘం అధికారులు శనివారం రాత్రి టీ-5 మిశ్రమంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ లేఖ రాశారు. కేంద్ర జల సంఘం సందిగ్ధావస్థతో ప్రాజెక్టు పనులను అయోమయానికి గురిచేయడంపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ అవుతోంది. దీనిపై నేరుగా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. దావోస్ పర్యటనలో ఉన్న ఆయనకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ద్వారా రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు విషయం చేరవేశారు. ప్రాజెక్టు పనులు ప్రారంభించిన తర్వాత జల సంఘం అభ్యంతరాలను సీఎం దృష్టికి తీసుకువెళ్లాలని మంత్రి రామానాయుడు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడిని కోరారు. దీనిపై దావోస్ పర్యటనలోనే ఉన్న కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ తో సీఎం చంద్రబాబు చర్చించనున్నారు. అయితే, కేంద్ర జల సంఘం నిర్ణయమేదైనా పోలవరం పనులు మాత్రం ఆపొద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించినట్లు సమాచారం. టీ-5 వద్దంటే టీ-16 మిశ్రమంతోనైనా పనులు చేస్తామని డయాఫ్రంవాల్ నిర్మాణ సంస్థ బావర్ చెబుతోంది. దీంతో ప్రాజెక్టు పనులపై జల సంఘం ఏదో ఒక తుది నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. పనులు మాత్రం ఆపే ప్రసక్తి లేదని చెబుతోంది. అయితే, పోలవరం ప్రాజెక్టుకు పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే నిధులు సమకూర్చుతుండటం వల్ల కేంద్ర జల సంఘం సూచనలు, సలహాలు కీలకంగా మారాయి. జల సంఘం కొర్రీలు వేస్తే భవిష్యత్తులో కేంద్రం నుంచి రావాల్సిన నిధుల విడుదలపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున అధికారులు అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

# మహిళా సాధికారతకు కుముదినీ దేవి ఎనలేని కృషి - జనవరి 23...జానంపల్లి కుముదినీ దేవి జయంతి



జానంపల్లి కుముదినీ దేవి తెలంగాణ రాష్ట్ర చరిత్రలో మహిళా సాధికారతకు నాంది పలికిన గొప్ప నాయకురాలు. వనపర్తి సంస్థానపు రాణిగా మాత్రమే కాకుండా, రాజకీయ నాయకురాలిగా, సంఘ సేవకురాలిగా, మహిళా హక్కుల కర్తగా ఆమె తనదైన గుర్తింపు పొందారు. జానంపల్లి కుముదినీ దేవి 1911 జనవరి 23న వరంగల్ జిల్లాలోని వడ్డెపల్లిలో (ప్రస్తుత వాడపల్లి) జన్మించారు. ఆమె తండ్రి పింగళి వెంకట రామారెడ్డి, నిజాం రాజ్యానికి ఉపప్రధానిగా పనిచేశారు. 1928లో వనపర్తి సంస్థానాధీశుడు రాజా రామదేవరావుతో వివాహమైంది. జానంపల్లి కుముదినీ దేవి నిజాం పాలనలో మహిళల హక్కుల కోసం పోరాడారు. 1950లో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు తొలిసారి మహిళా మేయర్‌గా ఆమె ఎన్నికయ్యారు. 1962లో వనపర్తి శాసనసభ నియోజకవర్గం నుండి తొలిసారి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికయ్యారు. 1967లో మళ్లీ అదే నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. ఆమె పాలనలో మహిళల విద్య, ఉద్యోగావకాశాల కల్పనపై ప్రాముఖ్యత చూపారు. శివానంద స్వామి ప్రభావంతో 1950లో హైదరాబాద్ కూకట్‌పల్లిలో "శివానంద ఆశ్రమం" స్థాపించారు. ఈ ఆశ్రమం కుష్టు వ్యాధిగ్రస్తుల చికిత్స, పునరావాసంలో కీలక పాత్ర పోషించింది. 1958లో నెలకొల్పిన ఈ బాలికా నిలయం అనేక ఆడపిల్లలకు విద్యా మరియు ఉపాధి అవకాశాలను అందించింది. జానంపల్లి కుముదినీ దేవి నిజాం రాజ్యకాలంలో స్వతంత్ర ఆలోచనలకు ప్రాతినిధ్యం వహించారు. నిజాం ప్రభుత్వంలోని ఆడవారిలో వాహనం నడిపిన మొదటి మహిళగా గుర్తింపు పొందారు. ఆమె కాలంలో స్త్రీలు ఎదుర్కొన్న ఇబ్బందులు అధిగమించి, మహిళల కోసం స్వతంత్రత, స్వీయసాధికారత కోసం కృషి చేశారు. కుష్టు వ్యాధిగ్రస్తుల కోసం అంకితభావంతో సేవలు అందించి, వారికి వైద్య సదుపాయాలు మరియు పునరావాసం కల్పించారు. లింగ సమానత్వం ప్రాతిపదికగా ఆమె తన కాలం నాటి నియమాలను ధైర్యంగా ఎదుర్కొని మహిళలకు హక్కుల కంఠంగా నిలిచారు. కేవలం రాజకీయాల్లోనే కాకుండా, సామాజిక సేవలోనూ ఆమె జీవితమంతా ప్రజలకే అంకితం చేశారు. ప్రజలతో మమేకమై, వారికి నాయకత్వం వహించడంలో ఆమె చూపిన కృషి యుగయుగాలకు ఆదర్శంగా ఉంటుంది. జానంపల్లి కుముదినీ దేవి 2009లో 98 ఏళ్ల వయసులో మరణించారు. ఆమె మరణం తెలంగాణ కోసం గొప్ప స్ఫూర్తిదాయక వ్యక్తిత్వం కోల్పోవడం మాత్రమే కాదు, భారతీయ మహిళా చరిత్రకు ఒక వెలుగుదీపం నశించడమే. జానంపల్లి కుముదినీ దేవి తన ధైర్యం, నాయకత్వం, మరియు సేవల ద్వారా తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచారు. ఆమె జీవితం మనకు స్ఫూర్తి, ఆమె ఆలోచనాలు మనకు మార్గదర్శనం. "జానంపల్లి కుముదినీ దేవి జీవితం మహిళా సాధికారతకు ఒక ప్రకాశవంతమైన చిహ్నం. ఆమె జీవితం మనందరికి మార్గదర్శకంగా నిలవాలి."

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# వావిలికొలను సుబ్బారావు ఆధ్యాత్మిక జీవితం స్ఫూర్తి దాయకం - జనవరి 23...ఆంధ్ర వాల్మీకి జయంతి



వావిలికొలను సుబ్బారావు తెలుగు సాహిత్యంలో అమూల్యమైన కీర్తిని పొందిన మహాకవి, అనువాదకుడు, మరియు భక్తి మార్గానికే అంకితమైన మహనీయుడు. ఆయనను తెలుగులో "ఆంధ్ర వాల్మీకి" అని గౌరవంగా పిలుస్తారు. వాల్మీకి రామాయణాన్ని తెలుగులోకి అనువదించి, భక్తి శ్రద్ధతో అక్షరరూపం ఇచ్చిన ఆయనకు ఈ ఘనత దక్కింది. ఆయన రచనలు తెలుగు భాషా సౌందర్యానికి నిలువుటద్దంగా, భక్తి చైతన్యానికి పునాది రాళ్లుగా నిలిచాయి. వావిలికొలను సుబ్బారావు 1863 జనవరి 23న ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంతంలోని ప్రొద్దుటూరు పట్టణంలో జన్మించారు. ఆయన కుటుంబం సాంప్రదాయ సంస్కృతికి ప్రతిబింబంగా ప్రసిద్ధి. ఆయన విద్యాభ్యాసం సంస్కృత పాఠశాలలలో సాగింది. సంస్కృత భాష, శాస్త్ర గ్రంథాలు, ధార్మిక సాహిత్యంపై ఆయనకు చిన్న వయస్సు నుంచే గొప్ప ఆసక్తి ఉండేది. ఆయన మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో ఆంధ్ర పండితుడిగా సేవలు అందించారు. విద్యారంగంలో పనిచేయడంతో పాటు, సాహిత్య రంగానికి ఆయన అనేక గ్రంథాలను అందించారు. జీవితాంతం ఆయన భక్తి మార్గానికే కట్టుబడారు. సంసారంలోనుండి విముక్తిని కోరుతూ, చివరికి ఆయన వైరాగ్య జీవితం స్వీకరించారు. గోచీ ధరించి, రామనామ స్మరణతో తపస్సు చేశారు. వావిలికొలను సుబ్బారావు అనేక పుస్తకాలు రచించి, తెలుగు సాహిత్యాన్ని భగవద్భక్తి, తాత్వికత, సామాజికతలతో పటిష్టం చేశారు. ముఖ్యంగా వాల్మీకి రామాయణాన్ని తెలుగు ద్విపద రూపంలో అనువదించి "మందరం" అనే పేరుతో ప్రజలకు అందించారు. ఈ అనువాదం సాంప్రదాయ భక్తి తాత్వికతలకు బలమైన అద్దుకట్టయింది. భాషా సామర్థ్యం, కవిత్వ శక్తి, మరియు భావప్రాప్తి కారణంగా ఈ గ్రంథం తెలుగు సాహిత్యంలో అపూర్వ మైంది. శ్రీకృష్ణలీలా మృతము గ్రంథంలో శ్రీకృష్ణుని జీవితంలోని లీలలను భక్తిభావంతో తెలుగులో వర్ణించారు. ఇది భగవద్గీతను మరింత సరళంగా, అందమైన వచనంలోకి తీసుకురావడంలో ఆయన ప్రతిభను చాటింది. భగవద్గీతను ద్విపదలలో రచించి, సామాన్యులకు కూడా అందుబాటులోకి తెచ్చారు. ఈ రచనలో తాత్విక చింతన, భక్తి భావం చక్కగా మిళితమై ఉన్నాయి. ఆర్య సమాజం సిద్ధాంతాలపై ప్రత్యేకమైన రచనలు చేశారు. ధార్మికత మరియు ఆధ్యాత్మికతపై వీటి ప్రభావం ఎంతగానో ఉంది. ఒంటిమిట్ట రామాలయాన్ని పునరుద్ధరించడానికి విరాళాలు సేకరించే ఉద్దేశ్యంతో టెంకాయ చిప్ప శతకం శతకాన్ని రచించారు. భక్తి, వినోదం, మరియు దాతృత్వ స్ఫూర్తిని కలిపి రచించిన ఒక అద్భుత శతకంగా ఇది నిలిచింది. మహాభారతంలోని సుభద్రా అర్జునుల కథ ఆధారంగా రాసిన నాటకం సుభద్రా విజయం నాటకం. ఈ నాటకం భక్తి, ప్రేమ, మరియు ధర్మాల సమ్మేళనంతో ఆకట్టుకుంటుంది. వావిలికొలను సుబ్బారావు రచనల్లో భక్తి ప్రధాన పాత్ర పోషించింది. రామాయణం, భగవద్గీత వంటి శ్రేష్ఠ గ్రంథాలను భక్తి భావంతో తెలుగు ప్రజలకు పరిచయం చేశారు. ఆయన రచనలు సాంప్రదాయ భాషలో ఉండి కూడా ఎంతో సరళమైన రూపంలో ప్రజల హృదయాలను తాకాయి. ఒంటిమిట్ట రామాలయ పునరుద్ధరణ వంటి అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భగవద్గీత వంటి గ్రంథాలను సులభంగా అర్థం అయ్యే విధంగా అనువదించడం ద్వారా ఆయన తాత్విక ఆలోచనలను సామాన్య ప్రజలకు అందించారు. వాల్మీకి రచించిన రామాయణం భారతీయ సాంప్రదాయానికి ఎలా మూర్తిరూపమో, వావిలికొలను సుబ్బారావు రాసిన "మందరం" తెలుగు భాషా సంపదకు అలాగే మూర్తిరూపం. ఆయన కృషికి గానూ ప్రజలు ఆయనను "ఆంధ్ర వాల్మీకి" అని గౌరవించారు. 1936 ఆగష్టు 1న ఆయన మరణించినప్పటికీ, ఆయన రచనలు తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. ఈ గ్రంథాలు నేటికీ భక్తి సాహిత్యంలో ఓ మైలురాయిగా నిలుస్తున్నాయి. వావిలికొలను సుబ్బారావు రచనలు, వ్యక్తిత్వం, మరియు ఆధ్యాత్మిక జీవితం మనకు స్ఫూర్తిదాయకం. ఆంధ్ర వాల్మీకిగా ఆయన తెలుగుకు చేసిన సేవలు భవిష్యత్ తరాల కోసం ప్రేరణగా నిలుస్తాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# కరుడు గట్టిన స్వాతంత్ర్య యోధుడు నేతాజీ - అజరామరం నేతాజీ పోరాటం - జనవరి 23... సుభాస్ చంద్రబోస్ జయంతి

భారతదేశ స్వాతంత్ర్య సమరంలో అహింసా మార్గంలోనే మాత్రమే కాదు పోరాట (సాయుధ) మార్గంనూ బ్రిటర్లపై పోరాడుదామని పిలుపిచ్చిన సమర సేనాని నేతాజీ సుభాష్. వలస వాదాన్ని ప్రతిఘటించడంలో ధైర్యంగా పోరాడటం చేయడంలో సుభాష్ చంద్రబోస్‌కు చేసిన కృషి అపూర్వం, అనన్య సామాన్యం, అజరామరం. ఇండియన్ సివిల్ సర్వీసెస్ కు ఎంపికైనప్పటికీ తృణప్రాయంగా ఉద్యోగాన్ని వదులుకొని దేశానికి స్వాతంత్ర్యం తేవడమే ప్రథమ కర్తవ్యం అని ఉద్యమంలోకి అడుగుపెట్టిన స్వాతంత్ర్య పిపాసి. భారతీయుడు గౌరవప్రద జీవితాన్ని గడపేలా చేసేందుకు తనను తాను కట్టుబడి ఉన్న ఒక అద్భుతమైన వ్యక్తి. "ఆజాద్ హిందూ ఫైజ్" ను స్థాపించి భారత్ కు స్వాతంత్ర్యం తీసుకు రావడంలో కీలకపాత్ర వహించాడు. స్వాతంత్ర్యం రావాలంటే సొంత సైన్యంతో పాటు ఇతర దేశాల సహకారం కూడా అవసరమని భావించాడు. సుభాష్ బాబు మేథో పరాక్రమం, సంస్థాగత నైపుణ్యాలకు కూడా ప్రసిద్ధి చెందారు. ప్రతి భారతీయుడు గౌరవప్రదమైన జీవితాన్ని గడపేలా చేసేందుకు గాను తనను తాను కట్టుబడి ఉన్న ఒక అద్భుతమైన వ్యక్తి. సుభాష్ బాబు మేథో పరాక్రమం, సంస్థాగత నైపుణ్యాలకు కూడా ప్రసిద్ధి చెందారు. 2021నుండి నేతాజీ జన్మదినమైన జనవరి 23న ప్రతి సంవత్సరం అంతర్జాతీయ స్థాయిలో 'పరాక్రమ దివస్'గా జరపాలని కేంద్రం ప్రభుత్వం నిర్ణయించింది. భారత దేశానికి స్వాతంత్ర్యం రావడానికి అహింస మార్గంలో గాంధీ మార్గంలో కొందరు నాయకుల పోరాటం ఎంత ముఖ్యమో, సుభాస్ బోస్ పోరాట పటిమ అంతే ప్రధానం. తన జీవితంలో స్వార్థం లేకుండా దేశ స్వాతంత్ర్య సాధనే పరమార్థంగా, 12 దేశాలు తిరిగి అతి పెద్ద సైనిక బలగాన్ని ఏర్పాటు చేసి బ్రిటీష్ సామ్రాజ్యానికి వణుకు పుట్టించిన ఒక గొప్ప యుద్ధ వీరుడు సుభాష్ చంద్రబోస్. నివృత్తి కాని సందేహంగా ఆయన అదృశ్యం జరగక పోయి ఉంటే 1947 కంటే రెండు సంవత్సరాల ముందే స్వాతంత్ర్యం వచ్చి ఉండేదని చాలా మంది నమ్ముతారు. సుభాష్ చంద్రబోస్ జనవరి 23, 1897 లో ప్రభావతి దేవి, జానకి నాద్ బోస్ దంపతులకు కటక్ లో జన్మించాడు. బాల్యం నుండే ఎక్కడ అన్యాయం జరిగిన ఎదురు నిలిచి అడిగేవాడు. ఇంటర్ చదివే రోజుల్లో "స్వేచ్ఛా సేవ సంఘ్" అనే సంస్థ ఏర్పాటు చేసి యువకులకు సమాజ సేవ, ధ్యానం, మానసిక ఆరోగ్యం కోసం వ్యాయామం వంటి అనేక అంశాల పైన ఉపన్యాసాలు ఇచ్చేవాడు. బోస్ కు స్వామి వివేకానంద అంటే ఎంతో ఇష్టం. ఇక 1919లో ఇండియన్ సివిల్ సర్వీసెస్ ఉత్తమ ర్యాంక్ సాధించి శిక్షణ కోసం ఇంగ్లాండ్ వెళ్ళాడు. 1920 లో ఇంగ్లాండ్ లో జరిగిన పరీక్షలో మెరిట్ లో ఉత్తీర్ణుడైనాడు. అయితే జలియన్ వాలా భాగ్ వార్త తెలిసిన అతడికి మనసులో ఆవేదన కలిగి దానిని మధ్యలోనే వదిలేసి 1921 లో ఇండియా తిరిగి వచ్చాడు. తరువాత గాంధీజీ కలిసి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ లో చేరాడు. చిత్తరంజన్ దాస్ వద్ద పనిచేసే వాడు. ప్రిన్స్ ఆఫ్ వేల్స్ భారత దేశానికి వచ్చినప్పుడు నిరసన తెలిపినందుకు ఆర్నెల్లు జైలు శిక్ష విధించారు. ఇక అయన జైలు నుండే కలకత్తా శాసన సభకు ఎన్నికయ్యాడు. జైలులో నిరాహార దీక్ష వల్ల ఆరోగ్యం క్షీణించడం చూసి బ్రిటీష్ ప్రభుత్వం కొన్ని ఆంక్షలు విధిస్తు ఆయనను విడుదల చేసింది. ఆ తర్వాత బెంగాల్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, అఖిల భారత కాంగ్రెస్స సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. అలా దేశమంతా పర్యటిస్తూ ఆయన చేసే ప్రసంగాలకు లక్షలాది మంది ప్రేరితులయ్యారు. ఉప్పు సత్యాగ్రహ సమయంలో బోస్ ను నిర్బంధించడం కాకుండా దేశ బహిష్కరణ కూడా చేసారు. ఆ సందర్భంలో అయన యూరప్ లో పర్యటించి హిట్లర్, ముస్సోలిని వంటి మహానీయులను కలిసాడు. అయితే బోస్ హిట్లర్ ని కలసిన సందర్భంలో ఒక సంఘటన జరిగింది. హిట్లర్ కోసం వేచి చూస్తుండగా ఒక వ్యక్తి వచ్చి విషయం ఏమిటి అని అడుగగా నేను మీ బాస్ హిట్లర్ తో మాట్లాడాలని జవాబిచ్చాడు. అయితే కొద్దిసేపటికి వచ్చిన హిట్లర్ బోస్ తో చర్చలు చేసి వెళుతుండగా నీ వద్దకు "ముందుగా వచ్చిన వ్యక్తి హిట్లర్ కాదని నీకెలా తెలిసింది అని ప్రశ్నించిగా, నా భుజాన్ని తట్టే ధైర్యం హిట్లర్ కు తప్ప మరెవ్వరికీ లేదని" ఆయన జవాబిచ్చాడు. అయితే 1934 వ సంవత్సరంలో సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని జైలు పాలై, ఆరోగ్యం దెబ్బతినడంతో చికిత్స నిమిత్తం ఆయనని ఆస్ట్రియాకు తరలించారు. ఇలా ఆస్ట్రియలో చికిత్స పొందుతున్న ఆయన యూరప్‌లో ఉన్న భారతీయ విద్యార్థులను ఏకం చేసి, వారు స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొనేలా చేయాలని బోస్ భావించాడు. "ద ఇండియన్ స్ట్రగుల్" అనే పుస్తకం రాసే సందర్భంలో ఇంగ్లీష్ వచ్చి టైప్ చేయగలిగే ఒక వ్యక్తిగా పరిచయమైన 23 ఏళ్ల ఎమిలీ షెంకెల్ అనే ఆస్ట్రియా యువతిని తన సహాయకురాలిగా నియమించు కోగా, ఎమిలీ 1934 జూన్ నుంచి బోస్‌తో కలిసి పని చేయగా, వారి మధ్య ప్రేమ చిగురించిందని చెపుతారు. స్వాతంత్ర్యం తప్ప వేరే ఆలోచన లేని బోస్ 1934-36 లో జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు అయినాక దేశమంతా తిరుగుతూ తన ఉపన్యాసాలతో దేశంలోనే అత్యంత ప్రజాధారణ కలిగిన నాయకుడయ్యాడు. ఇలా గొప్ప నాయకుడిగా ఉన్న సమయంలో కాంగ్రెస్ లో అంతర్గతగా జరిగిన కుట్రల కారణంగా 1939 లో ఆయనను కాంగ్రెస్ నుండి బహిష్కరించారు. ఆ తరువాత వెంటనే ఫార్వర్డ్ బ్లాక్ అనే పార్టీ ని స్థాపించి దేశం అంతటా పర్యటించగా ఆయనకి మద్దతుగా కొన్ని లక్షల్లో జనాలు అయన వెంట నడిచారు. ఇలా ఉద్యమ కారుడిగా ప్రజల్లో చైతన్యం నింపుతుండగా 1941 అరెస్ట్ చేసి తప్పనిసరి పరిస్థితుల్లో విడుదల చేసి గృహ నిర్బంధంలో ఉంచారు. కానీ అయన పథకం ప్రకారం హమ్మద్ జియా ఉల్ హక్ అనే మారు పేరుతో పాస్ పోర్ట్ సంపాదించి తప్పించుకుని తన వ్యక్తిగత సేవకుడు భగత్ రామ్ కు రహమత్ ఖాన్ అని పేరు పెట్టి కాబుల్ కి వెళ్ళాడు. అక్కడ ఉత్తం చంద్ మల్హోత్రా అనే వ్యాపారి ఆయనకి ఆశ్రయం కల్పించగా అక్కడ ఉంటూనే రష్యా, జర్మని, ఇటాలి దేశ రాయబారులతో మంతనాలు చేసాడు. 1941 మార్చ్ 18 న అక్కడి నుండి ఒర్లాండ్ అనే మారు పేరుతొ సమర?ండ్, మాస్కో ల మీదుగా బెర్లిన్ చేరుకొని జపాన్, ఇటలి, జెర్మని లకు చెందిన సైన్యాధికారులను కలుసు కున్నాడు. ఇలా చేరుకున్న బోస్ ను వారు స్వతంత్ర భారత రాయబారిగా గుర్తించారు. ఆ తరువాత బోస్ అక్కడే ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపించాడు. 1941 ఫిబ్రవరి 27 న బోస్ రేడియోలో ఇచ్చిన ప్రసంగం యావత్ దేశాన్ని కదిలించింది. ప్రపంచ యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో జపాన్ లోని ఆజాద్ హింద్ ఫౌజ్ సభ్యులు బోస్ ను అక్కడికి ఆహ్వానించగా 45 రోజుల పాటు జలాంతర్గామిలో ప్రయాణించి అక్కడ మత్సుడ అని పేరు మార్చుకున్నాడు. అక్కడ బోస్ ఇచ్చిన స్ఫూర్తిదాయకమైన ఉపన్యాసాలతో హింద్ ఫౌజ్ లో తండోప తండాలుగా సైనికులు చేరారు. ఇక్కడ మహిళలకు ప్రత్యేకంగా ఝాన్సీ లక్ష్మీ బాయి రెజిమెంట్ ను ఏర్పాటు చేసి మహిళలకు యుద్ధ శిక్షణ నివ్వడం మొదలు పెట్టారు. ఇలా ఎంతో శక్తివంతమైన సైన్యాన్ని తయారుచేసి చలో ఢిల్లీ అనే నినాదంతో ప్రత్యక్ష యుద్ధానికి దిగి జపాన్ సహకారంతో ఇంఫాల్, అండమాన్, నికోబార్ లను జయించి అక్కడ స్వతంత్ర భారత పతాకాన్ని ఎగురవేసి ముందుకు సాగుతుండగా ఆయనకి కష్టాలు మొదలయ్యాయి. తనకు అండగా నిలిచినా జపాన్ దేశం యుద్ధంలో ఓటమికి చేరువైంది. ఇక బర్మాలో వరదల కారణంగా ఆరోగ్యం క్షీణిస్తూ అనేక మంది



సైనికులు మరణించారు. ఆ సమయంలో రష్యా దాడికి దిగి, అణుబాంబు వేయడంతో జపాన్ అతలాకుతలం అయింది. అప్పటివరకు తనకు అండగా ఉన్న జపాన్ అలా అవ్వడంతో బోస్ నిస్సహాయు డైనాడు. ఆ తరువాత సింగపూర్, రంగూన్ సైనిక దళాలకు బ్రిటిష్ దళాలు దగ్గరయ్యాయి. 1945వ సంవత్సరం ఆగస్టు భారత జాతీయ సైన్యానికి సహకరించిన జపాన్ సైనిక దళాలు బ్రిటిష్ సైనిక దళాలకు శరణుజొచ్చాయి. దీనితో నేతాజీ సింగపూర్‌ను వీడి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. 1945 ఆగస్టు 18 వ తేదీన తైపీలో జరిగిన విమాన ప్రమాదంలో అయన మరణించి నట్లుగా రేడియోలో ప్రకటించారు. ఇక తైవాన్ కి సంబంధించిన ఎయిర్ క్రాష్ లో చంపేశారని కొందరు, ఆగస్ట్ 1945 తర్వాత నేతాజీ రష్యాలో ఉన్నాడని చెప్పడం వల్ల అతను చనిపోలేదని మరికొందరు, సుభాష్ చంద్రబోస్ మారువేశంలో మన దేశం లోనే ఉన్నాడని ఇలా ఎన్నో రకాలుగా చెప్పుకునేవారు. సైన్యానికి శిక్షణ ఇచ్చేప్పుడు... "నేను మీకు కేవలం ఆకలి, దాహం, కష్టం, మృత్యువును మాత్రమే ఇవ్వగలను. నాకు మీ రక్తాన్ని ఇవ్వండి. మీకు స్వతంత్రాన్ని ఇస్తాను"... అని సైన్యంలో విశ్వాసాన్ని చిగురించేలా చేసేవాడు. దేశం కోసం ఎవరు చేయని విధంగా అహింస వలన కాదు, పోరాడితేనే స్వాతంత్ర్యం వస్తుందని కట్టు బట్టల్తో జపాన్ వెళ్లి ఇండియన్ ఆర్మీని సిద్ధం చేసి బ్రిటిష్ సైన్యానికి గుండెల్లో రైళ్లు పరిగెత్తించి చివరికి స్వాతంత్ర్య చూడకుండానే కనుమరుగైన యోధుడు బోస్. నేతాజీ సుభాస్ చంద్రబోస్ యొక్క విలువైన వారసత్వాన్ని, చరిత్రను పరిరక్షించడానికి భారత ప్రభుత్వం అనేక రకాల చర్యలను చేపట్టింది. న్యూఢిల్లీలోని ఎర్రకోట వద్ద నేతాజీపై మ్యూజియం ఏర్పాటు చేశారు. దీనిని 23.01.2019న ప్రధాని ప్రారంభించారు. దేశంలో చారిత్రాత్మక విక్టోరియా మెమోరియల్ భవనంలో కోల్‌కతాలో నేతాజీపై లైట్ అండ్ సౌండ్ షో శాశ్వత ప్రదర్శన ఏర్పాటు చేయడానికి ప్రణాళిక చేయ బడింది. అండమాన్, నికోబార్‌లోని 3 ద్వీపాలకు పేరు మార్చి ప్రధాని మోదీ రాస్ ద్వీపానికి నేతాజీ సుభాష్ "చంద్రబోస్ ద్వీపంగా" పేరు మార్చారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

చురకలు



# ఇళ్లకు వెళ్లకుండానే బిల్లులు

హైదరాబాద్: విద్యుత్తు బిల్లులను ప్రతి నెలా ఇంటింటికి తిరిగి రీడింగ్ నమోదు చేసి జారీ చేయాల్సి ఉండగా.. కొందరు సిబ్బంది నిర్లక్ష్యంతో కార్యాలయంలో కూర్చొని కానిచ్చేస్తున్నారు. అన్ని సెక్షన్లలోనూ ఈ తరహా టేబుల్ బిల్లింగ్ ఇటీవల పెరిగింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కొందరు బిల్ రీడర్స్ ఒక్కో సెక్షన్ పరిధిలోనే వందల సంఖ్యలో ఈ తరహాలో బిల్లులు జారీ చేస్తున్నారు. వినియోగించిన కరెంట్‌కు, వస్తున్న బిల్లులకు సంబంధం లేకుండా ఉంటున్నాయని, చలికాలంలోనూ అధిక బిల్లులు వస్తున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. సిటీలోని మెట్రో, రంగారెడ్డి, మేడ్చల్ మూడు జోన్లలో ప్రస్తుతం పది సర్కిళ్లు ఉన్నాయి. వీటి పరిధిలో



62.92 లక్షల కనెక్షన్లు ఉన్నాయి. ప్రతి నెలా మొదటి రెండు వారాలు బిల్లింగ్ తీస్తుంటారు. ఒక నెల మీటర్ రీడర్లు బిల్లింగ్ తీస్తే.. మరుసటి నెల విద్యుత్తు సిబ్బందినే నమోదు చేసి జారీ చేస్తుంటారు.

**ఐఆర్ పోర్ట్ మీటర్లు బిగించినా..**

కనెక్షన్లను సెక్షన్ల వారీగా విభజించి మీటర్ రీడర్లు ప్రతి ఇల్లు, వాణిజ్య కేంద్రం తిరిగి రీడింగ్ నమోదు చేసి బిల్లులు జారీ చేయాలి. జీడిమెట్ల డివిజన్ షాపూర్‌నగర్ సెక్షన్‌లో కొందరు సూరారం, శ్రీరాంనగర్, ఎస్ఆర్ నాయక్ నగర్ ప్రాంతాల్లో గత నెలలో దాదాపు 700 కనెక్షన్లకు కార్యాలయంలో కూర్చునే బిల్లులు ఇచ్చారు. వీటిని ఈ నెలలో సర్దుబాటు చేసేందుకు లైవ్ కనెక్షన్లను సైతం అండర్ డిస్‌కనెక్షన్ కింద మార్చేశారు. ఈ తరహాలో సిటీలోని పలు సెక్షన్లలో ఇప్పటికీ అక్రమాలు చేస్తున్నారు. రీడింగ్‌లో లోపాలు లేకుండా కచ్చితత్వంతో జారీ చేసేందుకు ఐఆర్ పోర్ట్ మీటర్లను బిగించినా... ఐఆర్ పోర్ట్ బిల్లింగ్ యంత్రాలు ఇచ్చినా అక్రమాలకు పాల్పడుతున్నారు. రెండు నెలలకు ఒకసారి బిల్లులు ఇస్తున్న ఉదంతాలూ బయటపడుతున్నాయి.

# పది నెలలుగా ఎదురుచూపులు

కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో వీధి వ్యాపారులకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా దుకాణాలు నిర్మించి ఇస్తున్నారు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా సమీకృత మార్కెట్లను నిర్మిస్తుండటం, స్థలాలు ఉన్న చోట్ల పక్కా నిర్మాణాలు చేపట్టడంతో సమస్యలు దూరమవుతున్నాయి. అయితే వీధి వ్యాపారులు ఎక్కువ సంఖ్యలో ఉండటం, దుకాణాలు తక్కువగా ఉంటుండటంతో అందరికి దక్కడం లేదు. ఈనెల 6న ప్రభుత్వాసుపత్రి పక్కన 120 దుకాణాలకు లాటరీ ద్వారా అప్పగించగా.. నేడు పద్మనగర్ సమీకృత మార్కెట్ లోపలి భాగంలో నిర్మించినవాటికి డ్రా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు.

**295 దరఖాస్తులు**

శాతవాహన యూనివర్సిటీ రోడ్డులోని విద్యానగర్‌లో రేకుల షెడ్డుతో 25 దుకాణాలు నిర్మించి రెండేళ్లవుతుంది. పది నెలల కిందట వీటిని అప్పగించడానికి దరఖాస్తులు ఆహ్వానించారు. ఆ సమయంలో దరఖాస్తుకు రూ.100 చెల్లించి, రూ.వెయ్యితో డీడీ తీసి రెవెన్యూ విభాగంలో అందించారు. మొత్తం 295 మంది దరఖాస్తు చేసుకోగా.. ఇప్పటివరకు ఆ దిశగా కార్యాచరణ తీసుకోవడం లేదు. వెంటనే కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ చొరవ తీసుకొని దుకాణాలు అప్పగించాలని కోరుతున్నారు.

**రిజర్వేషన్ల ప్రకారమే..**

విద్యానగర్‌లోని వీధి వ్యాపారుల దుకాణాలకు రిజర్వేషన్ల ప్రకారం డ్రా తీయనున్నారు. ఐదేళ్ల కాలపరిమితితో నెలసరి అద్దె రూ.2500 కాగా పాలకవర్గ సమావేశంలో తీర్మానం చేశారు. ఎస్సీ రిజర్వేషన్‌లో 2, 7, 16, 22వ దుకాణాల నెంబర్లు.. ఎస్టీ విభాగంలో 8, 25వ.. దివ్యాంగులకు ఆరవ నెంబర్ దుకాణం.. నాయీ బ్రాహ్మణులకు, వాషర్‌మెన్‌కు 4వ నంబర్ల దుకాణాలు, స్వశక్తి సంఘాల మహిళలకు 3వ.. మిగతా వాటిని జనరల్ విభాగంలో లక్కీ డ్రా ద్వారా ఖరారు చేయనున్నారు. ఈ విషయాన్ని ఆర్వో సునీల్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే లాటరీ నిర్వహిస్తామన్నారు.

# కట్టు కాల్వ కబ్జా

తూప్రాన్: అధికారుల పర్యవేక్షణ లోపంతో ఏళ్లుగా ఉన్న రోడ్లు, కుంటలు దర్జాగా కబ్జాకు గురవుతున్నాయి. తూప్రాన్ పురపాలిక పరిధి బ్రాహ్మణపల్లి గ్రామ శివారులోని కట్టు కాల్వ రోడ్డును కబ్జా చేసి కంచె ఏర్పాటు చేశారు. దీంతో తూప్రాన్, శివ్వంపేట మండలాలకు రైతులు, ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. కట్టుకాల్వ సమీపంలో కొందరు స్థిరాస్తి వ్యాపారులు భూములు కొనుగోలు చేశారు. ఈ భూమిని ఆనుకొని నక్ష రోడ్డు ఉండడంతో చుట్టూ కడీలు పాతి కంచె ఏర్పాటు చేశారు. పట్టపగలు అధికారులకు తెలిసి జరుగుతున్నా అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలకు వెళ్లేందుకు దారి లేకుండా పోయిందని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు మండిపడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే కబ్జాకు గురైన నక్షరోడ్డు, కట్టు కాల్వలకు తిరిగి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**రైతులకు కష్టకాలమే..**

ఈ కట్టు కాల్వల ద్వారా దాదాపు 4 గ్రామాలకు సంబంధించిన చెరువులు, కుంటలకు నీరు చేరుతుందని రైతులు తెలిపారు. శివ్వంపేట మండలం దొంతి గ్రామం చెరువు నిండితే చెక్‌డ్యామ్ నుంచి గుండ్లపల్లి, నర్సంపల్లి, బ్రాహ్మణపల్లి, పడాలపల్లి వరకు నీరు కట్టు కాల్వల ద్వారా చేరుతుంది. ఇది కబ్జా చేస్తే భవిష్యత్తులో ఈ గ్రామాల్లోని చెరువు, కుంటల పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది. రోడ్డును కబ్జా చేయడం ద్వారా ఆయా గ్రామాల రైతులకు రాకపోకలు చేసేందుకు దారి లేకుండా పోతోంది. **అధికారులు పట్టించుకోవడం లేదు-శివ నర్సింలు, మాజీ ఉపసర్పంచి బ్రాహ్మణపల్లి**బ్రాహ్మణపల్లి శివారులో ళ్లుగా ఉన్న కట్టు కాల్వ, నక్ష రోడ్డు కబ్జాకు గురైందని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి. లేదంటే పెద్దస్థాయిలో ఆందోళనలు చేస్తాం.బాధ్యులపై చర్యలు తీసుకుంటాం- అనూరాధ, ఏఈ నీటిపారుదలశాఖ, తూప్రాన్ స్థిరాస్తి వ్యాపారులు రోడ్డుకు అడ్డంగా కంచె వేసినట్లు మా దృష్టికి వచ్చింది. రెవెన్యూ అధికారులతో కలిసి సోమవారం కబ్జాకు గురైన కట్టు కాల్వలను పరిశీలిస్తాం. రెవెన్యూ అధికారులతో క్షేత్రస్థాయిలో సర్వే చేయిస్తాం. విచారణలో కబ్జా అని తేలితే బాధ్యులపై శాఖపరమైన చర్యలు తీసుకుంటాం.

# నెరవేరనున్న రేషన్ కార్డుల కల



కోనరావుపేట : నిరుపేదలు ఏళ్లుగా ఎదురుచూస్తోన్న రేషన్ కార్డుల మంజూరుకు మోక్షం లభించనున్నది. ప్రభుత్వం ఈ నెల 26న అర్హులైన వారికి అందించటానికి గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు సర్వే చేస్తున్నారు. ఉన్నతాధికారులు జారీ చేసిన జాబితా ప్రకారం ఇంటింటికీ తిరుగుతూ సర్వే చేస్తున్నారు. కుటుంబ సభ్యుల ఆర్థిక స్థితిగతులు, ఆధార్ కార్డుల వివరాలు సేకరిస్తున్నారు. వీటి ప్రకారం జాబితా తయారు చేసి గ్రామ సభల్లో ప్రకటించడానికి ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు.

జిల్లాలో ఎక్కువగా పేదలు ఉన్నారు. ప్రధానంగా చేనేత, వ్యవసాయ రంగాలపై ఆధారపడినవారే ఉన్నారు. పని ఉంటేనే కుటుంబం గడుస్తోంది. లేకుంటే పస్తులతో ఉంటున్నవారు కూడా ఉన్నారు. ఇటువంటి వారికి రేషన్ కార్డులు లేక ప్రభుత్వ పథకాలను పొందలేక పోతున్నారు. కొన్నేళ్లుగా ప్రభుత్వం వీటిని మంజూరు చేయడం లేదు. దీంతో దరఖాస్తు చేసుకున్నా ఫలితం ఉండటం లేదు. ఎట్టకేలకు ప్రజాపాలన కార్యక్రమంలో చేసుకొన్న అర్జీలను పరిశీలించి మంజూరుకు కసరత్తు చేస్తోంది. దీంతో ఆశలు చిగురించాయి. జిల్లాలో మొత్తం 9,731 మంది దరఖాస్తుదారుల జాబితా మాత్రమే రాష్ట్ర అధికారుల నుంచి జిల్లా అధికారులకు వచ్చింది. దీంతో ఈ జాబితా ప్రకారమే మండల పరిషత్ అభివృద్ధి అధికారి, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది గ్రామాల్లో సర్వే చేస్తున్నారు. కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్‌కార్డు, ఇతర వివరాలను నమోదు చేస్తున్నారు. నమోదు చేసిన వివరాల ప్రకారం రూపొందించిన జాబితాను గ్రామ సభల్లో ప్రదర్శించి అభ్యంతరాలను స్వీకరించనున్నారు. అనంతరం గ్రామ సభల్లో తీర్మానం మేరకు తుది జాబితాను ఉన్నతాధికారులకు అందించనున్నారు. ఈ నెల 26న అర్హులైన వారికి నూతన రేషన్‌కార్డులు అందించేలా కసరత్తు చేస్తున్నారు. దీంతో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదలకు రేషన్ కార్డుల మంజూరు కానుండటంతో కల నెరవేరనున్నది.

**మూడేళ్లుగా ఎదురుచూపులు**

మూడేళ్ల క్రితం వివాహమైంది. భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. రేషన్ కార్డు మంజూరుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి వీలు లేకుండా మూడేళ్లుగా సైట్ మూసివేశారు. ఏడాది క్రితం ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నా. ఉన్నతాధికారులు జారీ చేసినా జాబితాలో మా కుటుంబం పేరు లేదు. అధికారులను, పంచాయతీ కార్యదర్శిని సంప్రదిస్తే ఉన్నతాధికారులు జారీ చేసిన జాబితా ప్రకారమే సర్వే చేసి వివరాలు సేకరిస్తున్నామన్నారు. దరఖాస్తుదారులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలి.బోరుగాయ బాలకృష్ణ, దరఖాస్తుదారు, మంగళ్లపల్లి**అర్హులందరికీ మంజూరు**

ఉన్నతాధికారులు జారీ చేసిన జాబితాలోని కుటుంబ సభ్యుల వివరాలను క్షేత్రస్థాయిలో కార్యదర్శులు సేకరిస్తున్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకొన్న వారిలో అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేసేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. గ్రామాల్లో సర్వే చేసిన జాబితా వివరాలను గ్రామ సభల్లో వెల్లడించి ప్రభుత్వానికి నివేదిస్తాం. జి.శంకర్‌రెడ్డి, ఎంపీడీవో, కోనరావుపేట

# పట్టణ వీధులకు సీసీ రహదారుల కళ



వేములవాడ : ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడలోని వీధులకు సీసీ రోడ్ల కళ సంతరించుకుంది. పట్టణం ఏటేటా విస్తరిస్తున్నప్పటికీ చాలా వీధుల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల చాలా చోట్ల నిర్మాణాలు పూర్తి చేయడంతో సమస్య తీరింది.

వేములవాడ పురపాలక సంఘానికి 2022-23 సంవత్సరంలో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ) నిధులు రూ.20 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటితో పట్టణంలోని 28 వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు మున్సిపల్ పాలకవర్గం తీర్మానించి చేపట్టింది. ఇందులో మొదటి విడతలో రూ.12.43 కోట్లతో ఎనిమిది ప్యాకేజీల్లో చిన్న, పెద్దవి కలిపి మొత్తం 280 సీసీ రోడ్లు, కాలువలు నిర్మించారు. రెండో దశలో రూ.7.56 కోట్లతో రెండు ప్యాకేజీల్లో 110 సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టారు. మొదటి దశలో చేపట్టినవి కొద్ది రోజుల కిందట పూర్తి కాగా, రెండో దశలో చేపట్టినవి కొన్ని సాంకేతిక కారణాలతో ఆగుతూ సాగుతూ వచ్చినప్పటికీ ఎట్టకేలకు పూర్తి చేశారు. ప్రస్తుతం 28వ వార్డులో కొన్ని, 19వ వార్డులో సీసీ రోడ్డు నిర్మించాల్సి ఉంది. రూ.20 కోట్లతో చాలా వరకు నిర్మాణాలు చేపట్టారు. దీంతో సమస్య తీరింది.

**చేయాల్సినవి చాలా ఉన్నాయి**

పట్టణంలోని రెండు బైపాస్ రహదారుల వెంబడి, మల్లారం రోడ్డు, కోనాయిపల్లి కట్టు కాలువ ప్రాంతం, చెక్కపల్లి రోడ్డు, భగవంతరావునగర్ శివారు, మహాలక్ష్మి వీధి శివారు ప్రాంతాల్లో కొత్తగా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇలాంటి ప్రాంతాల్లో సీసీ రోడ్లు, కాలువలు వంటి పనులు చేపట్టాల్సి ఉంది. వీటిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

**పనులు పూర్తయ్యాయి**

పట్టణంలో రూ.20 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు దాదాపు పూర్తయ్యాయి. చాలా కాలనీల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం చేపట్టాం. ఒకటి, రెండు పనులు తప్ప మొత్తం పూర్తి చేశాం. అవి కూడా త్వరలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకొంటాం. అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

# సవరించని పింఛను.. పెరగని ఆదాయం



గోదావరిఖని : సింగరేణిలో విశ్రాంత కార్మికుల పింఛను సవరించడం లేదు. వేతనాలు పెరిగినప్పటికీ దానికి అనుగుణంగా విశ్రాంత కార్మికులకు చెల్లించాల్సిన పింఛనుపై ఇంకా లెక్కలు తేలడం లేదు. బొగ్గుగని కార్మికుల పదకొండో వేతన సవరణ జరిగి ఏడాదిన్నర కావస్తోంది. వేతన కాలపరిమితి మొదలై మూడున్నరేళ్లు అవుతోంది. రెండేళ్లు ఆలస్యంగా వేతన ఒప్పందం కుదిరింది. వేతన సవరణ కాలపరిమితిలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత కార్మికులకు పెరిగిన వేతనాల ప్రకారం పింఛను అందించాల్సి ఉంటుంది. కాగా ఇప్పటి వరకు ఎలాంటి లెక్కలు చేయలేదు. దీనిని కోల్ ఇండియా స్థాయిలో అనేక సార్లు కార్మిక సంఘాలు ప్రస్తావించాయి. జేబీసీసీఐ సమావేశాల్లో ఈ అంశంపై ప్రస్తావించినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దేశవ్యాప్తంగా 3.5 లక్షల మంది బొగ్గుగని కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి పదకొండో వేతన సవరణ 2023, మే నెలలో ఒప్పందం కుదిరింది. వేతన సవరణ కాలపరిమితి 2021, జులై 1 నుంచి అమలు కావాల్సి ఉంది. రెండేళ్లు ఆలస్యంగా ఒప్పందం కుదరడంతో ఆ కాల పరిమితిలో ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత కార్మికులకు పెరిగిన వేతనాల ప్రకారం పింఛను సవరించాల్సి ఉంది. కాని ఇప్పటి వరకు సవరించకపోవడంతో విశ్రాంత ఉద్యోగులు ప్రయోజనాల కోసం ఎదురు చూస్తున్నారు.

**వివరాలు సేకరించి...**సింగరేణి వ్యాప్తంగా విశ్రాంత ఉద్యోగుల వివరాలను సేకరించినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. హోదాల వారిగా మూలవేతనం, వాటిపై లభించే ప్రయోజనాలను లెక్కించి దానిపై పింఛను చెల్లించాల్సి ఉంటుంది. ఉద్యోగ విరమణ పొందే నాటికి వారి వేతనాలు, మూల వేతనం ఎంత ఉందన్న విషయాలను అధికారులు సేకరించారు. పెరిగిన వేతనం ప్రకారం ఎంత ప్రయోజనం వస్తుందన్నది లెక్కించాల్సి ఉంటుంది. దీనిపై సీఎంపీఎఫ్ అధికారులు కసరత్తు చేసినప్పటికీ అందుకు సంబంధించిన ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో విశ్రాంత కార్మికులకు ఇప్పటి వరకు పింఛను పెరుగుదలకు సంబంధించిన ఆర్థిక ప్రయోజనం అందడం లేదు.

**రెండు వేల మంది**

సింగరేణి వ్యాప్తంగా రెండువేల మంది వరకు విశ్రాంత కార్మికులు ఉన్నట్లు గుర్తించారు. 2021, జులై 1 నుంచి 2023, మే వరకు పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కార్మికులు ఎంత మంది ఉన్నారన్న సమాచారన్ని డివిజన్ల వారిగా సింగరేణి నుంచి సీఎంపీఎఫ్ అధికారులు సేకరించారు. వీరి మూలవేతనం, డిజిగ్నేషన్‌లను తీసుకుని ఎంత పెరుగుదల ఉంటుందన్నది లెక్కించాల్సి ఉంటుంది. దీనిపై కసరత్తు చేస్తున్న సీఎంపీఎఫ్ అధికారులు అమలు చేయడానికి మాత్రం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో పెరిగిన పింఛను ఎప్పటిలోగా చెల్లిస్తారన్నది తెలియక విశ్రాంత కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ప్రక్రియ త్వరగా ప్రారంభించాలని కోరుతున్నారు.

# జలాశయంలో నీరు.. సాగు భూములకు అందని తీరు

కోనరావుపేట : మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయటానికి గత ప్రభుత్వం కాళేశ్వరం ఎత్తిపోతల జలాశయం నిర్మాణం చేపట్టింది. దీనిలోకి మధ్యమానేరు ద్వారా గోదావరి జలాలను తరలించి తద్వారా సాగు భూములకు నీరందించాలన్నది లక్ష్యం. అయితే కాలువల నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో చెరువులు, కుంటలు నింపే పరిస్థితి లేదు. జిల్లాలో కోనరావుపేట మండలం మల్కపేటలో సుమారు రూ.వేయి కోట్ల వ్యయంతో కాళేశ్వరం ఎత్తిపోతల జలాశయం నిర్మాణం చేపట్టారు. ఏడాదిన్నర క్రితం రెండు పంపు మోటార్ల ట్రయల్ రన్ నిర్వహించి మధ్యమానేరు నుంచి గోదావరి జలాలను నింపారు. జలాశయం సామర్థ్యం 3 టీఎంసీలకు గాను 1 టీఎంసీ మేర నిల్వ చేశారు. ప్రస్తుతం నీరు తగ్గింది. ఇటీవల ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జలాశయంపై దృష్టిసారించారు. నీటిపారుదల ఉన్నతాధికారులతో కలిసి జలాశయాన్ని సందర్శించారు. మాధ్యమానేరు నీటి లభ్యత ఆధారంగా ఇందులోకి నీటి తరలింపునకు చర్యలు చేపట్టాలని సూచనలు చేశారు. నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు, పంపు



మోటార్ల గుత్తేదారులు 0.2 టీఎంసీ నీటిని తరలించారు. దీంతో ప్రాజెక్టులో 1 టీఎంసీ నీరు నిల్వ ఉంది. జలాశయం దిగువ, ఎగువ ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరగనున్నాయి. దీంతో బోరుబావులకు నీరు అంది పంటల సాగుకు అవకాశం ఏర్పడింది.

**నిర్మాణం ఇలా...:** జలాశయం కుడి కాలువ సుమారు 12.03 కిలో మీటర్లు ఉంది. వేములవాడ అర్బన్ మండలం మారుపాక వరకు ఉంది. అక్కడక్కడ వదిలేయడంతో 11 కిలో మీటర్లు పనులను రెండేళ్ల క్రితం పూర్తి చేశారు. మల్కపేట ఊర చెరువు శిఖం భూములు 40 ఎకరాల్లో కాలువ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. రైతులు కాలువ తవ్వకానికి అభ్యంతరం తెలపడంతో పనులు నిలిచిపోయాయి. ః నాగారం-పల్లిమక్త మధ్య ప్రధాన రోడ్డులో కాలువ ద్వారా నీటి సరఫరాకు వంతెన నిర్మించాల్సి ఉంది.

ఎడమ కాలువ సుమారు 7 కిలో మీటర్లు కాగా భూసేకరణ పూర్తిస్థాయిలో చేపట్టలేదు. దీంతో కాలువ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. పల్లిమక్త, సుద్దాల, మల్కపేట గ్రామాల్లోని పలు చోట్ల సీసీ నిర్మించాల్సి ఉంది.

చెరువులు నింపితే మేలు

మాది ఉమ్మడి కుటుంబం. అంతా వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాం. మాకు 10 ఎకరాల భూమి ఉంది. కుడి కాలువ నిర్మాణంలో ఎకరం కోల్పోయ్యా. నాలుగు బోరుబావుల ద్వారా మిగిలినది యాసంగిలో వరి సాగు చేశాం. వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి బోరుబావులు వట్టిపోతాయి. పంటలు చేతికందే సమయంలో ఎండిపోయే ప్రమాదం ఉంది. పాలకులు, అధికారులు స్పందించి అసంపూర్తిగా నిలిచిన కాలువలను పూర్తి చేసి చెరువులు నింపితే యాసంగి పంటలు ఎండిపోకుండా ఉంటాయి.

జిన్న అనిల్, రైతు, పల్లిమక్త

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం**

మల్కపేట ఊర చెరువు శిఖం భూముల్లో కాలువ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంకు లెవల్) భూములకు ప్రభుత్వం పరిహారం ఇవ్వరాదు. మల్కపేట రైతుల సమస్యను ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. సమస్యను పరిష్కరిస్తే సుమారు అర కిలో మీటరు మేర కాలువ తవ్వకం చేపడితే గొలుసు కట్టు కాలువల ద్వారా సుమారు 10 చెరువులను నింపటానికి అవకాశం ఉంటుంది.వినోద్, డీఈ, మల్కపేట రిజర్వాయర్

# ఆంగ్లంపై పట్టు.. భవితకు మెట్టు

మెదక్ : ఇంటర్మీడియట్ స్థాయిలోనే విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యం, వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు ప్రభుత్వం గత ఏడాది నుంచి ఆంగ్లంలో ప్రయోగ పరీక్షకు శ్రీకారం చుట్టింది. గతేడాది ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మాత్రమే ఆంగ్ల ప్రయోగ పరీక్ష ఉండగా, ఈ ఏడాది ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సైతం పరీక్ష నిర్వహించనున్నారు. మొత్తం 80 మార్కులు థియరీకి కేటాయించగా ప్రయోగ పరీక్షలకు 20 మార్కులు కేటాయించారు. నాలుగు దశల్లో నిర్వహించే ఈ పరీక్షలో కనీసం 7 మార్కులు వస్తేనే ఉత్తీర్ణులవుతారు. గైర్హాజరైన విద్యార్థులను అనుత్తీర్ణులుగా పరిగణిస్తారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఈనెల 31న, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 1వ తేదీన నిర్వహించనుండగా అందుకోసం విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

**నాలుగు దశల్లో ..**

ఈ ఏడాది ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 13,401 మంది ఉన్నారు. వీరందరికీ తరగతి గదిలోనే భాషా సామర్థ్యాల పరిశీలనతో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఒక్కో దశలో నాలుగు మార్కుల చొప్పున, ప్రయోగ పరీక్షకు నాలుగు మార్కులు కలిపి మొత్తం 20 మార్కులు కేటాయించారు. మొదటి దశలో ఏదైనా ఒక అంశంపై ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది విద్యార్థులు సంభాషించుకునే తీరును అధ్యాపకులు పరీక్షిస్తున్నారు.

రెండో దశలో ఇక అంశంపై నిమిషంలోపు అనర్గళంగా మాట్లాడాల్సి ఉంటుంది.మూడో దశలో తల్లిదండ్రులు లేదా మరేదైన అంశంపై విద్యార్థులు బృందంగా చర్చించాలి.

నాలుగో దశలో గ్రహించే శక్తి పెంపొందించడంపై అధ్యాపకులు పరీక్షిస్తారు. వీటితో పాటు రికార్డు బుక్ ఉంటేనే వారి ప్రతిభ ఆధారంగా మార్కులు కేటాయిస్తారు.

30న పర్యావరణ విద్యపై..

పర్యావరణ విద్యపై అన్ని రకాల విభాగాలకు సంబంధించిన విద్యార్థులకు ఈనెల 30 తేదీన పరీక్ష నిర్వహిస్తుండగా, ఇంటర్మీడియట్‌లో 2024కు ముందు గల బ్యాక్‌లాక్ విద్యార్థులకు మాత్రమే నైతికత-మానవ విలువలు సంబంధించిన పరీక్షను ఈనెల 29న నిర్వహించనున్నారు.

మొత్తం విద్యార్థులు

ప్రథమ సంవత్సరం: 6,928

ద్వితీయ : 6,473

జిల్లాలోని కళాశాలలు: 61

ప్రతి ఒక్కరూ హాజరవ్వాలి- మాధవి, జిల్లా ఇంటర్ నోడల్ అధికారి

ఇంటర్ స్థాయి నుంచే ఆంగ్ల భాషపై విద్యార్థులు పట్టు సాధించేందుకు గత ఏడాది నుంచి విద్యాశాఖ ఆంగ్ల ప్రయోగ పరీక్షను ప్రవేశపెట్టింది. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఈనెల 31, ఫిబ్రవరి 1వ తేదీన రెండు విడుతల్లో ప్రయోగ పరీక్ష నిర్వహించనున్నారు. విద్యార్థులు ఆంగ్ల ప్రయోగ పరీక్షకు కచ్చితంగా హాజరుకావాలి.

చురకలు



# అటకెక్కిన హిమాయత్‌సాగర్ సర్వే!



మొయినాబాద్ : హిమాయత్‌సాగర్ జలాశయ హద్దులు గుర్తించడంలో ఎడతెగని జాప్యం చోటుచేసుకుంటోంది. జాతీయ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ (ఎన్ఆర్ఎస్ఏ), సర్వే ఆఫ్ ఇండియా(ఎస్ఓఐ) పటాల ఆధారంగా వాస్తవ విస్తీర్ణాన్ని కనుగొనాలని హైడ్రా నిర్ణయించగా ప్రక్రియ ముందుకు సాగడం లేదు. సర్వే చేపట్టి పూర్తిస్థాయి నీటిమట్టం, బఫర్‌జోన్ల హద్దులు గుర్తించాల్సి ఉంది. అయితే సర్వే తంతు అటకెక్కిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**నగర వాసుల దాహార్తి తీర్చడంలో..**

నగర వాసుల దాహార్తి తీర్చడంలో కీలక భూమిక పోషించిన హిమాయత్‌సాగర్ జలాశయానికి సంబంధించి గతంలోనూ చేపట్టిన సర్వే అర్ధంతరంగా నిలిచిపోయింది. నాలుగు మాసాల కిందట ఈ ప్రాంతంలో పర్యటించిన హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హిమాయత్‌సాగర్ జలాశయం ఎఫ్‌టీఎల్ పరిధిలోకి చొచ్చుకొచ్చిన నిర్మాణాలను పరిశీలించారు. ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వాలని నిర్ణయించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో వెలిసిన నిర్మాణాలను గుర్తించి రంగులు సైతం వేశారు. అనంతరం చేపట్టాల్సిన చర్యలపై ఒక్క అడుగు కూడా ముందుకు పడటం లేదు. వాస్తవానికి హిమాయత్‌సాగర్ పరీవాహక ప్రాంతం 1,311 చ.కి.మీ ఉండగా.. జలాశయ నిర్మాణ సమయంలో దాని సామర్థ్యం 3.232 టీఎంసీలు, ప్రస్తుతం 1.480 టీఎంసీలకు కుంచించుకుపోయింది. జలాశయం 5,938 ఎకరాల్లో ఉండగా.. 15ఏళ్ల క్రితం హెచ్ఎండీఏ, నీటి పారుదల, రెవెన్యూ, జలమండలి సంయుక్తంగా జలాశయం వద్ద కొంతమేర కొలతలు తీయగా 49.25 ఎకరాలు కబ్జాకు గురైనట్లు తేల్చారు.

**సమస్యలు ఎదురయ్యే అవకాశం..**

జలాశయంలో ఇప్పటివరకు పూడిక తొలగించలేదు. దీంతో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధి కొంతమేర పెరిగింది. పూడిక తీయకుండా సర్వే చేస్తే హద్దులు గుర్తించడంలో సమస్యలు ఎదురవుతాయి. సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కొలతలు తీశారు. వివిధ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేల్లో భారీ వ్యత్యాసం ఉండటంతో ప్రస్తుతం సర్వే ఎలా చేపట్టాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. జలాశయానికి ఆనుకొని ఉన్న మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడ, బాకారం జాగీర్, శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ, నర్కూడ, కవ్వగూడ రెవెన్యూ పరిధిల్లో విస్తరించి ఉన్న ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో సుమారుగా 150కుపైగా ఫాంహౌస్‌లున్నట్లు అధికారులు గుర్తించారు. ఆక్రమణల తొలగింపులు ఇప్పుడిప్పుడే చేపట్టే అవకాశాలు లేవు. సర్వే నిర్వహించి హద్దులు గుర్తించిన తర్వాతే ప్రక్రియ ముందుకు సాగుతుందని జలమండలికి చెందిన ఓ ఉన్నతాధికారి తెలిపారు.

## మార్చి నెలలో చర్లపల్లి నుంచి మరిన్ని రైళ్ల పరుగులు

హైదరాబాద్: చర్లపల్లి టెర్మినల్ నుంచి చెన్నై, గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపడానికి పచ్చజెండా ఊపిన దక్షిణమధ్య రైల్వే మార్చిలో మరో ఎనిమిది రైళ్లను ఇక్కడి నుంచి నడపాలని నిర్ణయించింది. అత్యాధునిక హంగులతో రూపుదిద్దుకుంటున్న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌పై ఒత్తిడి తగ్గిస్తూ నిర్మాణ పనులను మరింత వేగంగా పూర్తి చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. రైలు ప్రయాణాలకు సంబంధించి ముందస్తు రిజర్వేషన్ సమయం 60 రోజులు ఉండటంతో.. గడువు ముగుస్తున్న కొద్దీ రైళ్ల రాకపోకలను చర్లపల్లి మీదుగా సాగించాలని నిర్ణయించింది.

**50వేల మంది రాకపోకలు సాగించేలా..**

సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ స్టేషన్లలో పెరిగిన రైళ్ల ఒత్తిడిని దృష్టిలో పెట్టుకొని దక్షిణ మధ్య రైల్వే చర్లపల్లి స్టేషన్ విస్తరణ చేపట్టిన సంగతి తెలిసిందే. రోజూ సుమారు 50వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేలా చర్లపల్లి టెర్మినల్‌ను విస్తరించారు. సరకు రవాణా పార్సిల్ కేంద్రం కూడా ఏర్పాటు చేశారు. రోజుకు 200కు పైగా రైళ్ల రాకపోకలు సాగిస్తున్న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో పునరాభివృద్ధి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో కొన్ని రైళ్ల రాకపోకలను నియంత్రించాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పటికే సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులు సుమారు 40శాతం వరకు పూర్తయ్యాయి. ఈ ఏడాది డిసెంబరులోగా మొత్తం పనులు పూర్తి చేసి ప్రారంభించాలని దక్షిణ మధ్య రైల్వే లక్ష్యం నిర్దేశించుకుంది.



రోజూ 2లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్న ఈ స్టేషన్‌లో రైళ్ల రాకపోకలు, నిర్మాణ పనులు చేపట్టడంలో సమాంతరంగా పాటించడంలో సవాళ్లు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కొన్ని రైళ్లను చర్లపల్లి నుంచి నడిపేందుకు దక్షిణ మధ్య రైల్వే ఏర్పాట్లు చేస్తోంది. సికింద్రాబాద్ స్టేషన్‌లో పది ప్లాట్‌ఫామ్‌లు ఉండగా.. రెండు ప్లాట్‌ఫామ్‌ల చొప్పున దశలవారీగా పనులు పూర్తి చేయాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్ఓ తెలిపారు. ఈ మేరకే చర్లపల్లి నుంచి రైళ్లను నడపడం, హాల్టింగ్ తదితర అంశాలను నిర్ణయించనున్నట్లు వెల్లడించారు.

**వచ్చి పోయే రైళ్లు ఇవే..**

చెన్నై ఎక్స్‌ప్రెస్, గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్, కాగజ్‌నగర్ ఇంటర్‌సిటీ, కృష్ణా ఎక్స్‌ప్రెస్, గుంటూరు ఇంటర్ సిటీ, పుష్‌పుల్ (సికింద్రాబాద్, వరంగల్), శబరి ఎక్స్‌ప్రెస్, రేపల్లె ఎక్స్‌ప్రెస్ (మధ్యాహ్నం), శాతవాహన, కాకతీయ ఎక్స్‌ప్రెస్, కాచిగూడ- మిర్యాలగూడ ఎక్స్‌ప్రెస్, లింగంపల్లి, ఘట్‌కేసర్ ఎంఎంటీఎస్, రేపల్లె ఎక్స్‌ప్రెస్ (రాత్రి).

## జేబీఎస్ చెంత మెట్రో రైల్ హబ్

మేడ్చల్ : మెట్రోరైలు రెండోదశలో భాగంగా జేబీఎస్ వద్ద మెట్రోరైల్ హబ్ ఏర్పాటు చేయబోతున్నట్లు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు సంస్థ(హెచ్ఏఎంఎల్) వెల్లడించింది. మేడ్చల్, శామీర్‌పేట్ కారిడార్ల ప్రారంభ స్థానాన్ని జేబీఎస్ వద్ద ఏకీకృతం చేసి.. ప్రపంచస్థాయి ఇంటిగ్రేటెడ్ హబ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. ఇందుకోసం జేబీఎస్ పరిసరాల్లో రాష్ట్ర ప్రభుత్వం, రక్షణ శాఖకు చెందిన సుమారు 30 ఎకరాల భూమిని సమీకరించవచ్చని హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. ప్రతిపాదిత మార్గంతో మేడ్చల్ నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు 60 కి.మీ. సుదీర్ఘ మెట్రో కారిడార్ అవుతుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి.. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన మేడ్చల్, శామీర్‌పేట మెట్రో మార్గాలను రూపొందించే కసరత్తును అధికారులు ప్రారంభించారు. ప్యారడైజ్-మేడ్చల్(23 కి.మీ.), జేబీఎస్-శామీర్‌పేట(22 కి.మీ.) ప్రతిపాదిత కారిడార్ల అలైన్‌మెంట్ రూపొందించడంలో ఉన్న సాంకేతిక సవాళ్లను పరిష్కరించడానికి సీనియర్ ఇంజినీర్లు, సాంకేతిక సలహాదార్లతో కలిసి హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ రెండు కారిడార్ల ఏర్పాటులో ఎదురవుతున్న కొన్ని సంక్లిష్ట అంశాలను గుర్తించారు.



**భూగర్భ మార్గాన్ని నివారించేలా..**

క్లిష్టమైన మలుపులు, బేగంపేట విమానాశ్రయం రన్‌వే తర్వాత భూగర్భంలో అలైన్‌మెంట్‌ను తీసుకెళ్లే ఆవశ్యకతను నివారించేలా, ప్రైవేటు ఆస్తుల సేకరణను వీలైనంత తగ్గించేలా ప్రత్యామ్నాయ మార్గాల లాభనష్టాలను అంచనా వేయాలని మెట్రో ఎండీ అధికారులకు సూచించారు. సొరంగం ద్వారా కాకుండా బోయిన్‌పల్లి రోడ్ (సరోజినీ పుల్లారెడ్డి బంగ్లా పక్కన) చివరన ఉన్న జాతీయ రహదారి జంక్షన్ వద్ద అలైన్‌మెంట్‌ను అనుసంధానించవచ్చని తెలిపారు. అక్కడి నుంచి ఇప్పటికే విస్తరించిన జాతీయ రహదారి సర్వీస్ లేన్‌పై మెట్రో స్తంభాలను నిర్మించవచ్చని అన్నారు. దీంతో మేడ్చల్ -జేబీఎస్-ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట-శంషాబాద్ విమానాశ్రయం వరకు 60 కి.మీ. సుదీర్ఘ మెట్రో కారిడార్ ఏర్పాటవుతుందని తెలిపారు.

జేబీఎస్-శామీర్‌పేట మెట్రో మార్గం సికింద్రాబాద్ క్లబ్ సమీపంలో ప్రస్తుతమున్న మొదటి మెట్రో స్తంభం నుంచి డబుల్ ఎలివేటెడ్‌గా కరీంనగర్ రహదారిపై హెచ్ఎండీఏ నిర్మించబోయే ఎలివేటెడ్ కారిడార్‌గా నేరుగా పొడిగించవచ్చని ఎన్వీఎస్‌రెడ్డి వివరించారు.

స్టేషన్ స్థానాల నిర్ధారణ, వాటి సమీపంలో ఖాళీగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ, రక్షణ భూముల లభ్యత, మెరుగైన పార్కింగ్, ప్రయాణికులకు కల్పించే సౌకర్యాలను గుర్తించాలని ఆదేశించారు.

## ఉపాధ్యాయుల పరస్పర బదిలీలలు



కరీంనగర్ : ప్రభుత్వం ఉపాధ్యాయులకు కల్పించిన పరస్పర బదిలీల అవకాశం పలువురికి కలిసివస్తోంది. ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోరిక మేరకు విద్యాశాఖ ఈ అవకాశాన్ని కల్పించింది. అయితే కొందరు దీన్ని ఆసరా చేసుకొని ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారు. పరస్పర బదిలీల కోసం డబ్బుల దందా కొనసాగిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికే ఒప్పందాలు కుదుర్చుకొని అంగీకార పత్రాలను అధికారుల పరిశీలనకు అందించేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా పదవీ విరమణకు దగ్గరలో ఉండే వారితో ఒప్పందం చేసుకొని జిల్లా నుంచి స్థాన చలనం పొందనున్నారు. జిల్లా నుంచి ఇతర జిల్లాలకు వెళ్లే వారు, ఆయా జిల్లాల నుంచి వచ్చే వారితో రూ.లక్ష నుంచి రూ.13 లక్షల వరకు ఒప్పందం కుదుర్చుకున్నారని సమాచారం.

**నేడు ధ్రువపత్రాల పరిశీలన**

పరస్పర బదిలీలకు జిల్లాలో 78 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, సిద్దిపేట, సంగారెడ్డి, మేడ్చల్, ఆసిఫాబాద్, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు వెళ్లేందుకు అక్కడి ఉపాధ్యాయులతో పరస్పర అంగీకారం కుదుర్చుకొని దరఖాస్తులు సమర్పించారు. వీరి సర్వీసు బుక్, అండర్ టేకింగ్ సర్టిఫికెట్, 317 జీవో అలాట్‌మెంట్ కాపీ వంటి ధ్రువపత్రాల పరిశీలనను కరీంనగర్‌లోని డీఈవో కార్యాలయంలో సోమవారం పరిశీలన చేసి వివరాలను రాష్ట్ర విద్యా శాఖకు పంపించనున్నారు. వీరిలో కొందరు అర్హులూ ఉన్నారు. మరికొందరు జిల్లా నివాసులై ఉండి, ఇక్కడే స్థిరపడిన పలువురు బదిలీల్లో పరస్పర అంగీకారం తెలుపుతూ ఇతర జిల్లాలకు వెళ్లడం వెనుక అంతర్యం ఏమిటన్నది అందరిని ఆశ్చర్యపరుస్తోంది.

**కొన్ని దృష్టాంతాలు..**

జిల్లాలో పని చేస్తూ పరస్పర బదిలీపై ఇతర జిల్లాలకు వెళ్తున్న తీరుపై మిగిలిన ఉపాధ్యాయుల్లో సంశయం నెలకొంది.

దరఖాస్తుదారుల్లో ఈనెల 31న పదవీ విరమణ పొందే ఆరుగురు ఉండటం గమనార్హం.ఏప్రిల్‌లో పదవీ విరమణ పొందే 13 మంది పరస్పర బదిలీ జాబితాలో ఉండగా.. రెండేళ్లలో పదవీ విరమణ చేసేవారు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు.

పరస్పర బదిలీపై ఇతర జిల్లాలకు వెళ్లే జాబితాలో సింహభాగం ఎస్జీటీలే ఉన్నారు.

ఇప్పటికే ఇతర జిల్లాల నుంచి పరస్పర బదిలీపై వచ్చి.. మళ్లీ దరఖాస్తు చేసుకున్న వారు ఆరుగురు ఉన్నారు.

స్థానికత ఆధారంగా జిల్లా నుంచి పక్క జిల్లాకు కేటాయించిన ఓ టీచర్ తప్పిదం జరిగిందని, తిరిగి కరీంనగర్ జిల్లాకు వచ్చారు. ప్రస్తుతం పరస్పర బదిలీ కింద పక్క జిల్లాకు మొగ్గుచూపారు.

జిల్లాల కేటాయింపుల్లో పక్క జిల్లాలో నియమించగా పదోన్నతి పొందిన ఒకరు తిరిగి ఇక్కడకు బదిలీపై రానున్నారు. ఆయనతో నియామకమైన ఉపాధ్యాయులు అదే కేడర్‌లో ఉండగా, అతను మరో కేడర్‌లో వస్తుండటంతో సర్వీసులో జూనియర్లుగా మారనున్నామని అభ్యంతరం తెలుపుతున్నారు.

పరస్పర బదిలీపై ఇతర ప్రాంతం నుంచి ఇక్కడికి వచ్చిన ఓ ఉపాధ్యాయుడు ప్రస్తుతం మరో జిల్లాకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

## పర్యవేక్షణ లోపం.. నిర్వహణ అధ్వానం

గోదావరిఖని : గోదావరిఖనిలోని రామగుండం నగరపాలక కూరగాయల, మాంసం మార్కెట్ నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం పారిశుద్ధ్య నిర్వహణ మినహా శిథిలమవుతున్న మార్కెట్ భవనానికి తగిన మరమ్మతు చేయించడంతో పాటు వ్యాపారులకు సదుపాయాలు కల్పించడం పట్ల ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మార్కెట్ భవనం వ్యాపారాలకు అనుగుణంగా లేదంటూ విక్రయదారులు బయటకు వచ్చి కారిడార్‌లో వ్యాపారాలు చేసుకుంటున్నారు. మార్కెట్ భవనాన్ని ఆధునికీకరించాలని కూరగాయల వ్యాపారుల విన్నపాలను ఏమాత్రం పట్టించుకోని నగరపాలిక అదనంగా భవనంపై సుమారు రూ.కోటి వ్యయంతో షెడ్లు నిర్మించగా ప్రస్తుతం అవి నిరుపయోగంగా ఉన్నాయి. భవనం గోడలు, స్లాబులు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. చిరు వ్యాపారుల కోసం నిర్మించిన కొన్ని షెడ్లు సైతం నిరుపయోగంగా మారాయి. మార్కెట్కు మరో వైపు నిర్మించిన షెడ్లు శిథిలం కావడంతో కూల్చేశారు. ప్రధాన భవనంలోని సుమారు పది రిటైల్ దుకాణాలు శిథిలమయ్యాయి. బకాయిలతో సహా అద్దెలను వసూలు చేసుకుంటున్న నగరపాలిక మార్కెట్లో అవసరమైన వసతుల కల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వసతుల లేమి... ట్రాఫిక్ ఇక్కట్లు**

నగరపాలక హోల్‌సేల్, రిటైల్ మార్కెట్ ఒకేచోట నిర్మించడంతో ఉదయం వేళల్లో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. తెల్లవారక ముందే వివిధ గ్రామాల నుంచి కూరగాయలను తెచ్చే లారీలు, ఆటో ట్రాలీలతో మార్కెట్ పక్కనే ఉన్న ప్రధాన రహదారి రద్దీగా మారుతోంది. కనీసం ద్విచక్ర వాహనం సైతం బయటకు వెళ్లలేని పరిస్థితులు



నెలకొంటున్నాయి. ప్రత్యామ్నాయ చర్యల కోసం గతంలో సమాలోచన చేసిన అధికారులు ఆచరణను విస్మరించారు. ప్రధాన రహదారి పక్కనే కొన్ని దుకాణాలు నిరుపయోగంగా ఉండడంతో శిథిలమైపోతున్నాయి. వీటిని తొలగిస్తే కొంతమేరకు రహదారి వెడల్పు కావడంతో పాటు ట్రాఫిక్ ఇక్కట్లు తప్పే అవకాశముందని స్థానికులు భావిస్తున్నారు. హోల్‌సేల్ మార్కెట్లో రైతులు, హమాలీల నడుమ వివాదాలు నెలకొంటున్నాయి. రైతుల నుంచి కూరగాయలు తీసుకోవడంతో పాటు సకాలంలో సరకు దించడం లేదని అన్నదాతలు పలుమార్లు ఆందోళన చేపట్టిన సంఘటనలున్నాయి. చీకటి పడిందంటే చాలు మార్కెట్ భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. మార్కెట్ దుకాణ సముదాయాల పక్కనే కొందరు బహిరంగ మల, మూత్ర విసర్జన చేస్తున్నారు. దీంతో మార్కెట్లోని వ్యాపారులతో పాటు కొనుగోలు దారులు దుర్గంధంతో ఇక్కట్లు పడుతున్నారు. పారిశుద్ధ్యలోపం ఆవరణ అధ్వానంగా మారింది. నగరపాలక అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి సమస్యలు పరిష్కరించాలని... వసతుల కల్పనపై దృష్టి సారించాలని వ్యాపారులు, కొనుగోలు దారులు కోరుతున్నారు.

## రూ.500 కోట్లతో మంజీరా కొత్త పైపులైను

హైదరాబాద్: సుమారు 60 ఏళ్లుగా నగరానికి మంచినీటిని సరఫరా చేస్తున్న మంజీరా తాగునీటి పైపులైను స్థానంలో రూ.500 కోట్లతో కొత్త పైపులైను ఏర్పాటు చేయడానికి రంగం సిద్ధమవుతోంది. సుదీర్ఘకాలంగా సేవలు అందిస్తున్న ఈ పైపులైను పాతది కావడంతో తరచూ మరమ్మతులకు గురవుతూ.. నీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ఒక్కోసారి వారం నుంచి 15 రోజులు సరఫరా నిలిచిపోతోంది. పైపులైను సామర్థ్యం 45 ఎంజీడీలు అయినా 33 నుంచి 37 ఎంజీడీలకు మించి నీటిని సరఫరా చేసే పరిస్థితి లేకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

**1965లో ఏర్పాటు చేసి...**

ఈ పైపులైన్‌ను 1965లో ఏర్పాటు చేయగా.. అక్కడక్కడ దెబ్బతింది.



ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన జలమండలి బోర్డు సమావేశంలో కొత్త పైపులైన్ ఏర్పాటుపై చర్చించారు. కొత్తగా 20 టీఎంసీల నీటిని నగరానికి తీసుకువచ్చే గోదావరి ఫేజ్-2తో పాటు దీన్ని కూడా చేపడితే నీటి సమస్యలు తగ్గడమే కాకుండా ఐదారు దశాబ్దాలు పైపులైను మన్నిక ఉంటుందని జలమండలి ఎండీ కె.అశోక్‌రెడ్డి బోర్డు సమావేశంలో వివరించారు. పాత లైను వెంట ప్రత్యామ్నాయంగా మరో అధునాతన లైన్ నిర్మించేలా కొత్త ప్రాజెక్టు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ ప్రతిపాదనలకు బోర్డు ఆమోదం తెలపడంతో జలమండలి అధికారులు కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. సుమారు రూ.450 కోట్ల నుంచి రూ.500 కోట్ల వరకు అవుతుందని అంచనా వేశారు. ఈ నిధుల సమీకరణపై అధికారులు దృష్టిసారించారు. పురపాలకశాఖ ఉన్నతాధికారులతో సమీక్షించి జల్‌జీవన్ మిషన్ నుంచి నిధులు తీసుకునేందుకు అవకాశాలపై అధ్యయనం చేస్తున్నారు. ముందుగా కేంద్రానికి ప్రతిపాదనలను పంపేందుకు వీలుగా ప్రాజెక్టు నివేదికను రూపొందిస్తున్నారు.

## పాతబస్తీ మెట్రో మార్గంలో ఆస్తుల కూల్చివేతలు షురూ

హైదరాబాద్: పాతబస్తీలో మెట్రోరైలు కోసం రహదారి విస్తరణకు సేకరించిన ఆస్తుల కూల్చివేత పనులు మొదలయ్యాయి. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ. మెట్రో మార్గంలో దాదాపుగా పదకొండు వందల ఆస్తులను సేకరించాల్సి ఉంది. ఈ ప్రక్రియ వివిధ దశల్లో ఉంది. ఇటీవల 34 ఆస్తులకు సంబంధించిన 41 మంది యజమానులకు తొలివిడతగా పరిహారం చెక్కులను కలెక్టర్ కార్యాలయంలో పంపిణీ చేశారు. చదరపు గజానికి రూ.81 వేలుగా పరిహారం నిర్ణయించారు. దీనికి సమ్మతించిన యజ



మానులు పరిహారం చెక్కులు తీసుకుని ఆస్తులను ఖాళీ చేస్తున్నారు. ఈ భవనాలను ఒక్కొక్కటిగా కూల్చివేస్తున్నారు. మొగల్‌పురా నుంచి అలిజాకోట్లా మార్గంలో కూల్చివేత పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. మార్చి నాటికి ఈ పక్రియను పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. కొంతమంది ఆస్తుల యజమానులు పరిహారం పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

## పోలీస్ సారూ.. ఇదేం తీరు!

హైదరాబాద్: నగర పరిధిలో కీలకమైన జోన్‌లోని ప్రధాన పోలీస్‌స్టేషన్ అది. దొంగతనం కేసులో పట్టుబడిన నిందితులకు స్టేషన్ బెయిల్ ఇప్పిస్తామంటూ రూ.లక్షలు తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో అంతర్గత విచారణకు ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవల జరిగిన చోరీ ఘటనపై ఆ ఠాణాలో కేసు నమోదైంది. సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించారు. కొన్ని రోజుల క్రితం వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో తప్పనిసరిగా జైలుకు వెళ్లాల్సి ఉంటుందని, 14 రోజుల రిమాండ్ తప్పదంటూ పోలీసులు హెచ్చరించారు. స్టేషన్ బెయిలిచ్చి సహకరిస్తామంటూ నిందితులకు భరోసా ఇచ్చారు. దీంతో పోలీసులకు రూ.3 లక్షల నగదు, బంగారు ఆభరణాలు ఇచ్చారు. న్యాయస్థానం రిమాండ్ విధించడంతో కథ అడ్డం తిరిగింది. విషయం బయటపడటంతో పోలీసులు తీసుకున్న ఆభరణాలు తిరిగి ఇచ్చేసినట్లు తెలిసింది. నగదు ఇవ్వకుండా కుటుంబసభ్యులను ఠాణా చుట్టూ తిప్పుతున్నట్లు ఆరోపణలున్నాయి.

**నోటీసులిచ్చి పంపిస్తామని..** నిందితుల్లో ఒకరు పోలీసు ఉద్యోగి కుటుంబానికి చెందిన వ్యక్తి కావడంతో విషయం ఉన్నతాధికారుల దృష్టికి చేరింది. నిందితులకు నోటీసులిచ్చి పంపుతామని ఇద్దరు కానిస్టేబుళ్లు డబ్బులు వసూలు చేశారు. సొమ్ములో కొంత వాటా డీఐ, ఎస్సైలకు ఇవ్వాలని చెప్పినట్లు తెలిసింది. డీఐ, ఎస్సైల పేరు చెప్పి కానిస్టేబుళ్లు వసూలు చేశారా.. డీఐ ఆదేశాలతోనే అలా చేశారా.. అనేది అంతర్గత విచారణలో తేలాల్సి ఉంది. స్టేషన్ బెయిల్ ఇప్పిస్తామని వసూళ్లకు పాల్పడిన విషయం దృష్టికి వచ్చిందని, దీనిపై విచారణ జరుగుతున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

చురకలు



# సార్వత్రిక సహకారం.. ఉజ్వల భవితవ్యం

కరీంనగర్ : పెద్దపల్లి జిల్లాకు చెందిన రమేష్ అనే యువకుడు పదోతరగతి తర్వాత రెండేళ్ల ఐటీఐ పూర్తి చేశాడు. అందులో ఉత్తీర్ణత సాధించినా కుటుంబ ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా అతను ఉన్నత చదువులు చదవలేకపోయాడు. డిగ్రీ చేయాలని ఉన్నా.. రెగ్యులర్‌గా వెళ్లని పరిస్థితి. కరీంనగర్‌కు చెందిన ఓ యువతి ఇంటర్మీడియెట్ పాసైంది. తల్లిదండ్రులు ఆమెను ఉన్నత చదువులు చదివించలేదు. 19 ఏళ్లకు పెళ్లి చేసి పంపించారు. ఆమె భర్త చదువుకున్నవాడు కావడంతో ఆమెకూ డిగ్రీ చదవాలనే ఆసక్తి కలిగింది. ఇలా కుటుంబ పరిస్థితులు అనుకూలించక కొందరు.. ఆర్థిక ఇబ్బందులతోనూ మరికొందరు చదువులు మధ్యలోనే మానేస్తున్నారు. ఇలాంటి వారి కోసం అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అండగా ఉంటోంది. వారి ఆశయాన్ని నెరవేర్చుకోవడానికి వేదికగా నిలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఏయే కళాశాలలో సార్వత్రిక విద్య అందుబాటులో ఉంది. ఎంతమంది చదువుతున్నారు. తదితర వివరాలతో

**సెలవు దినాల్లో తరగతులు**

1995లో కరీంనగర్ ఎస్సారార్ కళాశాల ఆవరణలో అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దాని పరిధిలో ఉమ్మడి జిల్లాలో అనుబంధ కళాశాలలను చేర్చారు. అప్పటినుంచి ఇప్పటి వరకు ఎంతోమంది అందులో ఉన్నత చదువులు



చదివి ప్రభుత్వ కొలువులు సాధించారు.

అభ్యాసకులు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించటంతోపాటు ప్రతి ఆదివారం, రెండో శనివారాలతోపాటు సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తారు.

ఏడాదికి రెండుసార్లు డిగ్రీలో ప్రవేశాలు ఉంటాయని ఇటీవల యూజీసీ ప్రతిపాదించింది. దీనికి అనుమతి లభిస్తే మరో విడత జనవరిలో నోటిఫికేషన్ వెలువడే అవకాశముంది.

**అర్హులెవరంటే..**

పదోతరగతి తర్వాత ఇంటర్మీడియట్, ఐటీఐ, రెండేళ్ల డిప్లొమా కోర్సు చదివి పాసైన వారు డిగ్రీ ఓపెన్ డిగ్రీ చేయొచ్చు.

డిగ్రీ పాసైన వారు ఓపెన్ పీజీ చదవచ్చు.

ఆసక్తిగల అభ్యర్థులు దగ్గరలోని అధ్యయన కేంద్రాన్ని సందర్శించి వివరాలు తెలుసుకోవాలని అధికారులు సూచించారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చదువు మధ్యలో ఆపేసినవారికి సార్వత్రిక విద్యాలయం చక్కని అవకాశం కల్పిస్తోంది. ఇందులోని డిగ్రీ, పీజీ.. రెగ్యులర్ విద్యతో సమానం. అన్ని రకాల పోటీ పరీక్షలు రాసుకోవచ్చు. ఈ అవకాశాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి. వి.శ్రీనివాస్, కరీంనగర్ ప్రాంతీయ కేంద్రం కోర్డినేటర్

**రెండు కొలువులు సాధించా..**

నేను పదో తరగతి వరకు చదివి మానేసా. నా భర్త వ్యవసాయం చేస్తారు. జగిత్యాల ప్రభుత్వ ఎస్‌కెఎన్‌ఆర్ కళాశాల కేంద్రంలో ఓపెన్ డిగ్రీ పూర్తి చేశా. అనంతరం కరీంనగర్ ఎస్సారార్ కళాశాలలోని కేంద్రంలో పీజీ చేశా. గతేడాది తెలంగాణ గురుకుల మైనారిటీ పాఠశాల నిర్మల్‌లో ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించా. ఇటీవల డీఎస్సీలో హిందీ భాషా పండితురాలిగా ఎంపికయ్యా. ప్రస్తుతం మా కుమారుడు బీటెక్ చదువుతుండగా.. కూతురు ఫార్మసీ చేస్తోంది. రమ, రామాజీపేట, రాయికల్ మండలం

**పెళ్లి తర్వాత చదివి.. ఉపాధ్యాయురాలిగా..**

పదో తరగతితో చదువు మానేశా. వివాహమైన తరువాత జగిత్యాల ఎస్‌కెఎన్‌ఆర్ ప్రభుత్వ కళాశాలలోని ఓపెన్ వర్సిటీలో ఇంటర్, డిగ్రీ చదివా. కరీంనగర్ ఎస్సారార్ ఆవరణలోని సార్వత్రిక కేంద్రంలో పీజీ పూర్తి చేశా. పోటీ పరీక్షలకు సన్నద్ధమై మహాత్మాగాంధీ జ్యోతిబాఫులే ఖానాపూర్‌లో పీజీటీ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యా. ఇటీవల డీఎస్సీలో భీమారం మండలం, ఒడ్యాడ్ మండల పరిషత్తు ఉన్నత పాఠశాలలో హిందీ భాషా పండితురాలిగా ఉద్యోగం వచ్చింది. ఇదంతా సార్వత్రిక విద్యతోనే సాధ్యమయింది. ధనలక్ష్మి, రాయికల్, జగిత్యాల

జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు : జగిత్యాల ఎస్‌కెఎన్‌ఆర్ 467

రాజన్న సిరిసిల్ల జిల్లా అగ్రహారం 500

గంభీరావుపేట 828

# పాలనలో లోపాలు.. తరచూ వివాదాలు

సిరిసిల్ల : దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడలోని రాజన్న ఆలయం నిత్యం భక్తుల దర్శనాలతో రద్దీగా ఉంటుంది. అయితే వరుసగా వివాదాలు చుట్టుముడుతుండటం భక్తులను ఆవేదనలో ముంచెత్తుతోంది. కోడెల పంపిణీ పక్కదారి పట్టిన సంఘటన నుంచి తేరుకోకముందే గత నెల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనలో అతిథి మర్యాదలపైన మరో దుమారం రేగుతోంది. రాజన్న కోడెలు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్తున్నాయనే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్ర గోశాల ఫెడరేషన్ సిఫారసులతో పంపిణీని రద్దు చేసింది. రైతులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు జిల్లా యంత్రాంగం పకడ్బందీ ప్రణాళికను అమలు చేసింది. అయినప్పటికీ వరంగల్‌కు చెందిన గోశాల నిర్వాహకుడు రాంబాబు రైతుల పేరుతో కోడెలను తీసుకెళ్లి పక్కదారి పట్టించాడు. దీనిపై వచ్చిన ఫిర్యాదుల మేరకు విచారణ చేపట్టి బాధ్యులపై వరంగల్ జిల్లా గీసుకొండ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇది జరిగి పది రోజులు గడవక ముందే ముఖ్యమంత్రి పర్యటనకు రాజన్న ఆలయ నిధులు ఖర్చు చేశారనే ఆరోపణలు గుప్పుమన్నాయి. కొన్ని నెలల క్రితం ఆలయంలో ప్రసాదాల తయారీ, దర్శన టికెట్ల విక్రయాలు, పరిపాలన, ఇంజినీరింగ్ విభాగాల్లో అక్రమాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులతో విజిలెన్స్ అధికారుల బృందం రెండ్రోజుల పాటు విచారణ నిర్వహించింది. వీటికి సంబంధించిన ముఖ్యమైన దస్త్రాలను అధికారులు రాష్ట్ర దేవాదాయశాఖ కార్యాలయానికి తరలించారు. వాటి వివరాలేవీ బహిర్గతం చేయలేదు. భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న రాజన్న ఆలయంలో పరిపాలన వ్యవహారాలు సక్రమంగా లేకపోవడమే వీటన్నింటికి మూలమని తెలుస్తోంది. తరచూ ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో దేవాదాయశాఖ, ప్రభుత్వం పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

# బోధన వైవిధ్యంగా.. ఫలితం పరిమితంగా



హైదరాబాద్ : విశ్వవిద్యాలయాల్లో చదువుకుంటున్న పీజీ, పీహెచ్‌డీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు వృత్తి నిపుణులు.. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉన్నతహోదాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు... ప్రైవేటు సంస్థల సీఈవోలతో తరగతులు చెప్పించాలన్న నిర్ణయం కొంతమేరకే ఫలితాలిస్తోంది. ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ పేరుతో వివిధ రంగాల్లో నిపుణులైన వారితో బోధన, ప్రయోగాత్మక శిక్షణను విద్యార్థులకు అందించవచ్చని యూజీసీ గతేడాది అనుమతివ్వడంతో ఉస్మానియా, జేఎన్‌టీయూ, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాల్లో వృత్తి నిపుణులను నియమించుకునేందుకు ఆయా వర్సిటీల అధికారులు ఎంపిక ప్రక్రియను చేపట్టారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆరుగురు నిపుణులను నియమించుకోగా.. జేఎన్‌టీయూ, పొట్టిశ్రీరాములు వర్సిటీల్లో ఈ ప్రక్రియ పూర్తి కాలేదు. విద్యార్థులకు పాఠాలు చెప్పేందుకు వచ్చే వృత్తినిపుణులకు గౌరవ వేతనం ఇచ్చేందుకు వర్సిటీల బడ్జెట్లలో కేటాయింపులు లేకపోవడంతో అధికారులు ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

**పాఠాలు చెబుతోంది కొందరే...**

ఉస్మానియా, జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులకు ప్రయోగాత్మకంగా పాఠాలను బోధించేందుకు ఉస్మానియాలో ఆరుగురు వృత్తి నిపుణులను ఎంపిక చేయగా... ఒకరు ఇష్టం లేదని తెలిపారు. మరొకరు నాలుగైదు తరగతులు మాత్రమే చెప్పారు. జేఎన్‌టీయూలో దరఖాస్తు చేసుకున్నవారి పేర్లు పరిశీలించి అక్కడితో ప్రక్రియను నిలిపేశారు. ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ హోదాలో వర్సిటీలకు వస్తున్న వృత్తి నిపుణులకు గౌరవ వేతనం రూ.లక్షల్లో ఇవ్వాల్సి రావడం, వారికి నెల జీతం ఇవ్వాలా? క్రెడిట్స్ ప్రకారం చెల్లించాలా? అన్న అంశాలపై స్పష్టత లభించలేదు. రూ.లక్షల్లో గౌరవ వేతనం ఇచ్చేందుకు ప్రత్యేకంగా ఎలాంటి నిధులు లేవు. **ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ నియామకాలంటే..**

విశ్వవిద్యాలయాల్లో పీజీ, పీహెచ్‌డీ, ఇంజినీరింగ్ చదువులు పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా విద్యావిధానం ఉండాలని, చదువు పూర్తయిన వెంటనే వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ విధానాన్ని తెరపైకి తెచ్చింది. వర్సిటీల్లో విద్యార్థులకు చదువు చెప్పాలంటే పీహెచ్‌డీ పూర్తి చేసుండాలన్న నిబంధనను యూజీసీ సడలించింది. బహుళజాతి సంస్థలు, పరిశ్రమల్లో విధులు నిర్వహిస్తున్న నిపుణులు, పారిశ్రామికవేత్తలు, సాఫ్ట్‌వేర్ కంపెనీల సీఈవోలు, పరిశోధన సంస్థల అధిపతులతో పాఠాలు చెప్పించుకోవచ్చని యూజీసీ తెలిపింది. దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో అనుభవజ్ఞులను నియమించుకోవచ్చని వివరించింది. గతేడాది జనవరి నుంచి జూన్ వరకూ తెలంగాణ రాష్ట్రంలో వృత్తి నిపుణుల ఎంపిక చేపట్టారు.

# వివాదాల నిలయం.. కేంద్ర కారాగారం



సంగారెడ్డి : సంగారెడ్డి జిల్లా కందిలోని కేంద్ర కారాగారం తరచూ వివాదాలకు మారుపేరుగా నిలుస్తోంది. జైలు అధికారులపైనా విమర్శలొస్తున్నాయి. కొందరు జైలు అధికారులు సస్పెన్షన్‌కూ గురయ్యారు. అధికారులపై దాడి కేసులో సంగారెడ్డి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న వికారాబాద్ జిల్లా లగచర్ల రైతు హీర్యానాయక్‌కు ఈ నెల 12న ఛాతిలో నొప్పిరాగా చికిత్స కోసం జైలు అధికారులు సంకెళ్లు వేసి ఆసుపత్రికి తీసుకెళ్లడం వివాదానికి దారి తీసింది. ఈ ఘటనకు సంబంధించి ఉన్నతాధికారులు జైలర్ సంజీవరెడ్డిపై సస్పెన్షన్ వేటు వేశారు. జైలు పర్యవేక్షకులు సంతోష్ కుమార్ రాయ్ 15 రోజులు సెలవుపై వెళ్లారు. ఆయనపై విచారణ కొనసాగుతోంది. రైతుకు ఎస్కార్ట్ సిబ్బందిగా వెళ్లిన వారిపైనా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇద్దరు ఇన్‌ఛార్జులతో జైలు నిర్వహణ కొనసాగుతోంది.

**సామర్థ్యానికి మించి ఖైదీలు**

సంగారెడ్డి జిల్లాలోని కేంద్ర కారాగారానికి ఉమ్మడి మెదక్‌తో పాటు సమీపంలోని సైబరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్ తదితర జిల్లాల్లోని 80 పోలీసు స్టేషన్లకు సంబంధించిన నేరస్థులను తీసుకొస్తుంటారు. చర్లపల్లి, చంచల్‌గూడ జైళ్లు ఖైదీలతో కిటకిటలాడుతున్నాయనే కారణంతో ఖైదీలు, రిమాండ్ ఖైదీలను సంగారెడ్డికి తీసుకొస్తున్నారు. సంగారెడ్డి కేంద్ర కారాగారంలో 387 ఖైదీల సామర్థ్యంతో గతంలో భవనాలు నిర్మించారు. ప్రస్తుతం 500 మందికి పైగా ఖైదీలున్నట్లు జైళ్లశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో 'ఖరీదైన' ఖైదీలు వస్తే వారి వద్ద ముడుపులు తీసుకొని రాచమర్యాదలు చేస్తునట్లుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం లగచర్ల ఘటనకు సంబంధించిన 21 మంది రిమాండ్ ఖైదీలు ఇక్కడే ఉన్నారు. నిందితుల కుటుంబీకులు, పలు పార్టీల నేతలు ములాఖత్‌కు వస్తుండటతో పర్యవేక్షణ, భద్రత గుదిబండగా మారిందని జైలు అధికారులు, సిబ్బంది వాపోతున్నారు.

**గతంలో ఆరోపణలు ఇలా..**

రెండేళ్ల క్రితం ఓ కంపెనీకి చెందిన పారిశ్రామికవేత్త హత్య కేసులో ఇద్దరు జైలు అధికారులు నిందితుడికి రాచమర్యాదలు చేసినట్లుగా ఆరోపణలు వచ్చాయి. వీడియోకాల్‌కు అవకాశమివ్వడం, బిర్యానీ ప్యాకెట్లు అందించినట్లుగా విమర్శలున్నాయి. కూకట్‌పల్లికి చెందిన ఓ స్థిరాస్తి వ్యాపారి జైలులో ఉండగా.. ఆయనకు మర్యాదలు చేయడానికి జైలు అధికారులకు కొంత నజరానా తీసుకున్నట్లుగా ఆరోపణలొచ్చాయి. ఈ రెండు ఘటనలపై అప్పట్లో జైళ్ల శాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలడంతో అప్పట్లో జైళ్ల శాఖ డీఐజీ మురళీబాబు ఇద్దరు కారాగార అధికారులపై సస్పెన్షన్ వేటు వేశారు.

**పని ఒత్తిడితో నెట్టుకొస్తున్నాం–**

మహిపాల్‌రెడ్డి, ఉప జైలర్, సంగారెడ్డి కేంద్ర కారాగారం

సంగారెడ్డి కేంద్ర కారాగారం పర్యవేక్షకులు సంతోష్ కుమార్ రాయ్ 15 రోజులు సెలవుపై వెళ్లారు. ఆ స్థానంలో ఇన్‌ఛార్జి పర్యవేక్షకులుగా భరత్‌రెడ్డి కొనసాగుతున్నారు. జైలర్ సంజీవరెడ్డి సస్పెన్షన్‌కు గురవడంతో.. ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నా. పని ఒత్తిడితో నెట్టుకొస్తున్నాం.

# చక్రం తిప్పుతున్న దళారులు!

సిరిసిల్ల : లైట్ మోటార్ డ్రైవింగ్ లైసెన్సును హెవీగా మార్చుకునేందుకు వీర్నపల్లికి చెందిన ఓ యువకుడు సిరిసిల్లకు వచ్చాడు. ఇందుకు రూ. 18 వేలు ఖర్చవుతుందని కార్యాలయానికి దగ్గర్లోని ఓ జిరాక్సు సెంటర్ నిర్వాహకుడు తెలిపాడు. బేరం ఆడితే రూ. 16 వేలకు పని చేసిపెడతానని ఒప్పుకున్నాడు. ఇలా ఏ పని అయినా ఏజెంటు ప్రమేయం లేకుండా కాని పరిస్థితి ఏర్పడింది.

సిరిసిల్లకు చెందిన ఓ యువకుడు డ్రైవింగ్ లైసెన్స్ కోసం దళారిని ఆశ్రయించాడు. ట్రాన్స్‌పోర్టు వాహనం నడిపే లైసెన్సు కోసం రూ. 4 వేలకు బేరం కుదుర్చుకున్నాడు. పూర్తిగా డబ్బులు చెల్లించకపోవడంతో ఒరిజినల్ కార్డును కార్యాలయం నుంచి దళారి తీసుకుని, తన వద్ద ఉంచుకున్నాడు. ఏడాదిన్నర తర్వాత కార్డు కోసం వాకబు చేయగా అదనంగా రూ. 1,000 ఖర్చవుతుందని చెప్పడంతో కంగుతిన్నాడు.

గంభీరావుపేటకు చెందిన వ్యక్తి సెకండ్ హ్యాండ్ కారు కొనుగోలు చేశాడు. ఆయన పేరుపై మార్చడం కోసం ఓ ఏజెంటుతో రూ. 2,500 లకు ఒప్పందం చేసుకున్నాడు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసే ముందు డబ్బులను దళారికి ఇచ్చాడు. అయినా ఒరిజినల్ కార్డు అతనికి రాలేదు. మళ్లీ కారు అమ్మే క్రమంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయాడు. రవాణాశాఖలో పారదర్శక సేవలకు ఆన్‌లైన్ వ్యవస్థను తీసుకొచ్చినా దళారుల ప్రమేయం మాత్రం తగ్గలేదు. మధ్యవర్తులు కార్యాలయంలో చక్రం తిప్పుతున్నారన్న విమర్శలున్నాయి. ప్రతి పనికీ ఓ ధర నిర్ణయించి పెత్తనం చెలాయిస్తున్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన ధర కంటే అదనంగా వసూలు చేస్తూ వాహనదారుల జేబులకు చిల్లు పెడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సిరిసిల్ల పట్టణంలో విద్యానగర్‌లోని ఓ ప్రైవేటు భవనంలో రవాణాశాఖ కార్యాలయం కొనసాగుతుంది. ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ లైసెన్స్, వాహన సామర్థ్య ధ్రువపత్రం, వివిధ సేవల కోసం వాహనదారులు ఆర్టీఏ కార్యాలయానికి నిత్యం వందల సంఖ్యలో వస్తుంటారు. అయితే కింది స్థాయి సిబ్బంది, అధికారులతో ఏజెంట్లు చేతులు కలిపి దందా నడిపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో నేరుగా కార్యాలయానికి వచ్చిన వాహనదారులను పత్రాలు లేవంటూ తిప్పి పంపుతున్న సందర్భాలున్నాయి. నాలుగైదుసార్లు కార్యాలయం చుట్టూ తిరిగి చివరకు దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కార్యాలయానికి సమీపంలో కొందరు బేరసారాలు చేస్తూ ఒక్కో పనికి ప్రభుత్వానికి చెల్లించే ధర



కంటే రెట్టింపు వసూలు చేస్తున్నారు. అదనంగా వసూలు చేసిన మొత్తంలో వాటాలు పంచుతున్నారన్న ఆరోపణలున్నాయి. గతంలో పత్రాలపై కోడ్ వేసి కార్యాలయానికి పంపేవారు. ప్రస్తుతం ఓ చీటీపై వివరాలు రాసి పంపిస్తున్నారు.

**కిందిస్థాయి సిబ్బంది అత్యుత్సాహం**

వివిధ సేవల కోసం వచ్చే వాహనదారులు, చోదకులతో కింది స్థాయి సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారు. కార్యాలయం ఆవలకు పోవాలంటూ ఆదేశాలిస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే పని ఎలా జరుగుతుందో చూస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. పని కోసం వచ్చే వారికి సలహాలిచ్చేవారు లేరు. ఏజెంట్లు నేరుగా కార్యాలయంలోకి వెళ్లినా అక్కడున్న సిబ్బంది పట్టించుకోవడం లేదు.

**చాలా సార్లు తిప్పి పంపారు**

రిజిస్ట్రేషన్ కోసం వెళితే పత్రాలు సరిగ్గా లేవని, శిరస్త్రాణం రంగు వేరేలా ఉందని కారణాలు చెప్పి పంపుతున్నారు. ఇలా ఒక్కో వ్యక్తిని చాలా సార్లు తిప్పి పంపుతున్నారు. అదే దళారుల ద్వారా వెళితే నిమిషాల్లో పని చేస్తున్నారు. ఆర్టీఏ కార్యాలయంలో అధికారులకు, ఏజెంట్లకు మధ్య సంబంధాలున్నాయి. మల్లేశ్, చిరు వ్యాపారి, గర్జనపల్లి

**నేరుగా కార్యాలయానికి రావాలి**

రవాణా శాఖ సేవలు పారదర్శకంగా అందించేందుకు కృషి చేస్తున్నాం. వాహనదారులు నేరుగా కార్యాలయానికి రావాలి. దళారులను ఆశ్రయించి మోసపోవద్దు. ఏజెంటు వ్యవస్థను ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించేది లేదు. లక్ష్మణ్, జిల్లా రవాణాశాఖ అధికారి

# గృహలక్ష్మి అర్హులెందరో?

పెద్దపల్లి : ఏళ్లు గడుస్తున్నా పేద, మధ్యతరగతి ప్రజలకు సొంతిల్లు కలగానే మిగులుతోంది. గత ప్రభుత్వాలు వారి కలను సాకారం చేయడానికి ప్రయత్నించినా క్షేత్రస్థాయిలో ఫలించలేదు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు నిర్మించుకునే వారికి ఆర్థికసాయాన్ని అందించాలని నిర్ణయించింది. ఈ ఏడాది ప్రారంభంలోనే గృహలక్ష్మి పేరుతో దరఖాస్తులు స్వీకరించింది. దరఖాస్తుల్లో అర్హులను గుర్తించడానికి ఈ నెలలోపు సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో అధికారులు క్షేత్రస్థాయిలో ఆ పనిలో పడ్డారు. ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సేకరించి ప్రభుత్వం రూపొందించిన 'ఇందిరమ్మ ఇండ్లు' యాప్‌లో నమోదు చేస్తున్నారు. సర్వర్ మొరాయింపుతో కొంత జాప్యం నెలకొంది. గ్రూప్–2 పరీక్ష, వరుస సెలవులు ప్రభావం చూపాయి.



**సమగ్ర వివరాల సేకరణ**

జిల్లాలో ప్రజాపాలనలో భాగంగా 1,80,664 గృహలక్ష్మి దరఖాస్తులు వచ్చాయి. సర్వే బాధ్యతలను పంచాయతీ కార్యదర్శులకు అప్పజెప్పారు. వారు దరఖాస్తుల ఆధారంగా యజమాని ఇంటికి వెళ్లి సొంతిల్లా? అద్దెదా? పేరు, ఆధార్, చరవాణి, కుటుంబసభ్యుల వివరాలు ఆరా తీస్తున్నారు. ఇల్లు, ఇంటి పైకప్పు, లోపల ఇలా మూడు రకాల ఫొటోలు తీసుకుంటున్నారు. పెంకుటిల్లు, రేకులషెడ్డు, పూరిగుడిసె, దాబా అనే విషయాన్ని పరిశీలిస్తున్నారు. ఇళ్లు నిర్మించుకోవడానికి ఖాళీ స్థలం ఎంత విస్తీర్ణంలో ఉందో స్పష్టంగా చూస్తున్నారు. ఈ సమగ్ర వివరాలన్ని యాప్‌లో పొందుపరుస్తున్నారు.

**క్షేత్రస్థాయిలో ఇబ్బందులు**

క్షేత్రస్థాయిలో సర్వే అధికారులకు పలు రకాల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒకే ఇంటి చిరునామాతో మూడు దరఖాస్తులు వచ్చాయి. తండ్రి, ఇద్దరు కుమారులు గృహలక్ష్మికి దరఖాస్తు పెట్టుకున్నారు. ప్రస్తుతం ఉన్న ఇంటిని తండ్రి పేరిట నమోదు చేసి ఖాళీ స్థలం ఉంటే కుమారుల పేర్లను యాప్‌లో నమోదు చేశారు. ఆర్‌సీసీ భవనం ఉన్న వారు కూడా ఇల్లు లేదని రాయమని అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ప్రతి ఇంటికి అన్ని పత్రాలు ఉంటే ఒక్కో ఇంటికి కనీసం 20 నిమిషాల సమయం పడుతుంది.

# మునుగోడుకు డిగ్రీ ఎప్పుడొస్తుందో..!

చౌటుప్పల్: మునుగోడు నియోజకవర్గంలోని ఏడు మండలాల పరిధిలో ఒకే ఒక్క ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నెలకొల్పారు. చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, నాంపల్లిలో మాత్రమే ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. సాంకేతిక విద్యనందించే పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలు అసలే లేవు. చదువే అన్నింటికీ మూలమని, నాణ్యమైన విద్యను ఉన్నతస్థాయి వరకు అందించే ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటు చేయించాలని చాలాకాలంగా ఈ ప్రాంతం ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు. ప్రజల ఆకాంక్షను, అవసరాన్ని గుర్తించిన రాజకీయ పక్షాలు ఎన్నికల మేనిఫెస్టోల్లో వీటిని చేరుస్తున్నారు. విజేతలయ్యాక విస్మరిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం డిగ్రీ కళాశాలను మంజూరు చేయగానే తాత్కాలికంగా నిర్వహించేందుకు దివిస్ తన సీఎస్సార్ నిధులతో స్థానిక ప్రభుత జూనియర్ కళాశాల భవనం మొదటి అంతస్తును రూ.కోటికి పైగా వ్యయంతో నిర్మించింది. తరగతి గదులు, ప్రయోగశాలల భవనాలను నిర్మించి సిద్ధంగా ఉంచింది.

**నెరవేరని హామీ..**

చౌటుప్పల్‌కు చుట్టుపక్కల భువనగిరి, నల్గొండ, రామన్నపేటల్లో మాత్రమే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలున్నాయి. తగిన రవాణా సౌకర్యాలు లేకపోవడంతో అంత దూరం వెళ్లలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. చౌటుప్పల్ చుట్టుపక్కల 7 ప్రభుత్వ, 13 అన్ ఎయిడెడ్



ప్రైవేటు జూనియర్ కళాశాలలున్నాయి. వీటిలో ఇంటర్మీడియట్ వరకు చదివిన విద్యార్థులు వందల మంది ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం ఎదురు చూస్తున్నారు. గతంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు, ర్యాలీలు నిర్వహించారు. 2016లో అప్పటి సీఎం కేసీఆర్ చౌటుప్పల్ పర్యటనకు వచ్చిన సందర్భంగా ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు కాన్వాయ్‌కి అడ్డుపడి సమస్యను ఆయన దృష్టికి తెచ్చే ప్రయత్నం చేశారు. వారిపై నమోదైన కేసులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. 2014, 2016, 2017లో ఇక్కడి ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన ప్రతిపాదనల ఆధారంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు కోసం అవకాశాలను వివరిస్తూ అప్పటి ఉన్నత విద్యాశాఖ కమిషనర్ వాణిప్రసాద్, ప్రత్యేక ప్రిన్సిపల్ కార్యదర్శికి సవివర నివేదికను సమర్పించారు. మునుగోడు ఉపఎన్నిక సమయంలో చండూరులో నిర్వహించిన బహిరంగ సభలో అప్పటి సీఎం కేసీఆర్ చౌటుప్పల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయిస్తానని ప్రకటించారు. ఇప్పటికీ ఆ హామీ అమలు కాలేదు. కళాశాల మంజూరుకు కృషి చేస్తా..– కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే


మునుగోడు నియోజకవర్గం విద్యాపరంగా అభివృద్ధి చెందాల్సిన అవసరముంది. ఇప్పటికే రూ. 250 కోట్లతో ఇంటిగ్రేటెడ్ గురుకుల విద్యాలయాన్ని మంజూరు చేయించి శంకుస్థాపన కూడా చేశాను. ప్రభుత్వ డిగ్రీ కళాశాల చౌటుప్పల్ ప్రాంతంలో ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన చాలా కాలం క్రితం నుంచి ఉంది. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మంజూరు కోసం కృషి చేస్తా.

# ఉల్లంఘనులు

నంద్యాల : జిల్లాలో గనులను లీజుకు తీసుకున్న కొందరు వాటిలో మైనింగ్ చేయడం లేదు. ఫలితంగా అటు ప్రభుత్వం ఆదాయం కోల్పోవడమేకాక ఇతర ఔత్సాహికులు ఈ రంగంలో రాలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. జిల్లా పరిధిలో 13 వేల ఎకరాల్లో గనులు విస్తరించి ఉన్నాయి. నంద్యాల గనుల శాఖ కార్యాలయ పరిధిలో 19 సున్నపురాయి గనులు, 66 నాపరాయి గనులు, ఆరు మెటల్ క్వారీ లీజులు ఉన్నాయి. బనగానపల్లి కార్యాలయం పరిధిలో 82 పెద్ద గనులు, 199 చిన్న తరహా గనులు ఉన్నాయి. నాపరాయి, కంకర గనుల లీజులు పదేళ్లకు ఒకసారి.. మిగతా పెద్ద తరహా గనులను 20 ఏళ్లకు ఒకసారి లీజుకు ఇస్తారు. నంద్యాల పరిధిలో 25, బనగానపల్లి కార్యాలయ పరిధిలో నాలుగు మండలాలు ఉన్నాయి. జిల్లాలో సున్నపురాయి, బైరటీస్, ఇనుప ఖనిజం, పైట్ పేల్, క్వార్ట్జ్, సిలికాశాండ్, గ్రానైట్ తదితర ఖనిజాలు ఉన్నాయి. వీటి లీజులు చాలాకాలంగా కొందరి చేతుల్లోనే ఉన్నాయి.

**అక్రమ రవాణా చేసి..**

జిల్లాలో గనుల లీజు అనుమతులకు సంబంధించి గత వైకాపా ప్రభుత్వ



హయాంలో కొందరు అడ్డగోలుగా వ్యవహరించారు. పర్యావరణ అనుమతులు రాకున్నా క్వారీల నుంచి పెద్దఎత్తున రవాణా చేశారు. ఒకవైపు మైనింగ్ జరగలేదని చెబుతున్నా పెద్దఎత్తున అక్రమంగా మైనింగ్ చేసి రాయల్టీ, జీఎస్టీ ఎగ్గొట్టారు. ఒకచోట అనుమతి తీసుకుని మరోచోటు నుంచి రవాణా చేశారు. అప్పట్లో అధికార పార్టీ అండతో ఇష్టారాజ్యంగా కంకర, నాపరాయి, డోలమైట్ తదితరాల రవాణా జరిగింది. ప్రత్యేకించి డోన్, ప్యాపిలి నుంచి క్వార్ట్జ్ అక్రమంగా రవాణా చేశారు. గ్రానైట్ అక్రమ రవాణాకూ అడ్డూఅదుపు లేకుండా పోయింది. గడివేముల మండలం ఎల్కే తండా, గని, శకునాల తదితర ప్రాంతాల్లో క్వారీలకు అనుమతులు లేకున్నా మైనింగ్ చేశారు. బేతంచెర్ల మండలంలో.. రంగాపురం, యంబాయి గ్రామాల్లో ఐరన్ఓర్‌కు అనుమతులున్నా కొన్నిచోట్ల తవ్వకాలు జరగలేదు. పేరుకు లీజుకు తీసుకున్న చోట్ల మైనింగ్ చేయకుండా ఆ పేరుతో మరోచోట తవ్వకాలు జరిపి సొమ్ము చేసుకున్నారు.

**పర్యావరణ అనుమతుల పేరిట..**

గనులు లీజులు తీసుకున్న తర్వాత పర్యావరణ అనుమతులు (ఈసీ) తీసుకోవడం తప్పనిసరి. ఈ అనుమతులుంటేనే మైనింగ్ చేయడం, రవాణా చేయాలి. గత వైకాపా ప్రభుత్వం.. గనుల నుంచి పెద్ద ఎత్తున ఆదాయం రాబట్టుకునేందుకు రాయల్టీని ఒకేసారి 10 రెట్లు పెంచింది. ఫలితంగా చాలామంది మైనింగ్ చేయడం మానుకున్నారు. ఇదేమని మైనింగ్ అధికారులు ప్రశ్నిస్తే పర్యావరణ అనుమతులు రాలేదని చెప్పి మైనింగ్ చేయడం లేదు. జిల్లాలో 160కు పైగా గనుల్లో మైనింగ్ జరగడం లేదు. బనగానపల్లి కార్యాలయం పరిధిలో 281 గనులు ఉండగా ఇందులో 160 గనుల్లో మాత్రమే మైనింగ్ జరుగుతోంది. నంద్యాల కార్యాలయం పరిధిలో 82 మైనింగ్ లీజుల్లో 39 వరకు పనిచేయడం లేదు.

జిల్లాలో గనుల విస్తీర్ణం : 13 వేల ఎకరాలు
ఆదాయ లక్ష్యం : రూ.177.55 కోట్లు
జిల్లాలో వివిధ రకాల లీజులు : 372
ప్రస్తుతం మైనింగ్ జరిగే విస్తీర్ణం : 6 వేల ఎకరాలు
జిల్లా పరిధిలో లభించే ఖనిజాల సంఖ్య : 16

# 53 మండలాలు.. 53 గ్రామాలు

కర్నూలు : ఉమ్మడి కర్నూలు జిల్లాలో మండలంలో ఒక గ్రామం చొప్పున రెండో విడత రీసర్వే చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మొత్తం 53 మండలాల్లో.. 53 గ్రామాల్లో రీసర్వే చేయనున్నారు. ఎలాంటి తప్పులకు తావులేకుండా పకడ్బందీగా సర్వే చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. తక్కువ విస్తీర్ణం ఉండే గ్రామాల్లో రెండేసి బృందాలు, ఎక్కువ విస్తీర్ణం ఉన్న గ్రామాల్లో నాలుగేసి బృందాలు సర్వే చేస్తాయి. ఒక్కో బృందంలో ఒక వీఆర్వో, ఇద్దరు గ్రామ సర్వేయర్లు, ఒక రెవెన్యూ సహాయకులు ఉంటారు. ఒక్కో బృందం రోజుకు 20 ఎకరాల్లో సర్వే చేసి.. అదే రోజు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది.

**రైతుల సమక్షంలోనే..**గత ప్రభుత్వ హయాంలో రీసర్వే ప్రక్రియ గందరగోళంగా మారింది. బృందానికి ప్రతిరోజూ లక్ష్యం విధించడం.. తీవ్రమైన ఒత్తిడి తీసుకురావడంతో వారు ఇష్టానుసారంగా సర్వే చేశారు. రైతులు లేకపోయినా కొలతలు వేశారు. ఫలితంగా చాలామంది భూ విస్తీర్ణాల్లో తేడాలు వచ్చాయి. సమస్యను అధికారులకు, పాలకులకు



విన్నవించినా ప్రయోజనం లేకపోయింది. ఈ నేపథ్యంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రైతుల సమక్షంలోనే సర్వే చేసేలా ఆదేశాలు జారీ అయ్యాయి. ఫలితంగా ఎలాంటి తప్పులకు తావులేకుండా పారదర్శకంగా రీసర్వే పూర్తి చేయొచ్చు. **ఆయా డివిజన్ల పరిధిలో..**

కర్నూలు జిల్లాలో ఆదోని డివిజన్ పరిధిలో తొమ్మిది మండలాల్లో ఎంపిక చేసిన 9 గ్రామాల్లో, కర్నూలు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఏడు గ్రామాలు, పత్తికొండ డివిజన్ పరిధిలో 9 గ్రామాల్లో కలిపి మొత్తం 25 గ్రామాల్లో 1,29,015.07 ఎకరాల్లో సోమవారం నుంచి రెండో విడత రీసర్వే ప్రారంభించనున్నారు. ఉమ్మడి జిల్లాలో ఆరు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 53 మండలాల పరిధిలో ఎంపిక చేసిన 53 గ్రామాల్లో 2,21,791.97 ఎకరాల్లో సర్వే చేయనున్నారు.

# కబ్జాదారులపై కొరడా ఝుళిపించేదెప్పుడో?



కొత్తూరు : అనకాపల్లిలోని శారదానదిని ఆనుకొని జిల్లా పరిషత్తుకు చెందిన రూ. కోట్ల రూపాయలు విలువ చేసే 11 ఎకరాల స్థలం కబ్జాపై ఇంకా యంత్రాంగం నిర్లక్ష్యం వీడటం లేదు. ఇక్కడి ఆక్రమణల విషయంపై అధికారుల నిర్లిప్త ధోరణిపై ప్రజా ప్రతినిధుల్లోనూ ఆగ్రహం పెల్లుబికుతోంది. కొత్తూరు పంచాయతీ పరిధిలో ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ తుమ్మపాల రెవెన్యూ పరిధిలోని సర్వే సంఖ్య 582(2), 583(1), 584, 588(4), 590(18), 593(3), 597(1) లలో సుమారు 11 ఎకరాలను కొనుగోలు చేశారు. ఇందులోని 3.40 ఎకరాల భూమిని ముత్రాసుకాలనీ ప్రాథమికోన్నత పాఠశాలకు కేటాయించారు. ఈ పాఠశాలను భవిష్యత్తులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా చేయాలనే ఉద్దేశం. ప్రస్తుతం ఈ పాఠశాల ఆధీనంలో 40 సెంట్ల భూమి కూడా లేదు. జిల్లా పరిషత్ మినిస్టీరియల్ ఉద్యోగుల నివాసాలకు, సంఘ భవనానికి 1.80 ఎకరాలను కేటాయించినా ఇది కూడా కానరావడం లేదు. ఈ స్థలాలు కబ్జాలకు గురి కావడంతో పాటు ఆ ప్రాంతంలో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం, కొనుగోళ్లు, అమ్మకాలు జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. వీటిని కాపాడటానికి ఈ ప్రాంతానికి చెందిన సహ చట్టం కార్యకర్త చింతా గోపి సుమారు 02.03.2021న అధికారులకు ఫిర్యాదు చేశారు. 2021 మే నెలలో అప్పటి జిల్లా పరిషత్తు ముఖ్యకార్యనిర్వహణాధికారి నాగార్జున సాగర్, అనకాపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి వసంతరాయలు, తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. పక్కాగా సర్వే చేసి, ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించినా ఇంతవరకూ ఎటువంటి దాఖలాలు లేవు. విశాఖలో రెండు రోజుల క్రితం జిల్లా పరిషత్తు సమావేశంలో అనకాపల్లి జడ్పీటీసీ సభ్యుడు పెతకంశెట్టి జోసఫ్ ఇక్కడి ఆక్రమణలపై ఎండగట్టారు. ఈ నేపథ్యంలో కొత్తూరుతోపాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న స్థలాలపై మార్చి నెలాఖరులోగా సర్వే చేసి పూర్తి వివరాలు అందజేయాలని జిల్లా పరిషత్తు ఛైర్‌పర్సన్ జల్లపల్లి సుభద్ర ఆదేశించారు. సీఈఓ పి.నారాయణమూర్తి జడ్పీ స్థలాలను కాపాడతామని, ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని సభకు హామీ ఇచ్చారు.

**త్వరలోనే సర్వే..**

జిల్లా పరిషత్తుకు పెద్ద ఎత్తున ఆస్తులు, భూములు, స్థలాలు, వసతి గృహాలు ఉన్నట్లు శనివారం జరిగిన సమావేశంలో ప్రకటించారు. నాతోపాటు పలువురు సభ్యులు వివరణ కోరగా కొత్తూరులో సుమారు 11 ఎకరాలు భూములు ఉన్నాయని చెప్పారు. ఇక్కడ మొత్తం నిర్మాణాలే తప్ప ఎటువంటి ఖాళీ స్థలాలు లేవు. త్వరలోనే సర్వే ప్రారంభం అవుతుంది. పెతకంశెట్టి శివ సత్యనారాయణ జోసఫ్, జడ్పీటీసీ సభ్యుడు

**ఆరేళ్లుగా కృషి చేస్తున్నా...**

కొత్తూరులో ఆక్రమణలకు గురైన స్థలాలను పరిరక్షించడానికి కృషి చేస్తున్నాను. ప్రజావసరాలకు జిల్లా పరిషత్తు కొనుగోలు చేసిన స్థలాన్నే కబ్జా చేశారు. పాఠశాల స్థలం కూడా కబ్జా చేసిన కారణంగా ఉన్నత పాఠశాల ఏర్పాటు చేసే అవకాశం లేకపోయింది. భూములను ఆక్రమించుకుని భారీ భవనాలను నిర్మించుకున్నారు. దీనిపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలి. చింతా గోపి, సహ చట్టం కార్యకర్త, కొత్తూరు

# ఆ దాడి.. మనకే ఎదురైతే?



నర్సీపట్నం : ముంబయిలో బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై ఈనెల 16న జరిగిన దాడి దేశవ్యాప్తంగా కలకలం సృష్టించడం తెలిసిందే. ఈ హీరో తన ఇంట్లోనే ఓ దుండగుడు చేతిలో కత్తిపోట్లకు గురై ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. ఆ ఇంట్లో ఇద్దరు పిల్లలు, సహాయకురాలైన ఓ మహిళ ఉన్న గదిలోకి ఈ దుండగుడు ప్రవేశించి హల్‌చల్ చేశాడు. ఇందుకు కారణాలు ఏవైనప్పటికీ ఈ ఘటన అందరికీ గుణపాఠంగా మారింది.

ప్రస్తుతం జిల్లాలోని అన్ని పట్టణాల్లో శివారు ప్రాంతాలు విస్తరిస్తున్నాయి. జన సంచారం తక్కువగా ఉండేచోటా నివాసాలు పెరిగాయి. ఇలాంటి ప్రాంతాల్లో దొంగలు, దోపిడీదారుల భయం ఎక్కువగానే ఉంటుంది. యువతులు ఒంటరిగా ఉన్నప్పుడు ఆకతాయిల నుంచి వేధింపులూ ఎదురవుతుంటాయి. ఇలాంటి ఆపదల ఎదురైనప్పుడు భయపడకుండా చిన్నపాటి మెలకువలు తెలిస్తే దుండగులను ఎదుర్కోవచ్చు... శరీర బలంతో సంబంధం లేకుండా వ్యూహాత్మకంగా శత్రువుని మట్టి కరిపించ వచ్చు. ముంబయిలో సైఫ్‌పై దాడి తరహా ఘటనలు ఎదురైతే చురుగ్గా ఎలా వ్యవహరించాలో.. ఆపద నుంచి ఏ విధంగా బయటపడాలో యుద్ధవిద్యల్లో నైపుణ్యం ఉన్నవారు వివరిస్తున్నారు.

**కత్తితో వస్తే..**

కత్తితో వెనుక నుంచి దాడికి పాల్పడితే ఊహించని వేగంతో ఆగంతకుని చేతిని పట్టుకునేందుకు ప్రయత్నించాలి. అదే వేగంతో కాలితో ఎదుటి వ్యక్తి కాలిని వెనుక నుంచి తన్ని పడిపోయేటట్టు చేయాలి. అదేవిధంగా మెడపై కత్తిని ఉంచితే వేగంగా కొంచెం కిందకు వంగి అవకాశముంటే పళ్లతో చేతిపై గట్టిగా కరవాలి. దీంతో కత్తి జారవిడిచే అవకాశం ఉంది.

**ఆకతాయిల పని పట్టొచ్చిలా..**

కరాటే, కుంగ్‌ఫూ, బాక్సింగ్, వుషూ తదితర యుద్ధ విద్యలు ఆకస్మిక దాడులను తక్కువ శక్తితోనే సమర్థంగా ఎదుర్కొనే ధైర్యాన్ని ఇస్తాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రైవేటు కోచ్‌లు కొందరు పిల్లలకు యుద్ధకళలను నేర్పుతున్నారు. ఏడేళ్ల క్రితం ప్రభుత్వ పాఠశాలల్లో నిపుణులతో శిక్షణ ఇప్పించేవారు. ఇలాంటి శిక్షణలు కొన్నేళ్లుగా జరగడం లేదు. ముఖ్యంగా అమ్మాయిలకు యుద్ధవిద్య తెలిసి ఉంటే వేధింపులకు గురిచేసే వ్యక్తిని పక్కన చూపిన విధంగా అడ్డుకునే అవకాశం ఉంది.

**ఆయుధంతో మీదకొస్తే..**

ఆయుధంతో కొట్టేందుకు ప్రయత్నిస్తే ముందుగా ఇలా ఆయుధం ఉన్న చేతిని పట్టుకునేందుకు ప్రయత్నించాలి. అదే ఊపుతో ఆ వ్యక్తి కాలి వెనుక వైపు మన కాలితో తంతే కింద పడిపోతారు.

ఎదురుదాడి చేసే సమయంలో పిడికిలిని బిగించి బలంగా సుత్తితో మేకును కొట్టినట్టుగా దాడి చేయాలి. అవకాశముంటే బొటనవేళ్లతో రెండు కళ్లలోకి పొడవాలి. ముక్కు, మెడపైనా కొట్టేందుకు ప్రయత్నించాలి.

చైతన్యం పెంచాలి...: మార్షల్‌ఆర్ట్స్‌కు పట్టణాల్లో ఆదరణ ఉంది. తల్లిదండ్రులు తమ పిల్లలను శిక్షణ కేంద్రాలకు పంపిస్తున్నారు. గ్రామాల్లో చైతన్యం లేదు. పల్లెల్లో అవగాహన కల్పించి ఉచిత శిక్షణల ద్వారా నైపుణ్యాలు నేర్పించాలి. రాణించినవారిని ప్రోత్సహించాలి. స్వీయరక్షణపై మహిళలు జాగరూకులై ఉండాలి.

పల్లెల వీరబాబు, మార్షల్ ఆర్ట్స్ కోచ్, నర్సీపట్నం.

**మానసికంగా దృఢంగా ఉండాలి**

ప్రతి ఒక్కరూ ఆత్మరక్షణపై దృష్టి పెట్టాలి. అకస్మాత్తుగా ఆగంతకులు దాడికి పాల్పడితే తప్పించుకునే ప్రయత్నంలో ధైర్యంగా ఉండాలి. అందుబాటులో ఉన్న వస్తువునే ఆయుధంగా చేసుకోవాలి. దానివల్ల వెనకడుగు వేసే అవకాశం ఉంటుంది. ఎదురు దాడి చేసేందుకు కళ్లు, గొంతు, ముక్కు భాగాలను ఎంచుకోవాలి. దీంతోపాటు అవకాశం ఉన్నప్పుడు ఎదుట వ్యక్తిని కాలితో కిందకు పడవేసే చిన్న చిట్కాను సాధన చేయాలి. గండి త్రినాథ్, ఉమ్మడి విశాఖ జిల్లా పోలీసు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ మాజీ ఇన్‌స్ట్రక్టర్

# పాడికి భరోసా

కర్నూలు : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పశుసంపద, పాడి రంగంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఉచితంగా గ్రాసం పెంపకానికి ఉపాధి నిధులు సమకూర్చడం, పశువులు, జీవాలకు గోకులం షెడ్లు మంజూరు చేసింది. తాజాగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఈనెలాఖరు వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ శిబిరాల్లో గేదెలు, ఆవులు, ఎద్దులు, దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపించడం, గొర్రెల్లో బొబ్బ వ్యాధి నివారణకు టీకాలు వేయనున్నారు. పశువులకు ఆరోగ్య పరీక్షలు చేయడంతోపాటు మెరుగైన వైద్యం అందించనున్నారు. ప్రతి మండలంలో రెండు బృందాలు పశు ఆరోగ్య శిబిరాల్లో పాల్గొననున్నాయి.

**సేవలు ఇలా..** కర్నూలు జిల్లాలో ఒక బహుళార్థ పశు వైద్యశాల, 11 ప్రాంతీయ పశు వైద్యశాలలు, 66 పశు పర్యవేక్షక కేంద్రాలు, 76 గ్రామీణ పశు వైద్య కేంద్రాలు, 392 రైతు సేవా కేంద్రాల పరిధిలో పశు వైద్య అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో సేవలు అందించనున్నారు. నంద్యాల జిల్లాలో 15 పశు వైద్యశాలలు, 74 పశు పర్యవేక్షక కేంద్రాలు, 99 గ్రామీణ పశు వైద్య కేంద్రాలు, 350కిపైగా రైతు సేవా కేంద్రాల ద్వారా అధికారులు,



సిబ్బంది సేవలు అందిస్తున్నారు.

గతంలో ఎన్నడూ లేనివిధంగా పెద్ద పశువులకు ఈసారి నట్టల నివారణ మందులను ప్రభుత్వం సరఫరా చేసింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం పశు సంపద, జీవాల్లో 80 శాతం మేర మందులను సరఫరా చేశారు. 6.58 లక్షల పశువులు, 20.75 లక్షల మేకలు, గొర్రెలకు కలిపి మొత్తం రూ.1.72 కోట్ల విలువ చేసే మందులను ఆయా కేంద్రాలకు చేరవేశారు.

# రక్తహీనత.. వెన్నాడుతున్న రుగ్మత


కర్నూలు : ఉమ్మడి కర్నూలు జిల్లాలో మహిళలు, బాలింతలు, పిల్లల్లో రక్తహీనత సమస్య తీవ్రంగా ఉంది. గర్భం దాల్చిన నెల నుంచి ప్రసవం తర్వాత ఆరు నెలల వరకు మహిళలకు పౌష్టికాహార కిట్లు ఇచ్చి వారి ఆరోగ్యానికి భరోసా ఇస్తున్నారు. అయినప్పటికీ ఉమ్మడి కర్నూలు జిల్లాలో 15,408 మంది గర్భిణులు, బాలింతలు రక్తహీనతతో బాధపడుతున్నారు.

**పరిస్థితి గుర్తించక..**

రక్తహీనత కారణంగా పలు ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. రక్తహీనతను చాలామంది తీవ్రమైన సమస్యగా గుర్తించడం లేదు. వాస్తవానికి వైద్యులను సంప్రదించి ఓపక్క మందులు వాడుతూ మరో పక్క మంచి ఆహారం తీసుకుని రక్తహీనత సమస్య తగ్గించుకోవడంతోపాటు ఎప్పటికప్పుడు పరీక్షలు చేసుకుంటూ ఉండాలి. చాలామందిలో ఆ రకమైన శ్రద్ధ లేకపోవడంతో వారి ఆరోగ్యానికి శాపంలా మారుతోంది. ఉమ్మడి జిల్లాలో మహిళలు, పిల్లలు కలిపి 50 వేల మందికిపైగా రక్తహీనత సమస్యతో బాధపడుతున్నట్లు అధికారికంగా చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఈ సంఖ్య రెండింతలకుపైగా ఉంటుందని అంచనా. ఆరోగ్యంపై దృష్టి **సారించక..**

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పోషకాహారాన్ని చాలామంది గర్భిణులు, బాలింతలు సరిగా తీసుకోవడం లేదు. కొందరు చిన్న వయసులోనే వివాహాలు చేసుకుంటున్న నేపథ్యంలో ఆరోగ్యంపై అసలు దృష్టి పెట్టడంలేదు. గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లిదండ్రులకు అంగన్‌వాడీ కార్యకర్తలు తగిన జాగ్రత్తలు, ఆరోగ్య సూత్రాలు చెబుతుంటారు. వాటిని సరిగా పాటించడం లేదు.

కర్నూలు పశ్చిమ ప్రాంతం నుంచి ఏటా 2.5 లక్షల మంది వలస వెళ్తుంటారు. వారిలో గర్భిణులు, బాలింతలు ఉంటున్నారు. అలా




వెళ్లినప్పుడు ఆరోగ్యంపై దృష్టి పెట్టడంలేదు. ప్రభుత్వం ఇచ్చే బాలామృతం, బాల సంజీవిని కిట్లను కొందరు తీసుకోవడంలేదు.

**పిల్లల్లో పరిస్థితి మరింత తీవ్రం**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 35,364 మంది పిల్లలు బరువు తక్కువ సమస్యతో బాధపడుతున్నారు. వారిలో అత్యధికులు రక్తహీనత సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. తగినంత పౌష్టికాహారం అందకపోవడంతో వయస్సుకు తగ్గట్టు బరువు పెరగలేకపోతున్నారు. ఫలితంగా పలురకాల అనారోగ్యాలకు గురవుతున్నారు. ఏడు నెలల నుంచి మూడేళ్ల వయస్సున్న పిల్లల ఆరోగ్యం కోసం అంగన్‌వాడీ కేంద్రంలో బాలామృతం 2.5 కిలోల ప్యాకెట్ ఇస్తారు. రోజూ వంద ఎం.ఎల్. పాలు, నెలకు 25 గుడ్లు ఇస్తారు. మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు రోజూ 100 ఎం.ఎల్. పాలు, ఒక ఉడకబెట్టిన గుడ్డు, ఒక రోజు ఆకుకూర పప్పు, ఒకరోజు కూరగాయలతో సాంబారు, ఒకరోజు వెజిటబుల్ రైస్ ఇస్తారు. ఆ ఆహారం ఇచ్చేందుకు ఒకరికి కేవలం రూ.2.30 మాత్రమే ఇస్తుండటంతో ఆ మొత్తం సరిపోవడం లేదు. ఫలితంగా పిల్లలకు రుచికరమైన ఆహారం అందడం లేదు.

ఉమ్మడి జిల్లాలో రక్తహీనతతో బాధపడేవారి వివరాలు
జిల్లా: నంద్యాల మహిళలు: 4,400 పిల్లలు: 8,816 జిల్లా: కర్నూలు మహిళలు: 11,008 పిల్లలు: 26,548

# సచివాలయం.. సేవలు పారదర్శకం

కర్నూలు : గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ప్రజల చెంతకు సేవలను మరింత చేరువ చేయాలని కీలక నిర్ణయం తీసుకొంది. ఉద్యోగుల హేతుబద్ధీకరణపై దృష్టి సారించింది. ఇప్పటికే క్షేత్రస్థాయి నుంచి సిబ్బంది సమాచారాన్ని సేకరించింది. త్వరలో మార్పులు.. చేర్పులకు శ్రీకారం చుట్టనుంది.

**ఎక్కడెక్కడ వినియోగిస్తారంటే..**

నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల ఏర్పాటు, ఆహార శుద్ధి, మార్కెటింగ్, ఉపాధి కోసం ఎంపిక చేసిన వారికి శిక్షణ ఇవ్వనున్నారు. ఔత్సాహిక యువతను గుర్తించి ప్రోత్సహించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఎక్కడైతే ఎక్కువమంది సిబ్బంది ఉన్నారో గుర్తించి అవసరమైన ప్రాంతాలకు సర్దుబాటు చేసేలా కసరత్తు చేస్తున్నారు.

**వారిపై అదనపు పనిభారం**

వైకాపా పాలనలో రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రజలకు స్థానికంగా సేవలందించే పేరుతో భారీ సంఖ్యలో సిబ్బందిని భర్తీ చేశారు. నాటి పాలకుల ముందుచూపు లేమితో ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో కొంతమంది సిబ్బందికి పని తక్కువగా ఉండగా.. మరికొంత మందికిపై భారం పడుతోంది. మహిళా పోలీసు, ఎనర్జీ సహాయకులు ఎక్కువగా ఉన్నారు. ధ్రువపత్రాల జారీలో డిజిటల్, వెల్ఫేర్ సహాయకులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. వీరి సంఖ్య మాత్రం తక్కువగా ఉంది. చాలాచోట్ల ఇన్‌ఛార్జులే అదనపు బాధ్యతలు మోస్తున్నారు.

**హేతుబద్ధీకరణతో సత్ఫలితాలు**

కర్నూలు జిల్లాలో 762, నంద్యాల జిల్లాలో 419 మంది కలిపి ఉమ్మడి జిల్లాలో 1,181 మంది ఇన్‌ఛార్జులు పనిచేస్తున్నారు. కొన్ని సచివాలయాల్లో సాంకేతిక సహాయకులు లేకపోవడంతో ఆ పనులన్నీ వెల్ఫేర్ అసిస్టెంట్, ఇతర సిబ్బందిపై పడుతోంది. పనిభారంతో తీవ్రమైన ఒత్తిడి పెరుగుతోంది. గ్రామ సచివాలయాల్లో తగినంత సిబ్బందిని నియమిస్తే పనులు సులభంగా, త్వరితగతిన చేసేందుకు అవకాశం ఉంటుంది. **ఉన్నత విద్యావంతులకు అవకాశాలు**

సచివాలయం ఉద్యోగుల్లో చాలామంది ఇంజినీరింగ్, డిప్లొమో, పీజీ, పీహెచ్‌డీ చేసినవారు ఉన్నారు. వీరి సేవలను క్షేత్రస్థాయిలో వినియోగించేలా రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. ఈ మేరకు ఇటీవల రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో సీఎఫ్ఎంఎస్ ఐడీ, చరవాణి సంఖ్య, లింగం, విద్యార్హత, కులం వివరాలు సేకరించారు. బీటెక్, ఎంటెక్‌లో ఈసీఈ, సీఎస్ఈ, మెకానికల్, సివిల్, పీజీ, పీహెచ్‌డీ చేసిన వారి వివరాలు తీసుకొన్నారు.

# పండ్ల మొక్కల పెంపకంలో భేష్

కళ్యాణదుర్గం : పండ్ల తోటల పెంపకంలో రైతులను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద ఉచితంగా పండ్ల మొక్కలు అందించి తోడ్పాటు కల్పించింది. ఈ పథకం కింద పండ్ల మొక్కల సాగులో కళ్యాణదుర్గం నియోజకవర్గం జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఎన్నడూ లేని విధంగా ఈ ప్రాంత రైతులు తోటల సాగులో ఆసక్తి చూపడం గమనార్హం. అనంతపురం జిల్లాలో 3,006 మంది రైతులు 9,167.56 ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటారు. ఇందులో కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 1,394 మంది రైతులు 4,606.23 ఎకరాల్లో మొక్కలు నాటి ప్రథమ స్థానానికి చేరుకొన్నట్లు అధికారులు చెబుతున్నారు. పండ్ల సాగుకు ఉత్సాహంగా ముందుకొచ్చిన రైతులకు ఎకరాకు మామిడి మొక్కలు 70, చీనీ 110, సపోట 60, డ్రాగన్ ఫ్రూట్స్



మొక్కలు 230, దానిమ్మ 235, పూల మొక్కలు అర ఎకరాకు అందజేశారు. ఈ పంటలు సాగు చేసిన రైతులకు ఎకరాకు నెలకు నీటి బిల్లులు రూ.1,526, సంరక్షణకు రూ.2,500 ప్రభుత్వం అందజేయనుంది.

**రైతులకు మరింత ప్రోత్సాహం కల్పిస్తాం: రమేశ్ నాయక్, ఏపీడీ, కళ్యాణదుర్గం** పండ్ల తోటల సాగులో కళ్యాణదుర్గం నియోజకవర్గం జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోనూ ముందంజలో ఉంది. ఇక్కడి రైతులకు పండ్ల మొక్కల సాగుపై అవగాహన కల్పించాం. దాంతో ఎక్కువ మంది మొగ్గు చూపారు. ఉపాధి హామీ పథకం కింద మొక్కలు అందించాం. రైతులకు బిల్లులు సక్రమంగా అందేవిధంగా చూస్తాం. రోజుల్లో మరింత మంది రైతులకు ప్రోత్సాహం కల్పిస్తాం.

# అక్రమ లేఅవుట్లు.. అదుపులేని ధరలు

పలమనేరు : 'ఆ పక్కా నాదే.. ఈ పక్కా నాదే.. తలపేనా ఆకాశంలోని ముక్కా నాదే.. హే బిడ్డా.. ఇది నా(అక్రమాల) అడ్డా' అన్న ధోరణిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వ్యవసాయ భూములన్నీ ఆక్రమించేశారు. గత ఐదేళ్లూ అడ్డదిడ్డంగా వ్యవహరించారు. పలమనేరు, గంగవరం మండలాలు రికార్డుల పరంగా వేర్వేరుగా ఉన్నా భౌగోళికంగా కలిసిపోయాయి. ఇక్కడ రియల్ భూమ్ అమాంతం పెరిగినా ప్రభుత్వానికి ఏమాత్రం ఆదాయం రావడం లేదు. అక్రమ లేఅవుట్లకు ఇటు పలమనేరు పురపాలిక నుంచి అటు గంగవరం పంచాయతీ నుంచి అనుమతులు ఉండవు. చెరువు మొరవ, చెరువుకట్ట ప్రాంతాల్లోనూ ఆవాస స్థలాలుగా మార్చి విక్రయాలు సాగిస్తున్నారు. తాజాగా పలమనేరు పరిధిలోని బొమ్మదొడ్డి వద్ద ఓ లేఅవుట్‌ను చెరువు మొరవలోనే వేశారు. గంగవరం మొత్తం పలమనేరులో కలవడంతో ఒకప్పుడు ఎకరా రూ.5 లక్షల వరకు ఉండగా ప్రస్తుతం రూ.4 కోట్ల వరకు పలుకుతోంది. ఇటీవల ఓ బడా వ్యాపారి బెంగళూరు నుంచి ఇక్కడికొచ్చి భూముల ధరలు విని విస్తుపోయారు. ఇదే ధరకు బెంగళూరు శివారులో కొనుగోలు చేయొచ్చంటూ వెళ్లిపోవడం పరిస్థితికి అద్దం పడుతోంది. వైకాపా హయాంలో రియల్టర్లు తమకిష్టమొచ్చినట్లు వ్యవహరించగా అధికారులు వారికే అంటకాగారు.


**36 లేఅవుట్లపై ఆంక్షలు విధించాం**

36 లేఅవుట్లకు నోటీసులిచ్చి బ్లాక్‌లిస్టులో పెట్టాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తప్పనిసరిగా వ్యవసాయ భూమి మార్పిడికి భూమి విలువలో 5 శాతం రుసుం చెల్లించాలి. నిబంధనలకు అనుగుణంగా వసతులు, 30 అడుగుల రోడ్డు ఉంటే అనుమతులిస్తాం. లేకపోతే బ్లాక్‌లిస్టులో ఉంచి పనులు ఆపేస్తాం. ఎన్వీరమణారెడ్డి, కమిషనర్, పలమనేరు

# భారం మోయలేం

పుత్తూరు : భూముల రిజిస్ట్రేషన్ దస్తావేజులకు ఆన్‌లైన్‌లో స్టాంపులు జారీ చేసేలా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ నూతన విధానం అమలులోకి తెచ్చింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వెండర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించి స్టాంపులు జారీ చేయటంతోపాటు ఆన్‌లైన్‌లో వెండర్లే స్వయంగా కొనుగోలుదారుల వివరాలు నమోదుచేసి విక్రయించాల్సి ఉంటుంది. **వివరాల కోసమే..** ఇప్పటివరకు స్టాంప్ వెండర్లు కొనుగోలుదారులు కోరిన స్టాంపుల మేరకు దరఖాస్తు రాసి చలానా చెల్లించి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి స్టాంపులు పొందేవారు. అలా పొందిన వాటిని కొనుగోలుదారుల పేర్లతో రిజిస్టర్లలో నమోదుచేసి విక్రయించేవారు. అనంతరం వాటిని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వారానికోసారి తనిఖీ చేసేవారు. అయితే ఈ దరఖాస్తులను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భద్రపరచటం కష్టంగా మారుతోందని ఉన్నతాధికారులు భావించారు. దరఖాస్తుపోతే ఆ స్టాంప్ ఎవరు కొనుగోలు చేశారన్న వివరాలు లభించనందున ఆన్‌లైన్‌లో వెండర్లే స్టాంపులు జారీచేసే విధానాన్ని కొత్తగా ప్రవేశపెట్టారు. ప్రస్తుతం మాన్యువల్‌గా వెండర్లు వీటిని జారీ చేస్తుండగా భవిష్యత్తులో ఆన్‌లైన్ చేయనున్నారు. **అదనపు భారం..** నూతన విధానం ప్రకారం స్టాంపులు విక్రయించాలంటే వెండర్ తప్పనిసరిగా కంప్యూటర్ ఏర్పాటు చేసుకోవాలి. ప్రస్తుతం లైసెన్సు ఉన్నవారిలో 70 శాతం మందికి లేవు. స్టాంపు కోసం ఎవరైనా వస్తే ముందుగా ఐజీఆర్ఎస్ సైట్‌లో లాగిన్ అవ్వాలి. ఆధార్ నంబరు నమోదు చేయగానే వాళ్ల ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. దాన్ని నమోదు చేసి కావాల్సిన విలువగల స్టాంప్‌ను వెండరే ముద్రించి విక్రయించి రుసుం తీసుకోవాలి. ఒక్కోసారి సర్వర్ పనిచేయక గంటల తరబడి వేచిఉండాల్సి వస్తుంది. ఇది అటు కొనుగోలుదారులకు, ఇటు స్టాంప్ వెండర్‌కు ఇబ్బందికరమేనని.. మారిన నిబంధనతో గది అద్దెకు తీసుకుని కంప్యూటర్, ఇంటర్నెట్ ఏర్పాటు చేసుకోవడంతో అదనపు భారం పడుతుందని చెబుతున్నారు. **నూతన విధానంతో పారదర్శకత..** పారదర్శకత కోసమే ఆన్‌లైన్ విధానానికి శ్రీకారం చుట్టారు. కొనుగోలుదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నిక్షిప్తమై ఉంటాయి. అందరూ నూతన విధానంలోకి మారాల్సిందే. శ్రీరామ్, జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖాధికారి, తిరుపతి

# రెవెన్యూలో.. భూసమస్యల మేట



కదిరి : గ్రామీణుల్లో అత్యధికులు వ్యవసాయదారులే. పుడమితల్లిపై భరోసాతో జీవనం సాగిస్తారు. తమకున్న భూమిలో పంటసాగే కాకుండా తనఖా పెట్టి డబ్బు అవసరాలు తీర్చుకుంటారు. అలాంటి ఆధారమే తిరకాసుగా మారిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొలంపై హక్కుదారులంటే.. రికార్డుల్లో పరాయి వ్యక్తులు ఉన్నారు. విస్తీర్ణంలో తేడాలతోనూ సమస్యగా మారింది. వీటన్నిటి పరిష్కారానికి కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. సదస్సుల్లో కుప్పలు, తెప్పలుగా రైతుల నుంచి ఫిర్యాదు అందాయి. ఇందులో పరిష్కారమైన వాటికంటే వాయిదా పడిన వినతులే అధికం. తర్వాతైనా పరిష్కరిస్తారంటే కొలతలు వేసి, రికార్డుల్లో వివరాలు సరిచేయడంలో కీలకపాత్ర పోషించే సర్వేయర్లు, వీఆర్వోల కొరత సమస్యగా ఉంది. రెవెన్యూ అధికారులు గ్రామాలకొచ్చి సదస్సులు పెట్టినా భూవిస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, రికార్డుల్లో తప్పుల సవరణ యజ్ఞంగా మారింది. రైతులు భూ ఆధార పత్రాలను పట్టుకుని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు తప్పని శిక్షణ భావిస్తున్నారు.

**సిబ్బంది కొరతతో పనిభారం**

రెవెన్యూశాఖలో క్షేత్రస్థాయిలో పనిచేసే గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్ల కొరత వేధిస్తోంది. జిల్లావ్యాప్తంగా అమడగూరు, నల్లమాడ, ఓబుళదేవరచెరువు, తలుపుల, రామగిరి, పెనుకొండ మండలాలకు సర్వేయర్లు లేరు. 95 రెవెన్యూ గ్రామాలకు గ్రేడ్-1, గ్రేడు-2 వీఆర్వోల కొరత ఉంది. మొన్నటి దాకా రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఇందులో రైతులు ఇచ్చిన ఫిర్యాదుల్లో పరిష్కారమైనవి స్వల్పమే. ఇంకా పరిష్కరించాల్సినవే 2,739 ఉన్నాయి. అవి అలాగే ఉండగానే మళ్లీ రెండో దశ భూరీసర్వే సోమవారం నుంచి మొదలవనుంది. సిబ్బంది కొరతకు తోడు భూ రీసర్వే అదనపు భారంగా మారింది. రీసర్వే పనిలో రెవెన్యూ సిబ్బంది నిమగ్నమైతే సదస్సుల్లో చేసుకున్న విన్నపాలు మూలనపడతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తగిన చర్యలతో కాలయాపన లేకుండా సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు. 'కదిరి రెవెన్యూ డివిజన్‌లోని అమడగూరు మండలంలో సర్వేయరుతో పాటు వీఆర్వోల సమస్య వేధిస్తోంది. మండలంలో తొమ్మిది రెవెన్యూ గ్రామాలున్నాయి. ఐదుగురు వీఆర్వోలు మాత్రమే పనిచేస్తున్నారు. దీంతో ఒక్కొక్కరు రెండు, మూడేసి గ్రామాల బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. వీఆర్వోలను నియమించి సమస్యలు పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.'

**పరిష్కారానికి కృషి చేస్తాం: విజయసారథి, డీఆర్వో**

ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రెవెన్యూ సదస్సుల్లోని ఫిర్యాదులతో పాటు సాధారణ భూసమస్యల పరిష్కరానికి కృషి చేస్తాం. గతంలో వచ్చినవి పునరావృతం కాకూడదనే రీసర్వే మొదలవబోతోంది. కొరత ఉన్నచోటకు సిబ్బందిని ఏర్పాటు చేస్తాం.

# కొండలనూ కొల్లగొడుతున్నారు



గుత్తి : గుత్తిలో కొందరు నాయకులు కొండలనూ కొల్లగొడుతున్నారు. కొండలను పేల్చి వేస్తూ రాళ్లు, మట్టిని విక్రయిస్తున్నారు. ఆ తర్వాత ఏర్పడే రూ.కోట్లు విలువైన స్థలాలను కబ్జా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పురపాలికలో పట్టణం రోజురోజుకు విస్తరిస్తోంది. పురపాలికలో భూదందా జోరుగా సాగుతోంది. నాయకులు పార్టీలకు అతీతంగా ప్రభుత్వ స్థలాలు, కొండలను దర్జాగా ఆక్రమిస్తున్నారు. కొందరు వాటిని ఇతరులకు విక్రయిస్తూ రూ.లక్షలు కూడగట్టుకుంటుండగా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారనే ఆరోపణలున్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రజాప్రతినిధుల అండదండలతో కొండలను అక్రమంగా ఘూతాలు పెట్టి పేల్చివేతకు పాల్పడ్డారు. పెద్దగుట్టను పూర్తిగా పేల్చివేశారు. పేల్చివేతలు, ఆక్రమణలపై కథనాన్ని ప్రచురించడంతో రెవెన్యూ అధికారులు బ్లాస్టింగ్ పనులు నిలిపివేయించారు.

**ఆక్రమణలు ఇలా..**

గుత్తికి సమీపంలోని సర్వేనెంబర్ 431లో ఓ ప్రజాప్రతినిధి ప్రభుత్వ గుట్టను పొక్లెయిన్ సాయంతో చదును చేశాడు. ఆయన ఇతరులకు ప్లాట్లువేసి విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. గుత్తికి చెందిన ఓ నాయకుడు ఎకరా స్థలాన్ని ఆక్రమించి ప్లాట్లు వేశాడు. మరో నాయకుడు సుమారు 18 సెంట్ల స్థలాన్ని కబ్జాచేసి పునాదులు వేసుకున్నాడు. అలాగే ఇంకో నాయకుడు సుమారు 20 సెంట్ల స్థలాన్ని ఆక్రమించి పునాదులు వేశాడు. కొత్తపేట పంచాయతీ పరిధిలో 200 ఎకరాల ప్రభుత్వ భూమి, కొండలు ఉన్నాయి. ప్రభుత్వం రెండేళ్ల కిందట జగనన్న లేఅవుట్‌ను ఏర్పాటు చేసి సుమారు 600 మందికి పట్టాలు మంజూరు చేసి ఇళ్లను నిర్మించేందుకు పూనుకొంది. ఇళ్ల నిర్మాణాలు సాగుతూనే ఉన్నాయి. కాలనీ ఏర్పడుతుండటంతో అక్కడ స్థలాలకు డిమాండు నెలకొంది. గుత్తి పట్టణ శివారులోని సర్వేనెంబర్ 727లో ఓ వైకాపా నాయకుడు నాడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైకాపా ప్రజాప్రతినిధుల అండతో కొండను కూల్చి చేశాడు. రూ.కోట్లు విలువైన స్థలాన్ని కబ్జా చేసేందుకు పూనుకోగా అప్పట్లో 'ఈనాడు' కథనం ప్రచురించడంతో రెవెన్యూ అధికారులు పేలుళ్లను అడ్డుకున్నారు. ప్రస్తుతం కొండ కొంత భాగం మిగిలి ఉంది. అక్కడ పట్టణ ఆరోగ్య కేంద్రం ఉంది. దీంతో అక్కడ స్థలాలకు మంచి గిరాకీ ఏర్పడింది. సర్వేనంబర్ 728లో ప్రస్తుతం ఓ నాయకుడు తన సామాజికవర్గం వారికి నివేశన స్థలాల కోసం గుట్టలను కూల్చి వేయిస్తున్నాడు. పొక్లెయిన్‌తో రాళ్లను తొలగించి చదును చేస్తున్నాడు.

**నోటీసులతో సరిపెడుతున్నారు..**

ప్రభుత్వ కొండలు, గుట్టలు, స్థలాలను ఆక్రమిస్తున్న నాయకులకు రెవెన్యూ అధికారులు నోటీసులు ఇస్తూ చేతులు దులిపేసుకుంటున్నారు. కొత్తపేట పరిధిలో ఆక్రమణలకు పాల్పడిన 80 మందికి నోటీసులు ఇచ్చారు. తరువాత ఎలాంటి చర్యలు తీసుకోలేకపోయారు. సర్వేనంబరు 728లో కొందరు నకిలీ పట్టాలతో పునాదులు వేసుకోగా అధికారులు కొన్నింటిని కూల్చారు. మిగిలినవాటి జోలికి వెళ్లలేదు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఓ నాయకుడు ఇక్కడికి వచ్చి ఆక్రమణదారులకు మద్దతు ఇచ్చాడు. ఈ కారణంగా అధికారులు వెనుకడుగువేశారు.

**మాదృష్టికి రాలేదు**

కొండలు, గుట్టల పేల్చివేత విషయం మా దృష్టికి రాలేదు. గుట్టుగా చేస్తుండవచ్చు. పైగా తాము సెలవుల్లో ఉన్నప్పుడు పేలుళ్లకు పాల్పడుతున్నారేమో. ప్రభుత్వ స్థలాలు, గుట్టల చదునుపై విచారిస్తాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఓబిలేసు, తహసీల్దారు, గుత్తి

# అంతరించిపోతున్న పచ్చదనం



మడకశిర : పచ్చని చెట్లను కాపాడుతూ పర్యావరణాన్ని రక్షించాలని ప్రభుత్వం చెబుతున్నా పలువురు సొంత లాభార్జన కోసం పచ్చని చెట్లను నరికి కలపను అక్రమంగా తరలించి జేబులు నింపుకొంటున్నారు. రొళ్ల, అగళి మండలాలు దాదాపు కర్ణాటక ప్రాంతంలో కలిసిపోయినట్లుగా ఉంటాయి. దీన్ని అదునుగా భావించిన పలువురు వ్యాపారులు పచ్చని చెట్లను నరికి ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మండలాల్లోని పెద్ద పెద్ద చెట్లను రైతులతో తక్కువ నగదుకు కొనుగోళు చేసి వాటిని ఇతర ప్రాంతాలకు తరలించి అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. కర్ణాటక సరిహద్దున పావగడ, మడిగేశి, హొసకెర, రెంటవళలు, బడవనహళ్లి, శిరా, పట్టనాయకనహళ్లి తదితర పట్టణాలకు పెద్ద పెద్ద వాహనాల్లో కలపను తరలిస్తున్నారు. నాలుగు రోజులుగా శివబాలయోగినగర్ ప్రాంతంలో రెంటవళ రోడ్డు పక్కన నీలగిరి, మామిడి, తుమ్మ దుంగలను ట్రాక్టర్‌లో డంప్ చేసి లారీకి నింపి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

**నామమాత్రపు చర్యలతో సరి..**

ఐదేళ్ల కిందట వృక్షాలు లేక వర్షాలు కురవకపోవడంతో అనావృష్టి ఏర్పడి ప్రజలు చాలా ఇబ్బందులుపడ్డారు. ప్రస్తుతం రెండు మూడేళ్లుగా సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయి. ఈవిధంగా చెట్లను తొలగిస్తే ఇబ్బందులు తప్పవని ప్రజలు వాపోతున్నారు. వృక్ష సంపదను కాపాడాల్సిన అటవీశాఖ అధికారులు, పోలీసులు నామమాత్రపు చర్యలు చేపడుతున్నారు. కిందిస్థాయి అటవీశాఖ అధికారులు వ్యాపారులతో లాలూచిపడి మామూళ్లు ఇప్పించుకుంటున్నారంటూ రెండ్రోజుల కిందట మడకశిర మండలానికి చెందిన పలువురు వ్యాపారులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి వృక్ష సంపదను కాపాడాలని కోరుతున్నారు.


**చెట్లను నరికితే కేసులు నమోదు చేస్తాం**

కుళ్లాయప్ప, ఇన్‌ఛార్జి ఫారెస్ట్ అధికారి

అనుమతులు లేకుండా వ్యాపారులు అక్రమంగా చెట్లను నరికి దుంగలను ఇతర ప్రాంతాలకు తరలిస్తే చర్యలు తీసుకుంటాం. రైతుల పొలాల నుంచి చింత, మామిడి, వేప, టేకు, తుమ్మ, కానుగ తదితర చెట్లను నరికితే మా దృష్టికి తీసుకువస్తే కేసులు నమోదు చేస్తాం.

# ఉద్యమ్.. స్ఫూర్తి కావాలి

చిత్తూరు : పారిశ్రామిక రంగ వృద్ధిపై ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోంది. ఇంటికో పారిశ్రామికవేత్త నినాదంతో ప్రణాళికల్ని అమలు చేస్తోంది. దీనికోసం ఇప్పటికే ఏర్పాటైన ఎంఎస్ఎంఈలను గుర్తించి క్షేత్రస్థాయిలో వాటి సమస్యల్ని తెలుసుకోవడానికి రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ ఫెర్మార్మెన్స్ (ర్యాంపు) సర్వే ప్రారంభించింది. అయితే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) ర్యాంపు సర్వే నత్తనడకన సా..గుతోంది. ఇప్పటివరకూ సుమారు 11 వేల యూనిట్లనే సర్వే చేసినట్లు తెలుస్తోంది. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి క్షేత్రస్థాయిలో సర్వే పనులు అప్పగించారు. మండల, పుర/నగరపాలక అధికారుల పర్యవేక్షణ లేమితో సర్వే పనులు ఆశాజనకంగా జరగడం లేదనే విమర్శలు వస్తున్నాయి. సర్వే పూర్తిచేయడానికి కొన్ని రోజులే గడువున్న నేపథ్యలో



సంక్రాంతి సెలవుల తర్వాతనైనా పనుల్ని వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది.

**విద్యుత్తు సర్వీసుల ఆధారంగా..**

పరిశ్రమల రంగంపై ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యం అంతాఇంతా కాదు. ప్రతికూల పరిస్థితుల్లో అనేక పరిశ్రమలు మూతపడ్డాయి. ఉపాధి అవకాశాలు దెబ్బతిన్నాయి. ఎంఎస్ఎంఈలపై ప్రభుత్వం దగ్గర ఎలాంటి సమాచారం లేదు. దీంతో విద్యుత్తు సర్వీసుల ఆధారంగా పరిశ్రమల్ని అధికారులు గుర్తించారు. ఆయా పరిశ్రమల ప్రస్తుత స్థితిని లెక్కించేందుకు గతేడాది నవంబర్ 29న జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాలకు సర్వే బాధ్యతల్ని అప్పగించారు. నిర్దేశిత వివరాలు పొందుపరచగానే సదరు పరిశ్రమకు ఉద్యమ్ గుర్తింపు సంఖ్యతో ప్రత్యేక రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రం జారీ అవుతుంది. ఉద్యమ్ పత్రాలు తక్కువగానే జారీచేసినట్లు తెలుస్తోంది. సచివాలయ సిబ్బందికి ఇతర సర్వే పనులు ఉండటంతో సర్వే ఆలస్యమవుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి.

**సర్వే ఆధారంగా చర్యలు..**

ర్యాంపు సర్వే పూర్తయితే.. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఎంఎస్ఎంఈ, ఇతరత్రా ప్రోత్సాహకాలు, రాయితీలు వర్తిస్తాయి. రాష్ట్ర పరిశ్రమల విధానం నుంచి వచ్చే సౌకర్యాలు రాయితీలు పొందవచ్చు. ఎంఎస్ఎంఈ పోర్టల్‌లో పరిశ్రమల సమాచారం పొందుపరిస్తే కేంద్ర ప్రభుత్వ రాయితీ పథకాలను ఎక్కువగా అందిస్తుంది.

**నిత్య సమీక్షలు..** ర్యాంపు సర్వేపై పరిశ్రమల శాఖ అధికారులు నిత్యం సమీక్షలు జరుపుతున్నారు. మండల, పుర/నగరపాలక పర్యవేక్షణ అధికారుల నుంచి ఎప్పటికప్పుడు వివరాలు తెప్పించుకుని ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు.

# తగ్గుతున్న సాగు

అనకాపల్లి : జిల్లాలో కొంతకాలంగా సాగు విస్తీర్ణం తగ్గుతోంది. సాగు ఖర్చులు పెరగడం.. దిగుబడులు తగ్గడం.. గిట్టుబాటు ధరలు లేకపోవడమే దీనికి కారణమని వ్యవసాయ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. జిల్లాలో సాధారణ విస్తీర్ణం 85,857 హెక్టార్లు. ప్రస్తుతం 63,286 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. వరి పరిస్థితి కొంత ఆశాజనకంగా ఉన్నా ఇతర పంటలు బాగా తగ్గిపోతున్నాయి. గతంలో ఎటుచూసినా చెరకు తోటలు కనువిందు చేసేవి. 49 వేల హెక్టార్లలో చెరకు సాగు చేసేవారు. ఇప్పుడు 5,894 హెక్టార్లకు పడిపోయింది. ఎకరా సాగుకు రూ.60 వేలు ఖర్చవుతోంది. గతంలో హెక్టారుకు 75 నుంచి 80 టన్నుల దిగుబడి వచ్చేది. ఇప్పుడు 50 టన్నులకు మించడం లేదు. ఆదాయం అంత రావడం లేదని రైతులు మహేష్, సూరిబాబు తెలిపారు.

జొన్న, గంటి, చోడి, జొన్న, సామ, కొర్ర, కందులు, మినుము, పెసర, బొబ్బర, ఉలవలు వంటి పంటల సాగు ఏటేటా తగ్గుతోంది. స్థిరాస్తి ప్రభావం వ్యవసాయ రంగంపై పడింది. పరవాడ, అనకాపల్లి, మునగపాక, సబ్బవరం, అచ్యుతాపురం మండలాల్లో దీని ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. ఆయా ప్రాంతాల్లో అనేకమంది వ్యాపారులు వ్యవసాయ భూములు కొనుగోలు చేసి ప్లాట్లుగా అమ్మకాలు చేస్తున్నారు.

**ఇలా చేస్తే మేలు**

కూలీల సమస్య ఎక్కువగా ఉంది. దీని నివారణకు యంత్రాలు ఉపయోగించాలని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రైతులు నిత్యం ఉపయోగించే కత్తి, కొడవలి, గునపం, పార వంటి పరికరాలు రాయితీపై ఇవ్వాలి. నాణ్యమైన విత్తనం అందించాలి. చెరకు విత్తనాన్ని రాయితీపై ఇవ్వాలి. బెల్లానికి కనీస మద్దతు ధర ప్రకటించాలి.

# గెడ్డను కప్పి.. కబ్జాకు యత్నం



అనకాపల్లి : పీఎంపాలెం ప్రాంతాల్లో రోజురోజుకీ భూముల ధరలకు రెక్కలు రావడంతో ఆక్రమణదారులు ఇష్టారాజ్యంగా రెచ్చిపోతున్నారు. కబ్జాల ముసుగులో ప్రభుత్వ గెడ్డ స్థలాలను సైతం కప్పి తమ వశం చేసుకునేందుకు కుట్రలు పన్నుతున్నారు. ఆరో వార్డు గాయత్రీనగర్ దరి ఎఫ్‌సీఐ లేఅవుట్లో బక్కన్నపాలెం సర్వే సంఖ్య 28లో సుమారు రూ.కోటిన్నర విలువ చేసే 200 గజాల ప్రభుత్వ గెడ్డ స్థలంపై ఇటీవల కొందరు కబ్జాదారుల కన్ను పడింది. అధికారులు, ప్రజలు సంక్రాంతి పండగ హడావుడిలో ఉండగా అదును చూసి మట్టితో గెడ్డను కప్పి ఆక్రమణకు తెరతీశారు. ఆయా భూమిలో రేకుల షెడ్లు నిర్మించేందుకు నిర్మాణ సామగ్రిని తరలించి పనులు ప్రారంభించారు. దీనిపై స్థానికులు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఇంత వరకు ఎవరూ స్పందించలేదు. సంబంధిత గెడ్డను ఇప్పటికే కొందరు ఆక్రమించుకుని రాజకీయ నాయకుల ముసుగులో నివాసాలు సైతం నిర్మించారు. కోట్లాది రూపాయలు విలువైన గెడ్డ స్థలం ఆక్రమణలకు గురవ్వకుండా కాపాడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

చురకలు



## ఇకనైనా 'భూ'చోళ్ల పని పడతారా?

పెందుర్తి : వైకాపా పాలనలో జిల్లాలో గాడితప్పిన భూ అంశాలను కొలిక్కి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం ముమ్మర కసరత్తు చేస్తోంది. వైకాపా హయాంలో భూ కేటాయింపులు, సమీకరణ, 22ఏ నుంచి తొలగింపు..వంటి అంశాలపై ఎన్నో అక్రమాలు జరిగాయి. వీటిపై భారీగా ఫిర్యాదులు కూడా అందుతున్నాయి. ఆయా అంశాలకు సంబంధించి జిల్లాల వారీ నెలకొన్న పరిస్థితులపై రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ విశాఖ కలెక్టరేట్‌లో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన కలెక్టర్లు, జేసీలు, ఆర్డీఓలతో ఉన్నతస్థాయి సమీక్ష ఏర్పాటు చేశారు. 12 అంశాలతో కూడిన అజెండాపై చర్చించనున్నారు. అలాగే ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి ఫిర్యాదులు కూడా స్వీకరించనున్నారు. జిల్లాలో ఫ్రీహోల్డు భూములకు సంబంధించి 625 ఎకరాలకు అనుమతులు మంజూరు చేశారు. ఆనందపురం, పద్మనాభం, భీమిని పట్నం, పెందుర్తి మండలాల పరిధిలో ఇవి ఉన్నాయి. పేదలకు చెందిన ఈ భూములను వైకాపా నేతలు తమ పరం చేసుకొని రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని, ఈ విషయంలో జిల్లా అధికార యంత్రాంగం ఉదారంగా వ్యవహరించిందనే ఆరోపణలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కలెక్టర్, జేసీ స్థాయి అధికారులతో పాటు డిప్యూటీ కలెక్టర్ల ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో విచారణ జరిపాయి. విచారణలో అక్రమాలు వెలుగు చూడనప్పటికీ రైతుల పేరుతో ఉన్న భూములు వైకాపా నేతలు, వారి అనుచరుల పేరున మాత్రం మారాయి. వీటిపై మంత్రి సమీక్ష తరువాతైనా చర్యలు ఉంటాయేమో చూడాలి.



జిల్లాలో 1.25లక్షల మంది పేదలకు సెంటు స్థలాలు కేటాయించేందుకు దాదాపు 6వేల ఎకరాల వరకు సమీకరించారు. ఆ భూములు పద్మనాభం, పెందుర్తి, ఆనందపురం, భీమునిపట్నం మండలాల పరిధిలో ఉన్నాయి. ఈ భూముల విషయంలో పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. వైకాపా నేతలు వ్యూహాత్మకంగా పేద భూములను తీసుకొని, వారి పేరున సమీకరణ కింద వచ్చిన అభివృద్ధి చేసిన స్థలాలను సొంతం చేసుకున్నారనే ఆరోపణలున్నాయి. పద్మనాభం మండల పరిధిలో ఒక ప్రజాప్రతినిధి తన అనుచరుల పేరున భారీగా ఇంటిస్థలాలు రాయించుకున్నట్లు ఆరోపణలొచ్చాయి.

జిల్లాలోని 76 పంచాయతీల పరిధిలో రీసర్వే పనులు జరిగాయి. ఈ రీసర్వేలో ఒకరి భూములు మరొకరి పేరున మార్చేశారు. ఆనందపురం మండల పరిధిలో పనిచేసిన అధికారులు, ఉద్యోగులపై ఆరోపణలు వచ్చాయి. ఎవరిపైనా ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. కూటమి ప్రభుత్వం రీసర్వేకు సంబంధించి పంచాయతీల వారీగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయి.

జిల్లాలో వైకాపా పాలనలో 224 ఎకరాలను 22ఏ నుంచి మినహాయిస్తూ యంత్రాంగం ఉత్తర్వులు జారీ చేసింది. మినహాయింపుల విషయంలో సైతం వైకాపా నేతలకు అనుగుణంగా అధికారులు వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. వాటిపై విచారణ జరిగినా చర్యలను మాత్రం ఇంతవరకు తీసుకోలేదు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందుతున్న వినతుల్లో రెవెన్యూశాఖకు సంబంధించినవే అధికంగా ఉంటున్నాయి. భూముల క్రమబద్ధీకరణ, భూసేకరణ ప్రాజెక్టులు, భూ కేటాయింపులపై మంత్రి సమీక్షించనున్నారు.

## అమ్మకు అందని పోషకాహారం

ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన గర్భిణికి అంగన్‌వాడీ సిబ్బంది నవంబరులో పోషకాహార కిట్టు అందించారు.. పోషణట్రాకర్ యాప్‌లో పేరు కనిపించకపోవడంతో ఈ నెలలో ఇవ్వలేదు.. చాగల మర్రికి చెందిన ఓ బాలింతకు ఇదే పరిస్థితి ఎదురైంది.. పోషణ ట్రాకర్‌లో పేర్లు అదృశ్యం కావడంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో చాలా మంది సరకులు అందుకోలేకపోతున్నారు. ఇలాంటి వారి సంఖ్య ప్రతినెలా ఐదువేల వరకు ఉంటోందని అంచనా. గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రతినెలా పోషకాహారం పంపిణీ చేస్తారు. సరకుల పంపిణీ పక్కదారి పడుతోందన్న ఆరోపణల నేపథ్యంలో పోషణ ట్రాకర్ యాప్ తీసుకొచ్చారు. ఈ యాప్‌తో పాటు మరికొన్ని అందుబాటులోకి తీసుకొచ్చి ప్రత్యేక చరవాణులను అంగన్‌వాడీ



కార్యకర్తలకు ఇచ్చారు. కేంద్రాల పరిధిలో ఉన్న గర్భిణులు, బాలింతల పేర్లు యాప్‌లో నమోదు చేశారు. లబ్ధిదారుల ముఖ చిత్రం, వేలిముద్రలు తీసుకున్నారు. యాప్‌లో పేర్లు ఉంటేనే పోషకాహారాన్ని అందిస్తారు. ఉన్నట్టుండి యాప్‌లో పేర్లు గల్లంతు అవుతున్నాయి.. వారి వివరాలు నమోదు చేయడానికి యత్నిస్తే 'ఫెయిల్యూర్' అంటూ వస్తోంది. సమస్యను సరిచేయాలని 'అమ్మ'లు విన్నవిస్తున్నారు.

**నవీకరణకు అవస్థలు**

అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన చరవాణిలో బాలసంజీవిని, పోషణ ట్రాకర్, ఎఫ్ఆర్ఎస్, మిల్క్ యాప్‌లు ఉన్నాయి. పిల్లల వివరాలు ఒకసారి నమోదు చేస్తే వారి వయసుకు అనుగుణంగా వాటంతటఅవే నవీకరణ( అప్‌డేట్) అయ్యేవని. ప్రస్తుతం ప్రతి అంశాన్నీ నవీకరణ చేయాల్సి వస్తోంది.. వివరాలు నమోదు చేస్తుంటే సర్వర్ సతాయిస్తోందని కార్యకర్తలు వాపోతున్నారు. అంగన్‌వాడీ సిబ్బంది కొందరికి యాప్‌ల వినియోగంపై అవగాహన లేకపోవడంతోనూ సమస్యలు ఎదురవుతున్నాయి. " నవీకరణ చేయాల్సిందేనని కార్యకర్తలకు చెబుతున్నాం... పేర్ల గల్లంతు వివరాలు కార్యకర్తలే నమోదు చేయాల్సి ఉంటుందని" ఆళ్లగడ్డ సీడీపీవో తేజేశ్వరి పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు 3,600

గర్భిణులు: 41,789

బాలింతలు : 36,235

0-3 లోపు చిన్నారులు : 2,13,722

3-6 లోపు పిల్లలు : 1,08,162

# చదును చేసి చుట్టేస్తున్నారు..!



తిరుపతి: గ్రావెల్‌ను కొల్లగొట్టడంతో పాటు అక్రమార్కులు కొత్త ఎత్తుగడ వేస్తున్నారు. అక్కడ చదును చేసి ఆ ప్రాంతాన్ని స్థిరాస్తి వ్యాపారం కింద మార్చి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధాన రహదారి ఆనుకునే గుట్టలు తొలచివేస్తున్నా రెవెన్యూ అధికారులు నిద్ర నటిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారం తిరుపతికి అనుకుని ఉన్న రామచంద్రాపురం సమీపంలోని ప్రధాన రహదారికి పక్కనే జరుగుతోంది.

రామచంద్రాపురానికి వెళ్లే మార్గంలో అక్కగార్ల ఆలయానికి ఎదురుగా ఉన్న కొండను అక్రమార్కులు జేసీబీతో పూర్తిగా తొలచివేస్తున్నారు. కొండ ప్రాంతంలోని గ్రావెల్‌ను ట్రాక్టర్లలో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇప్పటికే గుట్ట కింది భాగం మొత్తం తొలగించి రహదారిని ఏర్పాటు చేసుకున్నారు. తాజాగా కొండకు కొంత పక్క భాగాన్ని జేసీబీతో తొలగిస్తున్నారు. వాస్తవానికి రహదారికి ఆనుకుని ముందు భాగంలో కొన్ని చిన్నచిన్న ఇళ్లు ఉన్నాయి. వాటి వెనుక మొత్తం గుట్ట ఉంది. ఇప్పుడు ఆ భాగాన్ని చదును చేస్తున్నారు. గ్రావెల్, రాళ్లను పగులగొట్టి అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

**స్థలాలుగా మార్చి..**అక్రమార్కులు గ్రావెల్‌ను, రాళ్లను తొలగించి సొమ్ము చేసుకోవడమే కాకుండా స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నారు. చదును చేసిన ప్రాంతాన్ని ప్లాట్లుగా మారుస్తున్నారు. కొంత భాగంలో చిన్నచిన్న ప్లాట్లుగా చేసి హద్దురాళ్లు పాతారు. ఇక్కడ అంకణం విలువ రూ.లక్షకుపైనే ఉంది. ఇక్కడ స్థలాలు కొనుగోలు చేసిన వ్యక్తులు ఇబ్బందులు పడే ఆస్కారం ఉంది. గుట్టను తొలగించడమే పెద్ద నేరం. ఇక్కడ ఇళ్లు నిర్మించుకునే వారిపై చర్యలు తీసుకునే ఆస్కారం ఉంది.అధికారులకు కనిపించట్లేదా? గుట్టను మొత్తం చదును చేస్తున్నా రెవెన్యూ అధికారులు కనీసం చర్యలు తీసుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. జాతీయ రహదారి నుంచి రామచంద్రాపురం తహసీల్దారు కార్యాలయానికి ఇదే మార్గంలో వెళ్లాలి. రహదారికి పక్కనే అక్రమం చోటుచేసుకుంటున్నా అధికారులకు కనిపించట్లేదా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రెవెన్యూ అధికారులకు తెలిసే ఈ వ్యవహారం నడుస్తోందనే ఆరోపణలున్నాయి. జిల్లా యంత్రాంగం గుట్టను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

**చట్టపరంగా చర్యలు తీసుకుంటాం**గుట్ట తవ్వకాలు చేపట్టకూడదు. అక్రమంగా ఎవరైనా తవ్వకాలు చేపడితే వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. కేసు నమోదు చేసి వాహనాన్ని జప్తు చేస్తాం. వెంకటరమణ, తహసీల్దారు, రామచంద్రాపురం

# అందని పుస్తకం దక్కని రుణం



కర్నూలు : మూడు నెలల కిందట రిజిస్ట్రేషన్ జరగ్గా కల్లూరు మండలానికి చెందిన ఓ మహిళకు డిసెంబరు మొదటి వారంలో ఈ.పాసుపుస్తకం చెన్నై నుంచి రిజిస్టర్ పోస్టు ద్వారా పంపారు..

ఉమ్మడి జిల్లాలో పట్టాదారు పాసు పుస్తకాల కోసం రైతులు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. భూముల అమ్మకాలు, కొనుగోలు, వెబ్‌ల్యాండ్‌లో మ్యుటేషన్లు, ఆన్‌లైన్‌లో తమ పేరు లేకపోవడం వంటి కారణాలతో రైతులు దరఖాస్తు చేసుకుంటున్నారు. 2022 జనవరి నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20,244 మంది అర్జీ పెట్టుకున్నారు. ఇందులో 16,363 దరఖాస్తులను రెవెన్యూ అధికారులు ఆమోదించగా.. 3,626 వరకు వివిధ కారణాలతో తిరస్కరించారు. పాసు పుస్తకాలు ఉంటేనే బ్యాంకర్లు రుణాలు ఇస్తామని మెలిక పెట్టడంతో ఇబ్బంది పడుతున్నారు. పట్టాదారు పాసు పుస్తకాల్లేక చాలా మంది ప్రభుత్వ ప్రోత్సాహకాలకు దూరం అవుతున్నారు.

**ఆమోదం ఆలస్యం**

పాసు పుస్తకాల కోసం మీసేవా, సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. వీఆర్వో ఫారం-8 జనరేట్ చేసి తాఖీదులు జారీ చేయాలి. ఆ తర్వాత వీఆర్వో విచారణ నివేదిక, ఆర్ఐ పరిశీలన అనంతరం తహసీల్దారుకు సిఫారసు చేస్తారు. అంతా సరిగా ఉంటే తహసీల్దారు ఆమోదిస్తారు. అనంతరం పట్టాదారు పాసు పుస్తకం ముద్రణకు పంపాలి. ఈ ప్రక్రియ అంతా 40 రోజుల్లో చేయాలి. అయితే తహసీల్దారు ఆమోదించినా కొందరు కంప్యూటర్ ఆపరేటర్లు ముద్రణకు పంపకుండా జాప్యం చేస్తున్నారు. చేయి తడిపితేనే ఆమోదముద్ర వేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 20,244 మంది దరఖాస్తు చేసుకోగా.. కేవలం 1,925 మంజూరవడం గమనార్హం.

**రీసర్వే గ్రామాల్లో మరిన్ని కష్టాలు**

వైకాపా ప్రభుత్వ హయాంలో కర్నూలు జిల్లాలో 254, నంద్యాలలో 210 గ్రామాల్లో రీసర్వే చేశారు. 70 వేల మందికిపైగా రైతులకు భూహక్కు పత్రాలు ఇచ్చారు. వీటిపై జగన్ చిత్రం ముద్రించారు. ఆయా పత్రాల్లో విస్తీర్ణంలో తేడాలు.. పేర్లు, ఎల్పీఎం నంబర్లు తప్పులుగా ఉండటం.. భూముల విస్తీర్ణంలో తేడాలు.. కొన్ని సర్వే నంబర్ల భూములు గల్లంతు అయ్యాయి. జగన్ బొమ్మతో ఉన్న భూహక్కు పత్రాలను తొలగిస్తామని.. ప్రభుత్వ లోగోతో పాసు పుస్తకాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చింది. ఈ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది.

**కాసులిస్తేనే దస్త్రం కదులుతుంది**

పాసు పుస్తకాలకు దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచి రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. సచివాలయాలు, మీసేవలో దరఖాస్తు చేసుకున్న వెంటనే వీఆర్వోకు వెళ్తుంది. అక్కడి నుంచి అసలు కథ ప్రారంభమవుతుంది. పైసలు ఇవ్వనిదే దస్త్రం కదలదు. పుస్తకం మంజూరు అవసరాన్ని బట్టి రూ.5-10 వేలు, రూ.20 వేలు, రూ.50 వేలు, రూ.కోట్ల విలువ చేసే భూములకు రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. అపరిష్కృతంగా, వివాదాస్పదంగా ఉన్న భూములకు రెట్టింపు పైకం డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బేరం కుదరకపోతే పక్కన పెట్టేస్తున్నారు. పలానా సర్వే నంబరు వివాదాస్పదంగా ఉందని.. దస్త్రాల్లో తేడాలున్నాయంటూ కొర్రీలు పెట్టి మ్పతిప్పలు పెడుతున్నారు.

**ఆరు నెలలుగా నిరీక్షిస్తున్నా- రాజునాయక్, ఎల్‌కేతండా, గడివేముల**

వారసత్వంగా వచ్చిన భూమిని భాగ పరిష్కారం చేసుకొని పట్టాదారు పాసు పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకున్నాం. చెన్నకపల్లె పొలిమేరలో 319 సర్వే నంబరులో 90 సెంట్లు, చిందుకూరు పొలిమేరలో 715 సర్వే నంబరులో 1.15 ఎకరాలకు పాసు పుస్తకాలు కావాలని దరఖాస్తు చేసుకున్నాం. 90 సెంట్లకు సంబంధించిన పాసు పుస్తకం వచ్చింది. 715 సర్వే నంబరుకు సంబంధించిన పాసు పుస్తకం రాలేదు. ఆన్‌లైన్‌లో నమోదైనా పాసు పుస్తకం రాకపోవడంతో బ్యాంకు రుణం మంజూరు కావడం లేదు. ఆరు నెలలుగా పాసు పుస్తకం కోసం నిరీక్షిస్తున్నాం.

**బ్యాంకులో రుణాలు ఇవ్వడం లేదు-పెద్ద సుబ్బారాయుడు, చిందుకూరు, గడివేముల**

మేము ఐదుగురు అన్నదమ్ములం. తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన భూమికి సంబంధించి భాగ పరిష్కారం చేసుకున్నాం. 316, 317 సర్వే నంబర్లలో నాతోపాటు చిన్న సుబ్బారాయుడు, వెంకటేశ్వర్లు, సుబ్బయ్య, వెంకటరమణ కలిసి 16 ఎకరాలకు పట్టాదారు పాసు పుస్తకాల కోసం పది నెలల కిందట దరఖాస్తు చేసుకున్నాం. ఇంతవరకు రాలేదు. పాసు పుస్తకాలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇవి వస్తే బ్యాంకులో ప్రస్తుతం తీసుకున్న రుణానికి అదనంగా మరికొంత రుణం తీసుకునే అవకాశం ఉంటుంది.

# అభివృద్ధి పేరిట చరిత్రకు సమాధి

కర్నూలు : గత ప్రభుత్వ నిర్వాకం వల్ల చరిత్రకు సమాధికట్టేసినట్లయ్యింది. అరాచక నిర్ణయాల వల్ల చక్కటి చరిత్రకు సాక్ష్యంగా నిలిచిన బిల్వస్వర్గం గుహలు ప్రమాదంలో పడ్డాయి. లక్షల ఏళ్లనాటి చరిత్రను చాటి చెప్పే తవ్వకాలను సిమెంట్‌తో గత ప్రభుత్వం కప్పేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**180 ఏళ్ల కిందటే వెలుగులోకి...**

బేతంచర్ల మండలం కనుమకింద కొట్టాల గ్రామ సమీపంలో బిల్వస్వర్గం గుహలు ఏర్పడ్డాయి. 1844లో మద్రాసు ఆర్మీకి చెందిన కెప్టెన్ న్యూబోల్డ్ వాటి గురించి లండన్‌లోని రాయల్ సొసైటీకి తెలియజేశారు. వాటి గొప్పతనం తొలిసారి ప్రపంచానికి తెలిసినట్లయ్యింది. 1883 నుంచి 1885 వరకు మూడేళ్లపాటు.. బ్రూస్ ఫూట్, ఆయన కుమారుడు బ్రూస్ ఫూట్ జూనియర్ గుహల్లో తవ్వకాలు చేపట్టారు. ఎలుక నుంచి ఖడ్గమృగం వరకు అనేక జంతువుల అవశేషాలను వెలికి తీసి..కొల్‌కతాలోని ఆసియాటిక్ సొసైటీకి పంపారు. మధ్యరాతియుగపు మానవుల ఆనవాళ్లు సైతం లభించాయి.

**అభివృద్ధి పేరిట విధ్వంసం**

తామే ఈ గుహలను అభివృద్ధి చేస్తామని గత వైకాపా ప్రభుత్వం గొప్పలు చెప్పింది. అప్పటి మంత్రి బుగ్గన దీని చరిత్ర గురించి తెలుసుకోకుండా, నిపుణులను సంప్రదించకుండా, ఎవరి అనుమతి తీసుకోకుండా రూ.2.5 కోట్లు వెచ్చించి సిమెంటుతో నాటి తవ్వకాల ఆనవాళ్లను పూడ్చేశారని, వాటి కింద రాబర్ట్ బ్రూస్‌ఫూట్ తవ్వకాల ఆనవాళ్లు సహా ఈ మధ్యకాలంలో ఆధునిక పద్ధతులను అనుసరించి చేపట్టిన ట్రెన్చ్‌లను కూడా కాంక్రీట్ కింద కప్పేశారని పురాతత్వ శాస్త్రవేత్తలు మండిపడుతున్నారు. గత ప్రభుత్వం ఈ ఏడాది జనవరి 29న గుహలను అట్టహాసంగా ప్రారంభించినా పర్యాటకులకు కనీసం రోడ్డు వసతి, తాగునీరు, మరుగుదొడ్లు, పిల్లలకు ఆటవస్తువులు సహా రెస్టారెంట్ సదుపాయం కల్పించలేకపోయింది

**ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం**

అప్పట్లో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో పనిచేస్తున్న రిచర్డ్ లిడెకర్ కొల్‌కతాలోని జంతు అవశేషాలను పరిశీలించి సమగ్ర జాబితాను తయారుచేశారు. అనంతరం రిచర్డ్.. బ్రిటిష్ మ్యూజియం పురావస్తు శాస్త్రవేత్తగా బాధ్యతలు తీసుకోవడంతో బిల్వస్వర్గం గుహలకు మరింత ప్రాచుర్యం లభించింది. 1920లో కర్నూలు జిల్లా కలెక్టర్‌గా కేవిల్ కామియాడ్ పనిచేసేవారు. పరిశోధనల్లో కర్నూలు జిల్లా గుహల పాత్రను వివరిస్తూ ఆధారాలతో సహా అంతర్జాతీయ వేదికల్లో తెలియజేయడంతో వాటికి మరింత ప్రాధాన్యం పెరిగింది. పరిశోధకులైన ఆల్చిన్ దంపతులు, కేవన్ ప్రసాద్, ఎంఎల్‌కే మూర్తి, కె.తిమ్మారెడ్డి తదితరులు గుహల నిర్మాణం, జంతుజాలం, పురాతన మానవుల ఆనవాళ్ల గురించి విస్తృత పరిశోధనలు నిర్వహించారు.

తాజాగా అంతర్జాతీయ నిపుణుల పరిశోధనలుపరిణామ సిద్ధాంత పితామహుడు చార్లెస్ డార్విన్ ఓ లేఖలో బిల్వస్వర్గం గుహల గురించి తెలియజేశారని పరిశోధకులు చెబుతారు. ఇటీవల అంతర్జాతీయ పరిశోధకులు, పురాతత్వవేత్త ప్రొఫెసర్ రవి కోరిసెట్టర్ ఆధ్వర్యంలో ఓ బృందం రాయలసీమ ప్రాంతంలో అధ్యయనాలు నిర్వహించింది. 2003 నుంచి 2010 వరకు పలుమార్లు బిల్వస్వర్గం గుహల్లో పరిశోధనలు చేపట్టారుగుహల్లో పరిశోధనలు చేసినప్పుడు వాటిని కాపాడాలని స్థానిక అధికారులను కోరాం. ట్రెంచ్‌లను కాంక్రీట్‌తో కప్పేశారు.

# వలసెళ్లకుండా వసతి

ఆదోని : పశ్చిమ ప్రాంతమనగానే గుర్తొచ్చేది.. బీడువారిన పొలాలు.. తాళాలు వేసిన ఇళ్లు.. ఇంటి ముంగిట కాపలాగా వృద్ధులు.. మట్టిలో ఆడుకునే చిన్నారులు.. నిర్మానుష్యమైన వీధులు. తల్లిదండ్రులు వలస బాట పడితే.. పిల్లలు చదువు మానేసి వారి వెంటే వెళ్తున్నారు. వారి భవిష్యత్తు గందరగోళంగా మారుతోంది. ఇలాంటి పరిస్థితులను తప్పించేందుకు ప్రభుత్వం సీజనల్ వసతి గృహాలను ప్రారంభించాలని సంకల్పించింది. తల్లిదండ్రులు వలస వెళ్లినా, పిల్లల చదువులకు ఆటంకం కలగకుండా ఇక్కడే ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆదోని డివిజన్ పరిధిలోని ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు నియోజకవర్గాల పరిధిలోని చాలా గ్రామాల ప్రజలు ఏటా రెండుసార్లు వలస వెళ్తారు. మొదటి విడత పత్తి తీయడానికి తెలంగాణకు, రెండో విడత ఎండు మిరప ఏరడానికి గుంటూరు ప్రాంతానికి వెళ్తారు. సుమారు 2 లక్షల కుటుంబాల వరకు సుగ్గి బాట పడతాయి.

**వంటకు తంటా** పెద్దకడబూరు మండలం చిన్నతుంబళానికి చెందిన



ఏలిస్ రాజు మూడో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు అనంతపురం జిల్లాలో పత్తి తీసేందుకు వెళ్లారు. వీరికి నలుగురు పిల్లలు.. ముగ్గురిని వారి వెంట తీసుకెళ్లారు. రాజు అవ్వ వద్ద ఉంటూ నిత్యం బడికి వెళ్తున్నాడు. "అవ్వకు కళ్లు సరిగా కనిపించవు. మధ్యాహ్నం బడిలో భోజనం చేస్తా.. వంట చేయడానికి ఇబ్బంది పడుతోంది.. అమ్మానాన్న ఉంటే ఈ బాధలుండవని" ఆ బాలుడు వాపోయారు.

**అవ్వ వద్ద ఆశ్రయం**

కోసిగికి చెందిన నారాయణ, లక్ష్మి దంపతుల కుమార్తె పి.మౌనిక స్థానిక ఎంపీపీ పాఠశాలలో మూడో తరగతి చదువుతోంది. తల్లిదండ్రులిద్దరూ రెండు నెలల కిందట తెలంగాణ రాష్ట్రానికి వలస వెళ్లారు. ఆ చిన్నారి అవ్వ, తాతల వద్ద ఉంటోంది. వంట చేయడానికి ఆ వృద్ధురాలు ఇబ్బందులు పడుతోంది. సీజనల్ వసతి గృహం ఏర్పాటు చేస్తే ఇలాంటి విద్యార్థుల కష్టాలు తీరినట్లే.

**మూడు రోజుల్లో ఏర్పాటు** ఆదోని డివిజన్ పరిధిలో 34 సీజనల్ వసతి గృహాల ఏర్పాటుకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. వీటి నిర్వహణకు స్వచ్ఛంద సంస్థలు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు అనుమతులిచ్చారు. మూడు రోజుల్లో అన్నీ ప్రారంభించాలని ఆదేశించారు. ఆదోని మండలం పెద్దహరివాణంలో రెండు, హాలహర్వి 1, హొళగుందలో 2, కోడుమూ రు మండలం కలపరిలో 1, కోసిగిలో 3, కందుకూరులో 1, కౌతాళం మండలం ఎరిగేరిలో 1, కాత్రికిలో 1, కౌతాళంలో 1, కృష్ణగిరి మండలంలోని కోయిలకొండలో 1, కంబాలపాడులో 3, చిట్యాలలో 1, మంత్రాలయం మండలం రచ్చుమర్రిలో 1, మాధవరంలో 1, బూదూరులో 1, పత్తికొండ మండల కేంద్రంలో 2, పుచ్చకాయ లమడలో 1, దూదేకొండలో 1, జూటూరులో 1, తుగ్గలి మండలం ఎర్రగుడిలో 2, కోతికొండలో 1, పగడిరాయిలో 1, జొన్నగిరిలో 2, చెన్నంపల్లిలో 1 చొప్పున సీజనల్ వసతి గృహాల ఏర్పాటుకు ఎంపిక చేశారు.

# కంటనీరు ఇంకనే లేదు

ఒంగోలు : 'ఫెయింజల్' తుపాను ప్రభావంతో ఈ నెల మొదటి వారంలో జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి. చాలా గ్రామాల్లో పొగాకు, శనగతో పాటు, ఇతర పంటలకు నష్టం చేశాయి. అత్యధిక విస్తీర్ణంలో పొగాకు మొక్కలు ఉరకెత్తాయి. రైతులు వాటి స్థానంలో మళ్లీ నాటుకోవాల్సి వచ్చింది. లోతట్టు పొలాల్లో నిలిచిన నీటితో శనగ మొక్కలు చనిపోయాయి. పొలాల్లో రోజుల తరబడి నీరు నిలిచింది. ఇప్పుడిప్పుడే పంట పొలాలు ఆరుదలకు వస్తున్నాయి. వాటిలో పంట తిరగ దున్ని మళ్లీ సాగు చేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు జిల్లాకు మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. దీంతో కర్షకుల్లో మళ్లీ కలవరం మొదలైంది. తేలికపాటి జల్లులు పడితే పెద్ద నష్టం ఉండకపోవచ్చని.. 50 మి.మీకు మించి వర్షపాతం నమోదైతే మాత్రం పొగాకు, శనగతో పాటు ఇతర పంటలకు భారీ నష్టం వాటిల్లనుందని ఆందోళన చెందుతున్నారు.

**పొగాకు.. మునిగిన రైతు...**

రబీ సీజన్ కింద జిల్లాలో పొగాకు, శనగ పంట సాగు అత్యధికం. ఎస్‌బీఎస్, ఎస్ఎల్ఎస్ రీజియన్ పరిధిలో ఈ ఏడాది సుమారు 62 వేల హెక్టార్ల విస్తీర్ణంలో రైతులు సాగు చేశారు. 'ఫెయింజల్' తుపాను కారణంగా డిసెంబర్ మొదటి వారంలో కురిసిన భారీ వర్షానికి ఒంగోలు-1, 2బీ టంగుటూరు, కొండపి, కనిగిరి వేలం కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో సాగు చేసిన పంట విస్తీర్ణంలో నాలుగో వంతు దెబ్బతింది. కనిగిరి, సీఎస్‌పురం, వెలిగండ్ల, పొన్నలూరు, జరుగుమల్లి, టంగుటూరు, ఒంగోలు, నాగులుప్పలపాడు, చీమకుర్తి మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో రెండు రోజుల మేర వర్షపు నీరు నిలవడంతో మొక్కలు ఉరకెత్తాయి. సుమారు 15 వేల హెక్టార్ల విస్తీర్ణంలో పంట దెబ్బతినగా, ఒక్కో హెక్టారుకు రూ.50 వేల వరకు రైతుకు నష్టం వాటిల్లింది. మళ్లీ దున్ని మొక్కలు నాటాల్సి వచ్చింది.

**20 వేల హెక్టార్లలో శనగకు ముప్పు...**

జిల్లావ్యాప్తంగా సుమారు 20 వేల హెక్టార్లలో శనగ సాగు చేశారు. ఒకటిన్నర నెల క్రితం సాగు చేసిన పంట కావడం., మొక్కలు చిన్నవి కావడంతో నీటిలో మునిగి కొంతమేర దెబ్బతింది. రైతులు చెమటోడ్చి వర్షపు నీటిని బయటకు పంపారు. జిల్లా వ్యాప్తంగా కంది, మిరప, మినుము కూడా సాగు విస్తీర్ణం ఎక్కువే. ఇటీవల కురిసిన వర్షానికే కొంత మేర దెబ్బతిన్నాయి. ఇప్పటికే భూమిలో తేమ శాతం ఎక్కువ కావడంతో తెగుళ్ల ఉద్ధృతీ అధికంగానే ఉంది. మళ్లీ భారీ వర్షం పడితే ఇక ఆ పంటలు తట్టుకోవడం కష్టమేనన్న భావన రైతుల్లో నెలకొంది. వరి పంట కోతలు కూడా ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ దశలో వర్షం పడితే వారికి కూడా నష్టాన్ని మిగల్చనుంది.

చురకలు



# ఇంటి దీపానికి అక్షర వెలుగు

గూడూరు : కూటమి ప్రభుత్వం విద్యా రంగంపై ప్రత్యేక దృష్టిసారించింది. అందులో భాగంగానే నిరక్షరాస్యులైన మహిళల్లో అక్షర వెలుగు నింపాలన్న లక్ష్యంతో అడుగులు వేస్తోంది. ప్రస్తుతం ఎక్కడ చూసినా సాంకేతిక పరిజ్ఞానం.. నగదు రహిత లావాదేవీలు కొనసాగుతున్నాయి. ఆ క్రమంలో స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ఇవన్నీ నేర్చుకోవడం ఎంతో అవసరమవుతోంది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం ఉల్లాస్(అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బ్యాంకు ఖాతా ఉన్నవారికి వాటి నిర్వహణపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. జిల్లాలోని డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జిల్లా వయోజన విద్య సహకారంతో ఉల్లాస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లాలోని 33 మండలాల్లో 12,085 మంది మహిళా నిరక్షరాస్యులను ఎంపిక చేశారు. ప్రతి పది మందికి ఒక వలంటీరు



చొప్పున ఎంపిక పూర్తి చేశారు. స్వయం సహాయక సంఘాల్లోని మహిళా నిరక్షరాస్యులతో పాటుగా మండల, జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న ఆయాలు, వంట పనివారిని నిరక్షరాస్యులుగా గుర్తించారు. వీరందరికీ 200 గంటల పాటు ఆరు నెలల వ్యవధిలో తరగతులు బోధించనున్నారు.

**బోధనాంశాలివే...**

నిరక్షరాస్యులైన మహిళలకు కుటుంబం-ఇరుగు పొరుగు, మన ఆచార వ్యవహారాలు, పరిశుభ్రత ఆరోగ్యం, ఎన్నికలు, పిల్లల పెంపకం-మన బాధ్యత, చట్టాలు తెలుసుకోవడం, మా ఇంటి మహాలక్ష్మి తదితర అంశాలతో పాటుగా తెలుగుభాష, గణితం బోధించి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతారు. వీరి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా పుస్తకాలను తయారు చేస్తోంది. ఈ విషయమై జిల్లా డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబును సంప్రదించగా.. ఇప్పటికే నిరక్షరాస్యులను గుర్తించామని.. త్వరలోనే తరగతులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రంలో తరగతులు నిర్వహిస్తారని చెప్పారు.

# అక్రమ అంతస్తులు

కర్నూలు : నగర పాలక, పురపాలికల్లో భవన నిర్మాణాల అనుమతుల విషయంలో లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ (ఎల్‌టీపీ)లు పెత్తనం చేస్తున్నారు. బిల్డరు, నిర్మాణదారుల ప్రయోజనాలే లక్ష్యంగా వ్యవహరిస్తూ నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు. మామూళ్ల మత్తులో అధికారులు వారికి వంతపాడుతున్నారు. ప్లాన్‌కు అనుగుణంగా నిర్మించకపోతే నిర్మాణదారులతోపాటు ఎల్‌టీపీపై చర్యలు తీసుకోవాలనే నిబంధనలు పక్కన పెట్టారు. పట్టణాల్లో నిబంధనలకు విరుద్ధంగా పెద్దఎత్తున నిర్మాణాలు జరుగుతున్నాయి. గత ఐదేళ్ల కాలంలో అక్రమ నిర్మాణాలకు సహకరించిన ఎల్‌టీపీలపై చర్యలు కానరాలేదు. అక్కడక్కడా ఒకరిద్దరికి తాఖీదులిచ్చి చేతులు దులిపేసుకున్నారు. లైసెన్సులు రద్దు చేయడం గానీ.. కేసులు పెట్టడం చేయలేదు.

**ప్లానింగ్ కార్యదర్శులు కాసుకుర్చున్నారు.**

గత వైకాపా ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులను నియమించారు. వారు ఆయా వార్డుల్లో కొత్త ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇప్పించడం, ప్రజా ఫిర్యాదులు, దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలి. పట్టణ ప్రణాళిక విభాగంలోని సిబ్బందితో ఉన్న సత్సంబంధాలను



పెట్టుబడిగా పెట్టి అసలు పనిని పక్కన పెట్టి 'కాసు'క్కూర్చున్నారు. లైసెన్స్డుటెక్నికల్ పర్సన్ (ఎల్టీపీ) అవతారమెత్తారు. వారే ఇళ్ల నిర్మాణ ప్రణాళిక రూపొందించడం.. ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయడం వంటివి చేసి జేబులు నింపుకొంటున్నారు. బినామీ పేర్లతో ఎల్‌టీపీల అవతారమెత్తి దందా చేస్తున్నారు. పని పూర్తైనవెంటనే పట్టణ ప్రణాళిక విభాగంలోని అధికారులు, సిబ్బందికి ఆర్థికంగా తోడ్పాటునందిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

**ప్యాకేజీగా రూపొందించి వసూళ్లు**

ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థతోపాటు ఎనిమిది పురపాలక సంఘాలు, నగర పంచాయతీలున్నాయి. ఆయా పట్టణాల్లో భవన అనుమతులకు సంబంధించి పక్కాగా పత్రాలు సమర్పించి అందుకనుగుణంగా నిర్మాణాలు జరిగేలా చూడాల్సిన బాధ్యత లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ (ఎల్‌టీపీ)ది. గృహ నిర్మాణం మొదలు వ్యాపార సముదాయాలు, వీఎల్‌టీ (ఖాళీ స్థలాల పన్ను), భవన నిర్మాణ ప్లాన్ అనుమతుల వరకు ఎల్‌టీపీలే చూసు'కొంటున్నారు'. ఎల్‌టీపీలు పురపాలిక ప్రణాళిక విభాగంలోని అధికారులను మచ్చిక చేసుకొని చక్రం తిప్పుతున్నారు. వీఎల్‌టీ, ప్లాన్ అనుమతులు, ఇంటి పన్ను, నీటి పన్ను వేసేంతవరకు ఒక ప్యాకేజీగా రూపొందించి ఇంటి యజమానుల వద్ద భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. భవనాలకు రూ.20-రూ.50 వేల వరకు, బహుళఅంతస్తులకు రూ.4-5 లక్షలు డిమాండ్ చేస్తున్నారు.

# ఫీజు చెల్లిస్తేనే డిగ్రీ సర్టిఫికెట్లు



అనంతపురం : చెన్నేకొత్తపల్లికి చెందిన విద్యార్థిని నగరంలోని ఓ కళాశాలలో 2020లో ఎంబీఏ పూర్తి చేసింది. ఇటీవల ఆమెకు హైదరాబాద్‌లోని ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. దీంతో ఆమె సర్టిఫికెట్ల కోసం కళాశాలకు వెళ్లింది. కానీ, పెండింగ్ ఫీజు రూ.30 వేలు చెల్లిస్తేనే ఇస్తామని తేల్చి చెప్పారు. ప్రస్తుతం అంత డబ్బు కట్టే స్తోమత లేకపోవడంతో కనీసం జిరాక్స్ కాపీలైనా ఇవ్వాలని కోరింది. అయినా కళాశాల యాజమాన్యం కనికరించలేదు. ఇప్పుడు సర్టిఫికెట్లు ఇస్తేనే ఉద్యోగంలో చేర్చుకుంటారని.. కళాశాల నిర్వాహకుల తీరుతో తాను ఉపాధి కోల్పోతున్నానని విద్యార్థిని వాపోతోంది.

రాప్తాడు మండలానికి చెందిన మరో విద్యార్థిని ఇటీవలే ఓ ప్రైవేట్ కళాశాలలో ఫార్మ్-డి పూర్తి చేసింది. బెంగళూరులోని కంపెనీలో ఉద్యోగానికి ఎంపికైంది. సర్టిఫికెట్ల కోసం కళాశాలకు వెళ్లగా పెండింగ్ ఫీజు చెల్లిస్తేనే ఇస్తామని నిర్వాహకులు తేల్చి చెప్పారు. దీంతో ఆమె జేఎన్టీయూ అధికారులను ఆశ్రయించగా.. కళాశాల నుంచి సమ్మతి పత్రం తీసుకురావాలని మెలిక పెట్టారు. సకాలంలో సర్టిఫికెట్లు సమర్పించకపోతే ఉద్యోగం నుంచి తీసేస్తారని విద్యార్థిని వాపోతోంది. ఇలా ఇదే కళాశాలలో 40 మంది విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఫీజు రీఎంబర్స్ బకాయిల పేరుతో కొన్ని ప్రైవేట్ కళాశాలలు విద్యార్థులను వేధిస్తున్నాయి. బకాయిలు చెల్లిస్తేనే ధ్రువపత్రాలు ఇస్తామంటూ తేల్చి చెబుతున్నాయి. డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, ఎంబీఏ, పీజీ కోర్సులు పూర్తిచేసి ఉన్నత చదువులు, ఉద్యోగాలకు వెళ్లాల్సిన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రైవేట్ కళాశాలల నిర్వాహకుల ధనాపేక్షతో వేలాదిమంది విద్యార్థులు అప్పులు చేసి మరీ ఫీజు బకాయిలు చెల్లిస్తున్నారు. రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు చెల్లించాల్సి వస్తుండటంతో ఆర్థిక స్తోమత లేని విద్యార్థులు మాత్రం ఉన్నత చదువులు, ఉపాధికి దూరమవుతున్న పరిస్థితి నెలకొంది. కనీసం జిరాక్స్ పత్రాలు ఇవ్వాలని కోరినా ఆయా కళాశాలల యాజమాన్యాలకు మనసు రావడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. మరికొన్ని కళాశాలలు సగం ఫీజైనా కట్టాలని మెలిక పెడుతున్నాయి.

**ప్రభుత్వం ఆదేశించినా..**

గత వైకాపా ప్రభుత్వం ఫీజు రీఎంబర్స్‌మెంట్ పథకం స్వరూపాన్ని మార్చేసింది. ఫీజుల్ని కళాశాలలకు కాకుండా తల్లుల ఖాతాల్లో జమచేసింది. అందులోనూ ఒక విడత పెండింగ్ పెట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ బకాయిల్ని కొంతమేర చెల్లించింది. ఇంకా కొంత చెల్లించాల్సి ఉంది. అయితే ఫీజు బకాయిల పేరుతో సర్టిఫికెట్లు ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. సర్టిఫికెట్లు ఇవ్వని కళాశాలలపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చెప్పింది. ఈ విషయంపై రెండు జిల్లాల కలెక్టర్లు సైతం స్పష్టమైన ప్రకటనలు జారీ చేశారు. అయినా కొన్ని ప్రైవేట్ కళాశాలలు దీన్ని పెడచెవిన పెడుతున్నాయి. విద్యార్థుల నుంచి బకాయిలు వసూలు చేసిన తర్వాతనే సర్టిఫికెట్లు ఇస్తున్నారు. కొన్ని కళాశాలలు ఫీజులు చెల్లించని విద్యార్థులను పరీక్షలు రాయించడానికి కూడా నిరాకరిస్తున్నాయి. హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి సదరు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

**విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం**

- వినోద్‌కుమార్, కలెక్టరు, అనంతపురం

ఫీజు బకాయిలను కారణంగా చూపి సర్టిఫికెట్లు నిలిపేవేసే అధికారం కళాశాలలకు లేదు. అలా చేసే యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం. ఫీజులు చెల్లించలేదని పరీక్షలు రాయకుండా అడ్డుకునే కళాశాలలపై కేసులు నమోదు చేస్తాం. సర్టిఫికెట్లు, హాల్‌టికెట్ల విషయంలో కళాశాలల నిర్వాహకులు ఇబ్బంది పెడితే నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

ఉమ్మడి జిల్లాలో ప్రైవేట్ కళాశాలలు

ఇంజినీరింగ్ : 08

డిగ్రీ : 52

ఫార్మసీ : 02

ఎంబీఏ: 03

పాలిటెక్నిక్ : 05

ఐటీఐ : 19

# జాగ్రత్తలు పాటిస్తే ఆనందమయం



అనంతపురం : ప్రభుత్వ ఉద్యోగులుగా మూడున్నర దశాబ్దాల పాటు ప్రజా సేవకు పునరంకితమై అహర్నిశలు శ్రమించారు. ప్రజలకు.. ప్రభుత్వానికి వారధిగా ఉంటూ నిత్య శ్రామికులుగా సమాజ పురోభివృద్ధికి పాటుపడ్డారు. ఇక ఇప్పుడు విశ్రాంతి తీసుకోవాల్సిన సమయం. పిల్లలు, మనవళ్లు, మనవరాళ్లతో కాలక్షేపం చేస్తూ శేష జీవితాన్ని గడపాలని ఆశిస్తారు. అలా గడపాలంటే ఆరోగ్యం.. ఆనందం.. ఆర్థిక స్థిరత్వం ఉండాలి. ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇలా చేస్తే మలిసంధ్య జీవితం.. ఆనందమయం అవుతుందని నిపుణులు చెబుతున్నారు. జిల్లావ్యాప్తంగా 28 వేలమంది పింఛనర్లు ఉన్నారు. నేడు పెన్షనర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కథనం. సహచరులకు తోడ్పాటుప్రభుత్వ ఉద్యోగానికే పదవీ విరమణ.. సేవా కార్యక్రమాలకు కాదని రాయదుర్గంలోని పింఛనర్లు నిరూపిస్తున్నారు. సహచరుల సమస్యలు పరిష్కరించేందుకు తోడ్పాటు అందిస్తున్నారు. ఏటా లైఫ్ సర్టిఫికెట్లను అందించేలా, ఉప ఖజానా కార్యాలయంలో తలెత్తే సమస్యలు దగ్గరుంచి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. అనారోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఉచిత పరీక్షలు, వైద్య శిబిరాలు నిర్వహిస్తూ.. చికిత్సలు చేయించేందుకు కృషి చేస్తున్నారు. పెన్షనర్లకు న్యాయపరంగా అందించాల్సిన ఆర్థిక వనరుల కోసం పాటు పడుతున్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆదుకుంటున్నారు.

**ఒకే కుటుంబ సభ్యుల్లా..**

పట్టణంలో 300 మంది పెన్షనర్లు ఉన్నారు. వీరు ఐక్యతతో కార్యాలయ భవనాన్ని నిర్మించుకున్నారు. రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యాలయంలో పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు అందుబాటులో ఉంటూ.. సహచరుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. మృతి చెందిన విశ్రాంత ఉద్యోగుల కుటుంబ సభ్యులకు పెన్షన్‌లో తలెత్తే ఇబ్బందులు తొలగించేందుకు సహాయపడుతున్నారు. పదేళ్లుగా నిస్వార్థంగా సేవచేస్తున్నారు. ఇక్కడ పెన్షనర్లందరూ ఒక కుటుంబ సభ్యులుగా ఉంటున్నారు. ఎవరికి ఏ ఆపద వచ్చినా వెంటనే స్పందిస్తారు. జాతీయ నేతల జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహిస్తూ దేశభక్తిని చాటుతున్నారు.

**ఆర్థిక భద్రత అవసరం**

ఉద్యోగ పదవీ విరమణ అనంతరం ఆర్థిక భద్రత చాలా అవసరం. ఇందుకోసం విశ్రాంత ఉద్యోగులు బ్యాంకులు, పోస్టాఫీసులో సొమ్ము డిపాజిట్ చేసుకోవాలి. పోస్టాఫీసులో చేసిన డిపాజిట్కు ప్రతి నెలా వచ్చే వడ్డీని ఆర్‌డీకి జమ చేయాలి. డిపాజిట్ల ద్వారా వచ్చే వడ్డీని ప్రతినెలా వినియోగించుకోవాలి. బయట వ్యక్తులకు వడ్డీకి ఇచ్చి మోసపోయే పరిస్థితి తెచ్చు కోకూడదు. విశ్రాంతి ఉద్యోగి తదనంతరం తన జీవిత భాగస్వామికి డిపాజిట్ల సొమ్ము అందేలా చేయడం ఆమె శేష జీవితానికి ఎంతో ఉపయుక్తం.పోలా రామకృష్ణ, ఆడిటర్, ధర్మవరం

**ఆరోగ్య సమస్యలొస్తే వైద్యులను సంప్రదించాలి**

వయసు మళ్లిన వారిలో ఆరోగ్య సమస్యలు తలెత్తితే వారు త్వరగా కోలుకోలేని పరిస్థితి ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని జీవన చైతన్య శక్తిని సాధ్యమైనంత వరకు కాపాడుకోవాల్సి ఉంటుంది. సాధారణంగా చలికాలంలో గుండెపోటు, శ్వాసకోశ, కీళ్లనొప్పులు, వాపులు, చర్మం పొడిబారడం, దురద పెట్టటం, అతిమూత్రం, కిడ్నీలో రాళ్లు ఏర్పడటం వంటి అనారోగ్య సమస్యలు ఎదురవుతాయి. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే వీటిని అధికమించవచ్చు. మాంసాహారం తక్కువగా తీసుకోవాలి. నూనెలో వేయించిన వంటలు, మసాలాలు సాధ్యమైనంత వరకు తీసుకోకూడదు. తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. చిన్నపాటి సమస్య ఎదురైనా వెంటనే సంబంధిత వైద్య నిపుణులను సంప్రదించాలి.డాక్టర్ భీమసేనాచారి, హెచ్‌ఓడీ, జనరల్ మెడిసిన్, సర్వజన వైద్యశాల

**ఒంటరిగా ఉండొద్దు..**

పిల్లలు ఇతర ప్రాంతాల్లో స్థిరపడి ఉండటంతో విశ్రాంత ఉద్యోగులు ఒంటరిగా ఉంటున్నామన్న భావనతో ఆరోగ్య సమస్యలు తెచ్చుకుంటున్నారు. విశ్రాంత ఉద్యోగులు ఎప్పుడూ ఒంటరిగా ఉండకూడదు. పదవీ విరమణ వృత్తికే కానీ మనసుకు కాదన్న విషయాన్ని గుర్తెరగాలి. వారు జీవితంలో ఏవైనా లక్ష్యాలుండి సాధించలేకపోతే ఉద్యోగ విరమణ తరువాత వాటిని సాధించడంపై దృష్టిపెట్టాలి. సంఘం సభ్యులు, స్నేహితులు, కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడుపుతుండాలి. తాము పనిచేసిన శాఖల్లో తెలుసుకున్న అంశాలపై ఇతర ఉద్యోగులకు మెలకువలు తెలియజేయవచ్చు. వైద్యుల సూచనల మేరకు వ్యాయామం చేయాలి. సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉండాలి.ఎండ్లూరి ప్రభాకర్, ప్రముఖ మానసిక వైద్యనిపుణుడు

# చెరువులకు కడగండ్లు

పుత్తూరు : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నైరుతి రుతపవనాల సమయంలో ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదు. 20 రోజుల క్రితం వరకు ఉమ్మడి జిల్లాలోని చెరువుల్లో 20 శాతం నీరు చేరలేదు. ఇటీవల ఫెయింజల్ తుపాను కారణంగా 70శాతం చెరువులు నిండాయి. గత వారం తుపానుతో తూర్పు మండలాల్లో చెరువులన్నీ పూర్తిగా నిండాయి. ఇప్పటికే కొన్ని చెరువులకు గండ్లు పడి పంటనష్టం వాటిల్లింది. ఉమ్మడి జిల్లాపై మరోసారి తుపాను విరుచుకుపడనుందని ఇప్పటికే వాతావరణశాఖ హెచ్చరించడంతో జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తం కావాల్సి ఉంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 5,871 చెరువులు ఉన్నాయి. వీటి కింద లక్ష ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. తిరుపతి జిల్లాలో మల్లెమడుగు, ఆరణియార్, కాళంగి రిజర్వాయర్లు, స్వర్ణముఖి కాలువ పరివాహక ప్రాంతం ఉంది. చిత్తూరు జిల్లాలోని కార్వేటినగరంలో కృష్ణాపురం రిజర్వాయర్ ఉంది. ఇవన్నీ ఇప్పటికే నిండిపోయి గేట్లు ఎత్తేశారు. ఇక తూర్పు మండలాల్లో చెరువులన్నీ నిండిపోయి కలుజు పారుతున్నాయి. ఇప్పటికే కొన్నింటికి గండ్లు పడగా, మరికొన్ని ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో చెన్నై కేంద్రంగా మరో తుపాను పొంచి ఉందని వాతావరణశాఖ అధికారులు హెచ్చరించడంతో ఇది ఉమ్మడి చిత్తూరు జిల్లాపై తీవ్ర ప్రభావం చూపుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు.

# ఏడుస్తున్న ఏడు పల్లెలు

హొళగుంద : ఏడు పల్లెలను తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. వేకువజామునే నిద్రలేచి బిందెలు చేతపట్టి తుంగభద్ర కాల్వ బాట పడుతున్నారు. నాలుగు రోజులుగా దాహం తీర్చుకునేందుకు అవస్థలు పడుతున్నారు. హొళగుంద మండల పరిధిలో తుంగభద్ర దిగువకాల్వ ప్రవహిస్తోంది. సమ్మతగేరిలో దిగువ కాల్వ పక్కనే ఎల్లార్తి తాగునీటి పథకానికి సంబంధించిన నీటినిల్వ ట్యాంకు నిర్మించారు. ఇక్కడి నుంచి సమ్మతగేరి, కోగిలతోట, మూగమానుగుంది, పెద్దహ్యాట, చిన్నహ్యాట, బీజీ హళ్లి, ఎల్లార్తి గ్రామాలకు మంచినీరు సరఫరా చేస్తున్నారు. " మూడు కి.మీ. వెళ్లి బోరుబావుల వద్ద తెచ్చుకుంటున్నాం. పనులు వదిలేసి వెళ్లాల్సి వస్తోందని" వీరేంద్రగౌడ వాపోయారు.

నీటిని శుద్ధి చేసేందుకు రెండు ఫిల్టర్ బెడ్‌లు ఉన్నా.. అధికారులు పర్యవేక్షణ లేక గుత్తేదారుడు వాటిని అలాగే వదిలేశారు. నీటి సరఫరా చేసేందుకు 8 మంది సిబ్బందిని నియమించారు. సంబంధిత గుత్తేదారు పది నెలలుగా వేతనాలు చెల్లించక పోవడంతో కార్మికులు విధులను బహిష్కరించి, సమ్మెబాట పట్టారు. ఎస్ఎస్ ట్యాంకు నిర్వహణ సరిగాలేక నీటిని నేరుగా సరఫరా చేస్తున్నారు. నీటిని శుద్ధి చేయకపోవడంతో



కుళాయిల్లో దుర్వాసన, రంగు మారిన నీరు వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. నీటి నిల్వ ట్యాంకులో చుట్టూ పిచ్చిమొక్కలు పెరగడంతో వాటిని శుభ్రం చేయక అలాగే వదిలేస్తున్నారు. " సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వీలైనంత తొందర సమస్యను పరిష్కరించి, తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామని" ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ తెలిపారు.

**బోర్ల వద్దకు పరుగులు** మల్లయ్య, పెద్దహ్యాట

సమ్మతగేరి పథకం నుంచి నీరు రావడం లేదు. నీటి కోసం నిత్యం దూర ప్రాంతాలకు వెళ్లి బోరుబావులు, మోటారు పంపుల దగ్గరకు వెళ్లి నీరు తెస్తున్నాం. మా గ్రామంలో ఆరు చేతి పంపులు ఉన్నాయి. ఆ నీటిని నిత్యావసరాలకు ఉపయోగించుకుందామంటే.. సరిగా పనిచేయడం లేదు. పంచాయతీ వారు ఒకే ఒక్క నీటి ట్యాంకరును పంపారు. 180 కుటుంబాలకు ఒక్క ట్యాంకరు నీరు ఎలా సరిపోతుంది.

# ఉపాధి దొంగలకు కళ్లెం

నంద్యాల : ఉపాధిహామీ పథకంలో కూలీల పేరిట దొంగ మస్టర్లు వేసి నిధులు స్వాహా చేయడం సాధారణంగా మారింది. గత ఐదేళ్ల వైకాపా పాలనలో గ్రామస్థాయి నేతల పెత్తనం చేసి నిధులు బొక్కేశారు. పలు ఫిర్యాదులొచ్చినా చర్యలు తీసుకోలేదు.. విషయం ప్రస్తుత కూటమి ప్రభుత్వం దృష్టికెళ్లింది. ఉపాధిహామీ పథకంలో అవినీతిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రత్యేకంగా పర్యవేక్షణ విభాగాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. చెరువులు, సాగునీటి కాల్వల అభివృద్ధి, మొక్కల పెంపకం, కందకాల తవ్వకం, భవనాల నిర్మాణం తదితర పనులు జరుగుతున్నాయి. నిర్ణయించిన పనిచేసిన కూలీకి సగటున రోజుకు రూ.280 వరకు కూలి చెల్లిస్తున్నారు. కూలీల్లో కొంతమందికి జాబ్ కార్డులు ఉన్నా వారు పనికి రావడం లేదు. ఇతర పనుల్లో ఉండిపోతున్నారు. ఇదే అదనుగా కొంతమంది అక్రమాలకు పాల్పడుతున్నారు. పనికి రాని వారి పేర్లను దస్త్రాల్లో నమోదు చేసి కూలి డబ్బు తీనేస్తున్నారు.



సామాజిక తనిఖీల్లో వెలుగు చూస్తున్నాయి. రికవరీకి ఆదేశిస్తున్నా అనుకున్నంత మేర వసూలు చేయలేకపోతున్నారు. చాలా అక్రమాలు బయటకు రావడం లేదు. ఈ నేపథ్యంలో దొంగ మస్టర్లకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

**యాప్ మార్గదర్శకత్వంలో తనిఖీలు**

సాంకేతిక విభాగాల ద్వారా కూడా దొంగ మస్టర్లకు అడ్డుకట్ట వేయలేకపోవడంతో ప్రస్తుతం పర్యవేక్షణ విభాగాల ద్వారా బోగస్ హాజరును నిలువరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇటీవలే ప్రభుత్వం పర్యవేక్షణ విభాగాలను ఏర్పాటు చేస్తూ ఆదేశాలు ఇచ్చింది. రాష్ట్రస్థాయి, జిల్లా విజిలెన్స్ విభాగాల ఆధ్వర్యంలో పనులు పర్యవేక్షించనున్నారు. ఈ రెండు విభాగాల సిబ్బంది ముందుగా క్షేత్రస్థాయిలో మస్టర్ల నమోదును ఆకస్మికంగా తనిఖీ చేయనున్నారు. ఉపాధిహామీ ఏపీవో మండలంలో నిత్యం రెండు గ్రామాలను విధిగా తనిఖీ చేస్తారు. ఏపీడీ వారంలో రెండు రోజులు పని ప్రదేశాలను పరిశీలించనున్నారు. వీరు ఎక్కడికి వెళ్లాలన్నది యాప్ ద్వారా ఏరోజుకా రోజు సమాచారం వస్తుంది. పర్యవేక్షణ కమిటీల బృందానికీ సమాచారం వెళ్తుంది. మస్టర్లు, కూలీల వివరాల్లో తప్పులు ఉన్నా, తేడాలు కనిపించినా.. అక్రమాలు జరిగినట్ల గుర్తించినా ఎప్పటికప్పుడు చర్యలకు నివేదిస్తారు.

**అంతటా స్వాహా పర్వమే**

వెలుగోడు మండలంలోని ఎనిమిది గ్రామాల్లో దొంగ మస్టర్ల వివరాలు వెలుగులోకి వచ్చాయి. మండల కేంద్రం వెలుగోడులో కొన్ని నెలలుగా పెద్దఎత్తున బోగస్ హాజరు నమోదవడాన్ని సామాజిక తనిఖీల్లో సిబ్బంది గుర్తించారు.కొలిమిగుండ్ల మండలంలో ఆరుగురు మృతుల పేర్లతో బోగస్ హాజరువేసి నిధులు స్వాహా చేశారు.

బేతంచెర్ల మండలంలో 60 మంది కూలీల పేర్లతో నిధులు పక్కదారి పట్టినా క్షేత్ర సహాయకుడు పట్టించుకోలేదని ఉన్నతాధికారులు నివేదిక ఇచ్చారు. పాణ్యం మండలంలో కూడా ఇదే విధంగా నిధులు స్వాహా చేశారు. నందికొట్కూరు, గడివేముల, రుద్రవరం, ఆళ్లగడ్డ, చాగలమర్రి మండలాల్లోని 18 గ్రామాల్లో ఉపాధిహామీ కింద కూలి డబ్బు చెల్లించిన వారిలో హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఐటీ నిపుణులు ఉండటం కలకలం రేపింది.

జాబ్ కార్డులు 2.6 లక్షలు

నిత్యం పనికెళ్లేవారు 2 లక్షలు

పని దినాలు ఏడాదికి 44.99 లక్షలు

వేతనాల ఖర్చు రూ. 107.74

## రెడ్ కాటన్ చీరలో అందాల దివి

బిగ్‌బాస్‌తో ఒక్కసారిగా పాపులారిటీని సొంతం చేసుకున్న ముద్దుగుమ్మ దివి. అంతకు ముందు పెద్దగా ఈ అమ్మడి గురించి ప్రేక్షకులకు తెలియదు. ఎప్పుడైతే ఈ అమ్మడు బుల్లి తెరపై బిగ్ బాస్ ద్వారా అలరించిందో అప్పటి నుంచి ఈ అమ్మడికి సోషల్ మీడియా ద్వారా మంచి క్రేజ్ దక్కింది. అంతే కాకుండా సినిమాల్లోనూ ఆఫర్లు వస్తున్నాయి. ఇటీవల సంక్రాంతి కానుకగా వచ్చిన డాకు మహారాజ్ సినిమాలోనూ ఈ అమ్మడు కనిపించిన విషయం తెల్సిందే. అయితే అందంకు తగ్గట్టుగా మంచి ఆఫర్లు రావడం లేదు అనేది కొందరి అభిప్రాయం. ఈమె అందం సోషల్ మీడియాకే పరిమితం అవుతోంది. సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేసే ముద్దుగుమ్మ దివి మరోసారి తన అందమైన ఫోటోలను షేర్ చేసింది. ఈసారి రెడ్ కాటన్ చీరలో దివి కనిపించింది. పెద్దగా స్కిన్ షో చేయకుండానే నడుము మడతలను చూపిస్తూ దివి కవ్విస్తోంది. టాలీవుడ్‌లో ఉన్న ఎంతో మంది హీరోయిన్స్‌తో పోల్చితే దివి అందం విషయంలో చాలా ముందు ఉంటుంది. అంతే కాకుండా నటనలోనూ ఇప్పటికే చాలా సార్లు నిరూపించుకుంది. అయినా ముద్దుగుమ్మకు



టాలీవుడ్‌లో ఆశించిన స్థాయిలో ఆఫర్లు రావడం లేదు. ఇలాంటి చీర కట్టు ఫోటోల్లో, మోడ్రన్ డ్రెస్‌ల్లో, స్కిన్ షో చేసే ఫోటోల్లో ఈ అమ్మడు అలరిస్తూ వచ్చింది. ఎన్నో సార్లు ఈ అమ్మడి అందాల ఆరబోత ఫోటోలు వైరల్ అయ్యాయి. మరోసారి ఈమె అందమైన ఫోటోలను సోషల్ మీడియాలో నెటిజన్స్ తెగ షేర్ చేస్తున్నారు. సాధారణంగానే చీర కట్టులో దివి చాలా అందంగా ఉంటుంది. ఈసారి అంతకు మించి అందంగా ఉంది అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. సింపుల్ కాటన్ చీరలోనూ ఇంత అందంగా కనిపించవచ్చు అని దివి నిరూపించింది అంటూ నెటిజన్స్ కొందరు ఈమె ఫోటోలను సోషల్ మీడియా ద్వారా షేర్ చేస్తూ తెగ లైక్ చేస్తున్నారు. సినిమాల్లో లీడ్ రోల్స్ కోసం ప్రయత్నాలు చేస్తున్న దివికి చిన్నా చితకా ఆఫర్లు మాత్రమే వస్తున్నాయి. పెద్ద హీరోల సినిమాల్లో చిన్న పాత్రలు, చిన్న హీరోల సినిమాల్లో ఒక మోస్తరు గుర్తింపు ఉన్న పాత్రలను ఈమె చేస్తుంది. కేవలం సినిమాలు మాత్రమే కాకుండా వెబ్ సిరీస్‌ల్లోనూ నటిస్తూ వస్తుంది. గేమ్ షోల్లో అప్పుడప్పుడు కనిపిస్తూ వస్తుంది. సోషల్ మీడియాలో ఎక్కువగా ఈ అమ్మడు సందడి చేస్తూ ఉంటుంది. తెలుగు అమ్మాయి కాకుంటే దివికి కచ్చితంగా టాలీవుడ్‌లో మంచి ఆఫర్లు దక్కేవి అనేది కొందరి అభిప్రాయం.

దివి టాలీవుడ్‌లో కాకుండా ఇతర భాషల్లో ప్రయత్నాలు చేస్తే బాగుంటుంది కదా అని కొందరు కామెంట్స్ చేస్తున్నారు.

## నటీమణులకు వృద్ధాప్యం రాకుండా చికిత్స?

కథానాయికలు తమను తాము తెరపై అందంగా ప్రెజెంట్ చేసుకునేందుకు శస్త్ర చికిత్సలను ఆశ్రయించడం చాలా కాలంగా చూస్తున్నదే. కొన్నిసార్లు చికిత్సలు వికటించి వికృత రూపానికి మారిపోయిన భామలు ఉన్నారు. ముక్కు, పెదవులు, లేదా ముఖానికి శస్త్ర చికిత్సలు చేయించుకుని అందం పెంచుకున్న కథానాయికలు సౌత్, నార్త్ లోను డజన్ల కొద్దీ ఉన్నారు. వారంతా పలు సందర్భాలలో మీడియా ఎదుటే తమకు జరిగిన శస్త్ర చికిత్సల గురించి ఓపెనయ్యారు. అదంతా అటుంచితే, తాజాగా ఓ ఇంటర్వ్యూలో క్వీన్ కంగన, అందం కోసం శస్త్ర చికిత్సలకు సిద్ధమయ్యే నటీమణుల గురించి వివరించిన తీరు ఆశ్చర్యపరిచింది. కొందరు ఫేక్ ఐల్యాష్ , బొటాక్స్ తో వృద్ధాప్యం రాకుండా ఆపేసే ప్రయత్నం చేస్తారని, తాను




అలాంటి కేటగిరీకి చెందనని క్వీన్ కంగన అన్నారు. కంగన వ్యాఖ్యతో నిజంగానే నటీమణులు వృద్ధాప్య ఛాయలు కనిపించకుండా ఇలా చేస్తున్నారా? అంటూ మరోసారి ఇంటర్నెట్ లో డిబేట్ స్టార్టయింది. సినీపరిశ్రమలో కథానాయికలను చిన్న చూపు చూస్తారని, కేవలం 10-15 నిమిషాలు మాత్రమే కనిపించే పాత్రలను మాత్రమే దర్శకులు ఆఫర్ చేస్తారని కంగన విమర్శించారు. అలాంటి దర్శకులతో తాను పని చేయాలా? అని కూడా ప్రశ్నించారు. పద్మావత్ చిత్రంలో తొలిగా తనకు మాత్రమే ప్రధాన పాత్రలో ఆఫర్ ఇచ్చారని, కానీ స్క్రిప్టు అడిగితే ఇవ్వడానికి నిరాకరించినందున ఆ సినిమాని చేయలేదని కూడా కంగన అన్నారు. భన్సాలీ పేరు పెట్టకుండానే వేశ్యల కథలు, పాత్రలతో మల్టీవర్స్ చేసిన దర్శకుడు అంటూ కంగన %-%పద్మావత్%-% గురించి మాట్లాడటం చర్చకు వచ్చింది. స్క్రిప్టు ఇవ్వరు.. కనీసం పాత్ర ఏమిటన్నది చెప్పరు! అని కూడా కంగన నర్మగర్భంగా భన్సాలీని, ఆయన లాంటి పెద్ద దర్శకులందరినీ టార్గెట్ చేసింది క్వీన్ కంగన.





## మెగా ఫ్యాన్స్ ఆశలన్నీ ఆ సినిమాపైనే..!





మెగా ఫ్యామిలీకి లాస్ట్ ఇయర్ బాగా కలిసొచ్చిందని అభిమానులు సంబరాలు చేసుకున్నారు. చిరంజీవిని 'పద్మవిభూషణ్' వరించడం, గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో ఎక్కడం, ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో జనసేన పార్టీ విజయం సాధించి పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టడం, చెన్నై వేల్స్ యూనివర్శిటీ నుంచి రామ్ చరణ్ గౌరవ డాక్టరేట్ పొందడం, నాగబాబుకు ఏపీ మంత్రి వర్గంలో చోటు ఖరారవ్వడం.. ఇవన్నీ మెగా ఫ్యాన్స్ ను ఉత్సాహ పరిచాయి. కానీ సినిమాల పరంగా మాత్రం వారు చాలా నిరుత్సాహానికి గురవుతున్నారు. మెగా హీరోలు గత కొన్నాళ్లుగా బాక్సాఫీస్ దగ్గర సరైన విజయాలు అందుకోలేకపోతున్నారు. 'భోళా శంకర్'తో చిరంజీవి భారీ డిజాస్టర్ చవి చూశారు. మెగా మేనమామ-మేనల్లుడు పవన్ కల్యాణ్, సాయి ధరమ్ తేజ్ తొలిసారిగా కలిసి నటించిన 'బ్రో' సినిమా ఆశించిన సక్సెస్ సాధించలేదు. వరుణ్ తేజ్ సోలోగా హిట్టు కొట్టి చాలా ఏళ్లైంది. 'గని', 'గాండీవధారి అర్జున', 'ఆపరేషన్ వాలెంటైన్', 'మట్కా' సినిమాలు దారుణంగా ఫెయిల్ అయ్యాయి. 'ఉప్పెన' తర్వాత వైష్ణవ్ నటించిన ఒక్క సినిమా కూడా హిట్టవ్వలేదు. చివరగా వచ్చిన 'ఆదికేశవ' డిజాస్టర్ అయింది. ఇక రామ్ చరణ్ సోలోగా సక్సెస్ సాధించి ఏళ్లు గడిచిపోయింది. తన తండ్రితో ఫస్ట్ టైం పూర్తి స్థాయిలో స్క్రీన్ షేర్ చేసుకున్న 'ఆచార్య' మూవీ డిజార్డర్ గా మారింది. RRR స్టార్ డమ్ కూడా ఈ చిత్రాన్ని కాపాడలేకపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో 'గేమ్ ఛేంజర్' సినిమాతో చెర్రీ సోలోగా బ్లాక్ బస్టర్ హిట్టు కొట్టి చూపించాలని మెగా అభిమానులు బలంగా కోరుకున్నారు. కానీ సంక్రాంతికి రిలీజైన ఈ చిత్రం కూడా తీవ్ర నిరాశ పరిచింది. దీంతో నెట్టింట యాంటీ ఫ్యాన్స్ నుంచి విపరీతమైన ట్రోలింగ్ ఎదుర్కోవాల్సి వచ్చింది. 'గేమ్ ఛేంజర్' చిత్రానికి మిక్స్డ్ టాక్ వచ్చినప్పటికీ, ఓపెనింగ్ డే భారీ వసూళ్లను రాబట్టినట్లుగా గొప్పగా చెప్పుకున్నారు. రెండో రోజు నుంచి మేకర్స్ కూడా సైలెంట్ అయిపోయారు. ఫస్ట్ వీకెండ్ వరకూ సోషల్ మీడియాలో డిపెండ్ చేసుకుంటూ వచ్చిన ఫ్యాన్స్ సైతం.. ఆ తర్వాత మెల్లిమెల్లిగా రిజల్ట్ ను యాక్సెప్ట్ చేయడం మొదలుపెట్టారు. కానీ ఎన్నో హోప్స్ పెట్టుకున్న సినిమా డిజాస్టర్ అయిందనే విషయాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో రాబోయే 'విశ్వంభర' మూవీ ఈ గాయాన్ని మర్చిపోయేలా చేస్తుందని భావిస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సోషియో ఫాంటసీ యాక్షన్ అడ్వెంచర్ మూవీ "విశ్వంభర". సంక్రాంతికి ఈ సినిమానే విడుదల అవ్వాల్సింది. కానీ రామ్ చరణ్ మూవీ కోసం వాయిదా వేసుకున్నారు. సమ్మర్ స్పెషల్ గా రిలీజ్ చెయ్యాలని మేకర్స్ ప్లాన్ చేసుకున్నారు. ఈ సినిమా మంచి సక్సెస్ సాధిస్తే, మళ్ళీ సెలబ్రేషన్స్ మోడ్ లోకి వచ్చేయొచ్చని ఫ్యాన్స్ అంతా ఎదురు చూస్తున్నారు. రిలీజ్ డేట్ ఫిక్స్ చేసిన తర్వాత ఈ సినిమాకి సోషల్ మీడియాలో డ్యూటీ చెయ్యాలని నిర్ణయించుకున్నారు. నిజానికి మెగా ఫ్యాన్స్ కోసం 'విశ్వంభర'తో పాటుగా 'హరి హర వీరమల్లు' సినిమా కూడా రాబోతోంది. మార్చి 28న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని నిర్మాతలు ప్రకటించారు కూడా. కానీ పవన్ కల్యాణ్ షూటింగ్ ఇంకా పెండింగ్ ఉండటం, ఈ గ్యాప్ లో ఆ డేట్ మీద మరికొన్ని ఇతర సినిమాలు కర్చీఫ్స్ వేస్తుండటంతో.. వీరమల్లు రాకపై అందరిలో సందేహాలు మొదలయ్యాయి. అందుకే చిరంజీవి చిత్రం మీదనే ఇప్పుడు అభిమానులు ఆశలు పెట్టుకున్నారు. మరి ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సక్సస్ సాధిస్తుందో వేచి చూడాలి. ఇకపోతే పవన్ కల్యాణ్ ప్రస్తుతం నటిస్తున్న వీరమల్లు, OG.. సాయి దుర్గ తేజ్ 'SYG - సంబరాల ఏటిగట్టు' సినిమాలు ఈ ఏడాదే విడుదల కాబోతున్నాయి. మరోవైపు రామ్ చరణ్ ఇప్పుడు బుచ్చిబాబు సినిమా షూటింగుతో బిజీగా ఉన్నారు. మేర్లపాక గాంధీతో వరుణ్ తేజ్ ఒక హార్రర్ కామెడీ సెట్స్ మీదకి తీసుకెళ్లడానికి రెడీ అవుతున్నారు. ఇవి కాకుండా మెగా హీరోలు కొన్ని క్రేజీ ప్రాజెక్ట్స్ లైన్ లో పెట్టారు. వారిలో చిరంజీవి బ్యాక్ టూ బ్యాక్ అనౌన్స్ మెంట్స్ తో రాబోతున్నారు.

## 'డాకు మహారాజ్' సక్సెస్ రీజన్స్..!



నందమూరి బాలకృష్ణ హీరోగా బాబీ దర్శకత్వంలో నాగవంశీ నిర్మించిన 'డాకు మహారాజ్' సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. వంద కోట్లకు మించి వసూళ్లు సాధించి ఇప్పటికే ఇతర ఏరియాల్లో బ్రేక్ ఈవెన్ సాధించిన ఈ సినిమా లాంగ్ రన్‌లో భారీ వసూళ్లను సొంతం చేసుకుని బాలకృష్ణ కెరీర్‌లో అతి పెద్ద విజయాన్ని నమోదు చేసే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. వరుసగా నాల్గవ విజయాన్ని బాలకృష్ణ తన ఖాతాలో వేసుకున్నారు.

బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ విజయాన్ని నమోదు చేసిన డాకు మహారాజ్ సినిమా ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. డాకు మహారాజ్ ఇంతటి సక్సెస్‌ని సొంతం చేసుకోవడంలో కొన్ని అంశాలు కీలకంగా ఉన్నాయి. దర్శకుడు బాబీ ఎంపిక చేసుకున్న కథనం. కథ సింపుల్‌గా ఉన్నా కథనంతో దర్శకుడు సినిమాపై ప్రతి నిమిషం ఆసక్తి పెంచే విధంగా సన్నివేశాలు రూపొందించారు. నిర్మాత నాగవంశీ విడుదలకు ముందు అన్నట్లుగానే ప్రతి సన్నివేశం ఫ్యాన్స్‌కి హై మూమెంట్‌ని కలిగిస్తున్నాయి. అంతే కాకుండా సినిమాలోని యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. బాలకృష్ణ ఫ్యాన్స్‌కి కిక్ ఇచ్చే విధంగా యాక్షన్ సన్నివేశాలతో పాటు మాస్ సాంగ్స్ ఉన్నాయి. ముఖ్యంగా దబిడిదిబిడి సాంగ్‌కి ఫ్యాన్స్ నుంచి మంచి స్పందన దక్కింది. సినిమాలోని పాటలు, యాక్షన్ సన్నివేశాలు, ఇంటర్వెల్ సీన్ ఇలా ప్రతి ఒక్కటీ ఆకట్టుకునే విధంగా ఉన్నాయి. ముఖ్యంగా సినిమాలోని బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ ఆకట్టుకుంది. దర్శకుడు బాబీ ఆలోచనకు తగ్గట్టుగా సంగీత దర్శకుడు తమన్ వర్క్ చేశాడు. పాటలతో పాటు బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తో తమన్ ప్రేక్షకులకు కిక్ ఇచ్చాడు. ఇక నిర్మాత నాగవంశీ ఈ సినిమాను ప్రమోట్ చేసిన తీరు బాగుంది. విడుదలకు ముందు సాధ్యం అయినంత ఎక్కువగా సినిమాను వార్తల్లో ఉండేలా చేశాడు. సందర్భానుసారంగా సినిమా ఈవెంట్స్‌ని నిర్వహించారు. ఏకంగా అమెరికాలోనూ సినిమా ఈవెంట్స్ నిర్వహించడం వల్ల అంచనాలు పెంచారు. ఇక బాలకృష్ణ మరోసారి తన ఫ్యాన్స్‌ను మెప్పించే విధంగా భారీ యాక్షన్ సన్నివేశాలతో పాటు, డాన్స్ మూవ్‌మెంట్స్, కామెడీ టైమింగ్ సన్నివేశాల్లో నటించి మెప్పించాడు. మొత్తంగా సినిమాలో డాకు మహారాజ్ లుక్‌తో పాటు, ఇతన లుక్ లోనూ అలరించాడు. బాలకృష్ణ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిస్తే బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సినిమా స్థాయిని లేపింది. దర్శకుడు బాబీ తన కథనంతో ప్రేక్షకులను సీట్లలో కూర్చో బెడితే... నిర్మాత నాగవంశీ తన ప్లానింగ్‌తో సినిమాను జనాల్లోకి తీసుకు వెళ్లడంలో సక్సెస్ అయ్యారు. ఇక హీరోయిన్స్ సైతం తమ పాత్రలకు న్యాయం చేశారు. మాస్ ఆడియన్స్‌ను అలరించే విధంగా ఊర్వశి రౌతేలా ఆకట్టుకుంది. ఫ్యామిలీ ఆడియన్స్‌ను మెప్పించే విధంగా ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ లు నటించారు.

## మీనాక్షి స్కూల్ క్రష్.. అందుకే మీనూగా బాగా యాక్ట్!


సంక్రాంతికి వచ్చిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకు బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ టాక్ దక్కింది. ఇప్పటికే రూ.100 కోట్ల షేర్‌ను వసూళ్లు చేసి రికార్డ్ బ్రేక్ చేసిన ఈ సినిమా లాంగ్ రన్‌లో మరెన్నో రికార్డ్‌లు బ్రేక్ చేయడం ఖాయం అంటూ బాక్సాఫీస్ వర్గాల వారు నమ్మకంగా ఉన్నారు. సినిమాకు సంబంధించిన ప్రమోషన్ కార్యక్రమాల్లో హీరోయిన్స్ ఇద్దరు మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ ఎంతగా సహకరించారో మనం చూశాం. దర్శకుడు అనిల్ రావిపూడి ఏది అనుకుంటే అది, ఎలా అనుకుంటే అలా ఇద్దరు హీరోయిన్స్ నటనతోనూ సినిమాలో అలరించారు. ఐశ్వర్య రాజేష్ చీర కట్టులో అలరిస్తే మీనాక్షి చౌదరి పోలీస్ ఆఫీసర్‌గా మంచి లుక్‌లో ఆకట్టుకుంది. మీనాక్షి చౌదరిని ఇప్పటి వరకు చూడని పాత్రలో చూపించిన దర్శకుడు అనిల్ రావిపూడి ఆమెను ప్రమోషన్ సమయంలోనూ విభిన్నంగానే చూపించాడు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మీనాక్షి చౌదరి మాట్లాడుతూ తనకు స్కూల్ టైంలో టీచర్‌పై క్రష్ ఉండేదని చెప్పుకొచ్చింది. నేను ఒక్కదాన్ని మాత్రమే కాకుండా మా క్లాస్‌లో ఉన్న వారు అంతా ఆ



సర్ గురించి మాట్లాడుకునే వాళ్లం. అమ్మాయిలందరికీ ఆయన మీద కన్ను ఉండేది. అందుకే సంక్రాంతికి వస్తున్నాం సినిమాలో ట్రైనర్ అయిన వెంకటేష్ గారితో నేచురల్‌గా నటించాను అంది. లవ్ సీన్స్‌లో యాక్టింగ్ బాగుంది అంటే ప్రేమలో పడాలి లేదా ప్రేమను అంతకు మించి ఎక్స్‌పీరియన్స్ చేసి ఉండాలి అంటారు. స్కూల్ డేస్‌లో మీనాక్షికి టీచర్ క్రష్ కావడం వల్లే మీనూ పాత్రను అద్భుతంగా చేసింది. ఆ విషయాన్ని ఆమె స్వయంగా ఒప్పుకుంది. ఇలాంటి విషయాలను సాధారణంగా హీరోయిన్స్ ఒప్పుకోరు. కానీ మీనాక్షి చౌదరి తన రహస్యాన్ని అందరి ముందు చెప్పేసింది. మీనాక్షి చౌదరి గత ఏడాది లక్కీ భాస్కర్ సినిమాతో సూపర్ హిట్ దక్కించుకుంది. ఇప్పుడు మరో విజయాన్ని సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో దక్కించుకుంది. గత సంక్రాంతికి గుంటూరు కారంతో వచ్చిన ఈ అమ్మడు ఈసారి సంక్రాంతికి గట్టి విజయాన్ని కొట్టింది. దిల్ రాజు బ్యానర్‌లో అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో ఈ అమ్మడికి మరిన్ని ఆఫర్లు దక్కే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే నవీన్ పొలిశెట్టితో ఈ అమ్మడు ఒక సినిమాను చేస్తుంది. అంతే కాకుండా సితార ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌లో రెండు మూడు సినిమాలను ఈమె కమిట్ అయ్యిందని వార్తలు వస్తున్నాయి. మరో వైపు దిల్ రాజు బ్యానర్‌లోనూ ఈమె ఒక సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొత్తంగా రాబోయే ఏడాది కాలంలో ఈ అమ్మడి నుంచి మినిమం ఐదు సినిమాలు అయినా వచ్చే అవకాశాలు ఉన్నాయి.

## యంగ్ బ్యూటీ కవ్వింత

క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ తో కిల్ చేయడంలో త్రిధా చౌదరి తర్వాతే! త్రిషకు మోడ్రన్ వెర్షన్ లా కవ్విస్తుంది ఈ బ్యూటీ. టాలీవుడ్ యంగ్ హీరోల సరసన వరుసగా అవకాశాలు అందుకుంది. 'సూర్య వర్సెస్ సూర్య' చిత్రంలో నిఖిల్ సరసన నటించిన ఈ భామ ఆ తర్వాత 'మనసుకు నచ్చింది' అనే చిత్రంలోనూ నటించింది. సెవెన్, అనుకున్నదొక్కటి అయినదొక్కటి చిత్రాల్లోను నటించింది. జయాపజయాలకు అతీతంగా నేటితరం హీరోలకు త్రిధా మంచి ఆప్షన్. ఇటీవల స్పాట్ లైట్ అనే వెబ్ సిరీస్ లో త్రిధా అందాలు ఆరబోసిన తీరు చర్చగా మారింది. వెబ్ సిరీస్ ఆద్యంతం వేడెక్కించే లిప్ లాక్ లతో గుబులు పెంచింది. ఆ తర్వాత బాలీవుడ్ లో 'షంషేరా'లాంటి భారీ చిత్రంలోనూ నటించింది. కానీ ఇవేవీ తన



ఫేట్ ని మార్చలేకపోయాయి. వీటన్నిటినీ మించి త్రిధా పట్టుదల ఆశ్చర్యపరుస్తోంది. సోషల్ మీడియాల్లో ఈ భామ జరంత స్పీడ్ కనబరుస్తోంది. ఇన్ స్టాలో నిరంతరం వేడెక్కించే ఫోటోషూట్లతో తన ఫాలోవర్స్ ని యంగేజ్ చేస్తోంది. తాజాగా త్రిధా షేర్ చేసిన కొత్త ఫోటోగ్రాఫ్ గుండెల్లో గుబులు పెంచుతోంది. ఈ ఫోటోగ్రాఫ్ లో త్రిధా బ్లూ అండ్ బ్లూ లుక్ లో కనిపించింది. శరీరాన్ని అతుక్కుపోయే బ్లూ టాప్ ని ధరించి, టైట్ ట్రాక్ లో హీట్ పెంచింది త్రిధా. త్రిధా ఫోటోషూట్ ఇప్పుడు యూత్‌లో హాట్ టాపిక్ గా మారింది. క్యూట్ బ్యూటీ సో హాలి అంటూ ఫ్యాన్స్ ఘాటైన కామెంట్లు చేస్తున్నారు. త్రిధా అందచందాలకు ముగ్ధులవుతున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్ ని వాట్సాపుల్లోను జోరుగా వైరల్ చేస్తున్నారు. త్రిధా నెక్ట్స్ ఏంటి? అంటే.. దానికి తన నుంచే సరైన సమాధానం రావాల్సి ఉంది. ఇటీవల బెంగాలీ చిత్రం 'బూమరాంగ్'లో కనిపించింది. తదుపరి దక్షిణాదిన మరిన్ని కథలు వింటోందని సమాచారం. ఈ బ్యూటీ టాలీవుడ్ లో బౌన్స్ బ్యాక్ అయ్యేందుకు దర్శకనిర్మాతలను సంప్రదిస్తోందని సమాచారం. కథలు వింటూ, సరైన అవకాశం కోసం ప్రస్తుతం వేచి చూస్తోంది. తెలుగులో తదుపరి చిత్రాన్ని ప్రకటించడానికి కొంత సమయం పట్టొచ్చని చెబుతున్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536